C

శ్రీరామాయణమః

శ్రీ రామాయణ వివర్ణామృతము

(వాల్మీకి)

పాత్రరచన



పొన్నాడ సుబ్రహ్మణ్య శర్మ

(గ్రంథకర్త)

294.5922
K48

ముద్రణసంధాత

శ్రీ మైలవరపు సూర్యప్రకాశరావు

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

శ్రీరామాయణమః

శ్రీ రా మా య ణ ము ల వి మ ర్శా త్మ క ము

(వా ల్మీ కి)

:పా త్ర ర చ న:

ఆంధ్ర పాఠకులకు సంపా
దకులకు సమీక్షకులకు
ఉగాది అభివందనములతో
(Personal) సమర్పిస్తూ
ప్రేమాభినందనలతో

రచన

డాక్టరు పొన్నాడ సుబ్రహ్మణ్యము 2.4.73

V.R NARLA MEMORIAL
V.R NARLA DPRI
Acc. No. 11721

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11721

ము ద్ర ణ వం ధా త

శ్రీ మైలవరపు సూర్యప్రకాశరావు

హక్కులు : గ్రంథకర్తవి

ప్రతులు - 1000

294.5922
SUB

ప్రతులకు

డాక్టరు - పొన్నాడ సుబ్రహ్మణ్యము

Door No. 5-3-220.

4వ లైను బ్రాడీపేట

గుంటూరు-2

ఆంధ్ర ప్రదేశ్

ఆవిష్కరణము

December - 1972

ముద్రణ

పి. రామకృష్ణమూర్తి

మేనేజింగ్ డైరెక్టరు

వెల్‌కం ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్

2వ లైను బ్రాడీపేట, గుంటూరు-2

AOOAIOUB137



శ్రీరామపట్టాభిషేకము

అంకితము

నిరతాగ్నిహోత్రులు, నిత్యకర్మానుష్ఠాతలు
యణ పారాయణపరులు, వేదాంతపారీణులు
శ్రీ కళ్యాణానందభారతీ మాంతాచార్యుల
పూర్ణదీక్షాపరులు, రాజకీయోద్యోగులు, అ
పాములునగు కీ॥ శే॥ పొన్నాడ రామకో
సాదరపూర్వకముగా నంకితము చేయుడమై



పొన్నాడ రామకోటియజ్వ (R
ధర్మపత్ని అన్నపూ

(కీ॥ శే॥ పొన్నాడ రామకోటి సోమయాజిగారి

స్మారకార్థము)

పద్యరత్నములు

సీ॥ పొన్నాడవంశాబ్ధి పూర్ణశశాంకుడై
రామకోట్యాభిఖ్య రాణమీరె
సంస్కృతాంధ్రాంగ్లేయ సాహిత్యశీలుడై
సాటివారలలోన మేటియయ్యె
రాజకీయోద్యోగరాజితుడై కీర్తి
గాంచెను సమలోష్టకాంచనుడన
తనకులాచారోచితంబుగ నిత్యనై
మిత్తికర్మల బేర్మిజరిపె
పాకయజ్ఞంబులవరగనన్నిటి దీర్చి
శ్రౌతయజ్ఞంబుల శ్రద్ధనడిపె
పరదేవతాసేవపాటించె నిరతంబు
మంత్రతంత్రాత్మకంబైన సరణి
భక్తిగీతాధికభాష్యత్రయంబును
పఠనపాఠనముల బరగచేసె
అతిథి యభ్యాగత వితతికి నిరతంబు
మృష్టాన్నదాతయై మేల్మిగాంచె

గీ॥ కల్మిచేడియ వాక్కాంత కలహాముడిగి
తన్ను సేవింప నిరతంబుమన్నవగనె

నేడుదివిజేరే భువివీడి నిశ్చయముగ
రామకోట్యాఖ్యమీరిన సోమయాజి.

తే॥ గీ॥ ధరనిదంబ్రాహ్మ్య మిదంతాత్రమను నుడివిని
సార్థకంబుగ స్వీయమాసరణిదోప
లాక్ష్యవైదికములరెంట లాఘవముగ
నలరి దివికేగె రామకోట్యాఖ్యుడహహా ॥

తే! గీ॥ జగతి నార్వేలనిద్యోగి-శాఖయందు
జనన మొందినవారిలో ఘనుడనంగ
వేదచోదితకర్మలు విహితరీతి
భక్తినాజీవితంబును వరలజేసె
రామకోట్యాఖ్యమీరిన సోమయాజి ॥

బుధవిధేయుడు,

యల్లాప్రగడ వెంకటసుబ్రహ్మణ్య పాకయాజి.

కరణము :- శిరిపూడి, రేపల్లెతాలూకా,
గుంటూరుజిల్లా.

పద్యరత్నములు

మ॥ తినవుద్యోగమునందు లంచములు నర్థం విష్ణుతుల్యుం గృతా।
ర్థుని గావించెద విష్టసత్కృతుల బంధుల్ సత్కవుల్, మిత్రులిం
లునిలంబ్రత్యహమిచ్చ గూర్చువడుగంటన్ బ్రొయ్యికిన్ బ్రార్థించిన
న్నసయంబున్ బరితుష్టుచేతు వెవరయ్యా నింకనిన్బోలగన్॥

మ॥ నిరతాగ్నీ! భగవదగ్నులారకయె నిన్నేగాదు నీదేహమున్
మరణంబొందినై న వీడక చితిన్ మాన్యస్థితించెంది దుర్భర
మైనన్సహియించి కష్టమును బుత్రశ్రేష్ఠపూజావిధిన్
గరముప్పొంగి కృతార్థతంగనుట భాగ్యంబేరికిట్లబ్బునే॥

ఉ॥ "నిండుమనంబు నవ్వనవనీత సమానము, పల్కుదారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు నిక్క
మన్"
పండితసత్కవీంద్ర కృతపద్యము నీయెడ నర్థవంతమై
నిండుగొనెన్ త్వదన్యులననింద్య చరిత్ర! పవిత్రసంభవా!

విధేయుడు,

ఆశుకవి సమ్రాట్ కొప్పరపు బుచ్చిరామ శతావధాని.
కొప్పరము :— నరసరావుపేట,
గుంటూరు జిల్లా.

మనవి

ఈగ్రంథము ప్రాసి షుమారు ౬ సంవత్సరములయినది. కారణాంతరములవలన దీనిని అచ్చువేయించుట కవకాశము కలుగలేదు. నేడు నాకత్యంత సన్నిహితబంధువు, సహృదుడు నైన శ్రీ మైలవరపు సూర్యప్రకాశరావుగారీగ్రంథము నచ్చి ప్రత్తించుట కంగీకరించిరి. వారు జిల్లాపంచాయితీ ఆఫీసరు ఉద్యోగము చేసి, రిటైరులయి, ప్రస్తుతము వారిస్వగృహాము (అచ్యుత నిలయము, ప్రొడ్డుపేట గుంటూరు) నందు నివసించుచున్నారు. నేనడుగకమునుపే వారీయభిప్రాయమును వెలిబుచ్చి నన్ను కార్యారంభమునకు ప్రోత్సహించినందులకు నేనెంతయు కృతజ్ఞుడను.


ఈముద్రణము వారి ధర్మపత్ని కీ॥ శే॥ శ్రీమతి గౌతమి గారి జ్ఞాపకార్థము వేయబడినది. ఆమె ఆదర్శధర్మపత్ని, బంధు ప్రియురాలు, సహనశీల. ఆ సాధ్వి జ్ఞాపకార్థమీముద్రణము జరుగుట నాకెంతయు ముదావహము. శ్రీ పరమేశ్వరి యామె ఆత్మకు శాంతికలుగచేయుచూ, శ్రీ ప్రకాశరావుగారికి వారి కుటుంబమునకు ఆయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించుగాక!

ఇట్లు,

ప్రొడ్డుపేట
గుంటూరు
1-12-72

పొన్నాడ సుబ్రహ్మణ్య శర్మ.

మధుర స్మృతి




కీ॥ శే॥ శ్రీమతి మైలవరపు గౌతమి

పుడమి బంధుమిత్రుల వీడిపోతివీవు ఈశ్వరుడనంతశాంతి నీకిచ్చుగాక
చేరవలసినది పరము ఏర్పాటైన అతివగో! మబువలేని విస్మృతులునీవి.

జనవం 20-1-1917 నిర్యాణం 7-11-71

ముద్రణ సంధాత



యం. యస్. ప్రకాశరావు, B. A.

రిజైర్డు డిస్ట్రిక్టు పంచాయతి ఆఫీసరు.

విషయసూచిక

పురుషులు

	విషయము	పేజీలు
1.	శ్రీరామచంద్రుడు	1– 49
2.	లక్ష్మణుడు	50– 63
3.	భరతుడు	64– 77
4.	శత్రుఘ్నుడు	78– 81
5.	దశరథుడు	81– 90
6.	హనుమంతుడు	90–112
7.	విశ్వామిత్రుడు	113–120
8.	వాలి	120–124
9.	రావణుడు	124–138
10.	ఆదిత్యహృదయము	139–140
11.	కుంభకర్ణుడు	141–142
12.	విభీషణుడు	142–147
13.	ఇంద్రజిత్	147–148
14.	మారీచుడు	149
15.	పురుషపాత్రలు–(శేషము)	149–150 B
16.	సమీక్ష	151–152

స్త్రీ లు

విషయము	పేజీలు
1. సీతాదేవి	150–170
2. దశరథుని భార్యలు	170–172
3. సుమిత్ర	172–174
4. కైక	174–176
5. మంథర	176–178
6. తార	178–182
7. శూర్పణఖ	182–184
8. స్త్రీపాత్రలు–(శేషము)	184–187
9. స్త్రీపాత్రలు – సమీక్ష	188–190

పీఠిక

కూజన్తం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్యకవితాశాఖాం వన్దే వాల్మీకికోకిలమ్॥

భారతీయవాఙ్మయమున అనేకవిషయములను బోధించుచు విపులస్వరూపమును గల్గియున్న పురాణగ్రంథములెన్నియో యున్నవి. వానిలో అక్షరజ్ఞానముగల భారతీయునికి దెలిసినగ్రంథములు మూఁడేమూఁడు గలవు. అవి- రామాయణము, భారతము, భాగవతమును. వేదోక్తధర్మములు దెలిసినవారలకుఁ దెలియనివారలకుఁ గూడ నీమూఁడుగ్రంథములు నుపాదేయములే. అందు వాల్మీకిరామాయణము నాధారముగాఁజేసికొని కొన్ని చేర్పులతోడను మార్పులతోడను అధ్యాత్మరామాయణము వాసిష్ఠరామాయణము మున్నగు రామాయణములెన్నియో బయల్వెడలినవి. వానివిషయమెట్లున్నను మనకుఁ బ్రకృతము వాల్మీకిరచితరామాయణమే.

ఈవాల్మీకమును శ్రద్ధతోఁబఠించు జనులు మూఁడు విధములనున్నారు. అందొకరు వాల్మీకిరామాయణము త్తమకావ్యము. ఇందలిపాత్రముల శీలములు వాల్మీకిచే నత్యుత్తమములుగ నిరూపింపబడినవి. భావములుగాని వర్ణనములుగాని యత్యన్తరమణీయములు. భాషయు ద్రాక్షామధురము. దీనిని జదువుచున్నపుడు తన్మయతగల్గునని తలంతురు.

రెండవవారు - రామాయణము శ్రీమహావిష్ణుచరితము. దీనినిబఠించినచో నుత్తమపుణ్యముగల్గును.

"వేదవేద్యోపరేపుంసి జాతే దశరథాత్మజే।

వేదఃప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥"

అని భావించుచు, ఉదాత్తాదిస్వరనియమములతోడను వర్ణోచ్చారణాదినియమములతోడను నుచ్చరింప శక్యముగాని వేదమును బఠింపనశక్తులకు ఈరామాయణపాఠమువలననే యట్టిపారాయణ ఫలముగల్గునని భావింతురు. వీరలకు అర్థజ్ఞానముతో నెంతమాత్రము సంబంధము లేదు.

ఇంకమూఁడవవారు– రామాయణపాఠమువలనఁ దాము కావ్యామృతరసాస్వాదము ననుభవించుచు భక్తితత్పరతోఁ బరమేశ్వరావతారుఁడగు శ్రీరామచంద్ర పరబ్రహ్మమూర్తి యను గ్రహపాత్రులమైతిమని భావించెడివారు.

వాల్మీకి దనరామాయణమునందలి సర్వవిషయములను అనఁగా రహస్యవృత్తాంతములుసైతము తాను బ్రాచీనాగ్రములగు దర్భలయందుఁ బవిత్రుఁడుగా నుపవిష్టుఁడై యోగదృష్టితోఁ గరతలామలకముగఁ దెలిసికొంటినని చెప్పెను. ఇట్లు వీగ్రంథకర్తయును దనగ్రంథమునఁదలి విషయములన్నియు యథార్థములేయని వాల్మీకివలె సత్యప్రతిజ్ఞ చేసి చెప్పియుండలేదు.

కావున వాల్మీకి దనగ్రంథమునందుఁ దెల్పినవిషయములన్నియు యథార్థములేయని ప్రామాణికులు నమ్ముదురు. కావునఁనే యిందుఁ బ్రధానపాత్రలుగాఁ బేర్కొనఁబడిన హనుమత్సుగ్రీవాదివానరులు దివ్యాంశసంభూతులై యమానుషములగు కార్యముల నొనర్చుట సంభవమేయని వారలభావన. కావున నట్టివారలయందు నేటిమనశక్తిసామర్థ్యముల నూహించుట పొరపొచ్చెము కాఁగలదు.

రామాయణమునందు రామచంద్రుని భగవత్తత్వము కొలఁది తావులయందే తెలుపఁబడినది. మిగిలిన చోటు లందా తని యుత్తమమానవత్వము మాత్రము నిరూపింపఁబడినది. ఆద్యమగు నారదోక్తమూలరామాయణమున నాతని సుగుణ గణములన్నియు నొక్కచోఁ బేరొక్కనఁబడినవి. ఆగుణములే రామాయణమునందలి శ్రీరామ జీవితమునందు వ్యక్తములగు చున్నవి. అవన్నియు నుత్తమమానవుని గుణములేగాని మాన వాతీత గుణములుగావు. కావున రాముఁ డాదర్శమానవుఁడని భావనసేయువారలకు ఆతనిగుణగణము లభ్యసింపఁదగినవే యగును. అట్లభ్యసించినవారలు గూడఁ దమసాటివారలకు నాదర్శపురుషులు కాఁగలరు. కావున రామాయణగ్రంథము జనుల నుత్తమమానవులనుగాఁ జేయుననునది యథార్థమే. భాగవతాది గ్రంథములందుఁ దెలుపఁబడిన భగవదంశ సంభూ తులగు శ్రీకృష్ణాదులు జనులకు భక్తిభావసముద్బోధకములే గాని సమగ్రాదర్శభూతములు కానేరవు. వానియందు మాన వాతీతములగు భగవల్లీలలే హెచ్చుగాఁ గానవచ్చుచున్నవి. కావున సామాన్యమానవున కవ్వారలను భక్తిభావముతోఁ గొలువవలసివచ్చేగాని వారలప్రవృత్తి ననుసరించుట కవకాశము లేదు.

భగవదవతారములన్నింట శ్రీరామకృష్ణావతారములు రెండే భారతభూమియందలి విశేషజనానీకమునకుఁ దెలిసినవి. వానిలోఁ గృష్ణావతారత్వ ముత్తరభారతమున మిక్కిలి యాదరపాత్రముకాఁగా శ్రీరామావతారత్వము ఆంధ్రుల కతిప్రీతిప్రదమయ్యెను. దీనికిఁ బ్రమాణము ప్రతిగ్రామమునం

దును శ్రీరామభజనమందిరములు వెలయుటయే. దీనినిబట్టి యాంధ్రులకు శ్రీకృష్ణుని భగవత్తత్త్వముకంటె శ్రీరామచంద్రుని సుగుణసంపదయే యభీష్టమైనదనిపించును.

శ్రీమద్వాల్మీకిరామాయణము ఉత్తరకాండముతోఁ గూడ సప్తకాండపరిమితమై శ్రీరామచరితమును సంపూర్ణముగ బోధించుచున్నను బవిత్రగ్రంథమను దృష్టితోఁ బారాయణముసేయు భక్తులందఱును కాండషట్కపరిమితముగా రామాయణమునే స్వీకరింతురు. దానికిహేతువు శ్రీరాముల జీవితములయందలి తుదిఘట్టము సప్తమకాండమందు వర్ణింపఁబడుటయే యని దోఁచును. కాండషట్కపరిమితమగు రామాయణమునే శ్రీరామపట్టాభిషేకముతోఁ బరిసమాప్తము గుచు మంగళాంతమగుచుండఁగా నీయుత్తరకాండాంతమగు రామాయణము తద్విపరీతమగుచున్నది. అట్లయ్యు నుత్తరకాండమును ద్యజించినచో శ్రీరామచరితము సంపూర్ణము కాదుగావున నయ్యది తప్పక చదువఁదగినదేయని నాయాశయము. ఉత్తరకాండ గతవిషయమును గమనించినచో భారతమునకు హరివంశమువలె రామాయణమున కయ్యదియును బద్ధమని తప్పక దోఁచును. దీనిలోని విశేషభాగము రామాయణకథకఁ బూర్వవృత్తము. అద్దానిఁజదివినచో రామాయణమునందుఁ గల్గు కొన్నిసంశయములు తొలఁగును. రామాదుల యుత్తరవృత్తాంతమందు వర్ణితమగుటచే నద్దానికాపేరు అన్వర్థమైనది. రామాయణ మిరువదినాల్గువేల శ్లోకపరిమితమనియు నదిగాయత్రీమంత్ర వర్ణసంకలితమనియుఁ దెల్పువారలయాశయముఉత్తరకాండమతోడనే యను ప్రాణితమగుచు

న్నది. కావున నీయు త్తరకాండముకూడ శ్రీమద్రామాయణాం తర్గతమని ప్రామాణికుల భావము.

సంస్కృతవాఙ్మయమున నేటికి అపారమగు పురాణేతి హాసాది సంపదయున్నను వానియన్నింటను సత్యున్నతకావ్య ముగా నెన్నఁదగిన భాగ్యమీవాల్మీకమునకే దక్కినది. కవి యనఁగా వాల్మీకియే యనియు నట్టికవినామమును ధరింపఁ దాననర్హుఁడనియుఁ గాళిదాసు —

"మందకవి యశఃప్రార్థీ గమిష్యామ్యపహాస్యతామ్ ।
ప్రాంశులభ్యే ఫలేలోభాదుద్బాహురివ వామనః ॥

అని చెప్పియున్నాఁడు.

అట్టి యీ యుత్తమరామాయణముపై నుత్తమవి మర్శగ్రంథము నేటివఱకు మన యాంధ్రభాషయందు లేకపోవుట విచారింపవలసిన విషయము. అట్టి గ్రంథమున్నచో శ్రీరామభక్తిభరితులగు నాంధ్రులు అందలి భావామృతమును పాత్రల విశిష్టరూపమును గని మహానందముతో ముకుళితాంజలులై స్వాగతము చెప్పెడివారు.

నేఁడు అట్టికొఱత కొంతవఱకుఁ దీరినదని చెప్పవచ్చును. ఈగ్రంథకర్తలు శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్యముగారు ఆంగ్ల వైద్యవృత్తియందుఁ దామునిష్ణాతులు నిమగ్నులు నయియుండియు రామాయణముపై నిట్టిగ్రంథమును వ్రాయుట యుందఱకు నాశ్చర్యము కలిగింపకపోదు. దానికిహేతువు శ్రీ సుబ్రహ్మణ్యముగారి వంశానుచరితమే గావున నద్దాని నిటఁగొంత ప్రస్తుతింతును.

శ్రీ సుబ్రహ్మణ్యముగారి పితామహులు సుందరరామ సోమయాజులు, రామచంద్రచయనులు, సంజీవదీక్షితులు అను మువ్వురు సోదరులు త్రేతాగ్నుల మాఱురూపములా యను నట్లు వారుమువ్వురును యావజ్జీవము నగ్నిహోత్రుని సేవిం చుచుఁ దుదిని తురీయాశ్రమ స్వీకారమును జేసిరి.

వీరిలో శ్రీ సంజీవదీక్షితులకు క్రీ.శ. 1880 సంll మున శ్రీరామకోటి గారుదయించిరి. వీరు నాఁటిదేశకాల గతులచే గీర్వాణభాషతోపాటు బి.ఏ. పరీక్షయందుఁ బట్టభద్రులై ప్రభుత్వరెవెన్యూశాఖయందు తహసీల్దారు ఉద్యోగమును జేయుచు సమర్థులనుపేరంది రేపలెయందు గృహాములులేని చాలమందికి నుచితముగ నివేశనస్థలముల నిప్పించిరి. అది నేఁటి కిని రామకోటిపేట యనుపేరఁ బరఁగుచున్నది. శ్రీరామకోటి గారు తాము లౌకికవృత్తి యందున్నను కులక్రమాగతవైదిక ధర్మమును వీడక 1925 వత్సరమున వైశ్వదేవమునాచరించి సర్వదా అతిథిసపర్యల నొనర్చుచుండిరి. భర్తృవాక్యపరిపాలన శీలయగు వారిధర్మపత్ని అన్నపూర్ణమ్మగారుకూడ భర్త యొక్క ధర్మాచరణమున కనుకూలవతియై మిలగుచుండెను.

ఇట్లుండ నాపుణ్యదంపతుల ధర్మఫలమో యనునట్లు శృంగేరీ శ్రీ విరూపాక్ష శ్రీ పీఠాధీశ్వరులగు జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీమాంతాచార్య మహాస్వాముల వారు వారింటికడకు విచ్చేసి యాదంపతుల వైదికధర్మనిష్ఠనుగాంచి పరమానందమునొంది వారలకు శ్రీవిద్యయంగుఁ బూర్ణదీక్ష ననుగ్రహించిరి.

శ్రీరామకోటిపాకయాజిగారు తను వైదికలౌకికధర్మ
ములు నాచరించుకొనుచునే ప్రత్యహ్యము రాత్రులయందు
శిష్యవర్గమునకు రామాయణప్రవచనమును దప్పక గావించు
చుండెడివారు. 1935 సంll న ఉద్యోగమునుండి విశ్రమించి
తమకు షష్ట్యబ్దిపూర్తియయిన వెనుక సోమయాగచికీర్ష యధి
కముకాఁగా 1943 సంవత్సరవసంతమున సోమయాగ మొనర్చి
సోమపీథులైరి. నాభాగ్యవశమున నాకు వారిసాతీర్థ్యము లభించు
టయేగాక వారియాగమున నార్త్విజ్యము వహించు నవకాశము
గూడ గల్గెను. వారు నిత్యాగ్నిహోత్రులయి 1944 సంll న
జాతుర్మాస్యక్రతువు నాచరించి తురీయాశ్రమ స్వీకారమునకు
నిశ్చయించుకొనియు 1945 సంll న హఠాత్తుగా స్వర్గతులైరి.
కావున వీరికాయొక్క కోర్కెమాత్రము నెరవేరలేదు. వారు
తమ యుద్యోగసమయమునుండి మరణపర్యంతము రాత్రు
లందు రామాయణ ప్రవచనమునుగూడ వీడలేదు. అందలి
శ్రోతృవర్గమున వారిపుత్రులగు మన శ్రీ సుబ్రహ్మణ్యము
గారొకరు.

తమపెద్దల యాశీర్బలముతోఁ దనపితృపాదులు తన
హృదయక్షేత్రమున నాటిన యుత్తమ సంస్కృతిబీజములు
మహావృక్షముకాఁగా దానిఫలములే శ్రీ సుబ్రహ్మణ్యముగారి
వైదికధర్మాసక్తి, శ్రీమద్రామాయణ విమర్శామృతమును.
తాముగావించిన యనవరతరామాయణాధ్యయనమువలనఁ
దమకు గల్గిన యభిప్రాయవిశేషములే యీగ్రంథరూపము
నందినవి. ఇందుఁ బ్రధానాప్రధానములేక సర్వస్త్రీపురుషపాత్ర
ముల శీలములన్నియు హృదయంగమముగఁ బ్రదర్శింపఁబడినవి.

కావున నీగ్రంథమును జదువుటకు అందఱకు ఆసక్తిగల్గునను టలో సందేహము లేదు.

లోకోపకారకమగు నిట్టిగ్రంథమును లోకమునకందించి తమపిత్రృణమును దీర్చికొనిన శ్రీ డాక్టరుగారు తమ జనకులు తమ్మునువలెఁ దమపుత్రసంతతిని దాముగూడఁ దీర్చిదిద్ది యిట్టి పాత్రపరిశీలనమునే మహాభారతమునఁ గూడ నొనర్చినచో, మఱింత లోకోపకారము నొనర్చినవారగుదుగని విశ్వసించు చున్నాను.

విద్వద్విధేయుఁడు
నీలకంఠశాస్త్రి (కౌండిన్య)

కౌండిన్యాశ్రమము, గుంటూరు–4
పరీధావి కార్తికశుక్ల ద్వితీయా సౌమ్య
వాసరము 8-11-1972

ప్రొఫెసరు, ఎమెరిటస్–ఆంధ్రయూనివర్సిటీ,
పి. జి. సెంటరు, గుంటూరు.

పండితాభిప్రాయము

Prof. S. V. JOGA RAO, M. A, Ph. D.
HEAD OF DEPARTMENT OF TELUGU
ANDHRA UNIVERSITY POST GRADUATE CENTRE
(Formerly Professor of Telugu. University of
Leningrad, U, S. S. R.)

గుంటూరు

తేది 1-12-72

శ్రీ పొన్నాడ సుబ్రహ్మణ్య మహోదయులు వైద్య విద్యా ధురంధరులేగాక సాహిత్యకళాసురభిళాత్మలగుట ముదావహము. వైద్యము మానవుని భౌతికమైన ఆరోగ్యమునకు దోహదముచేయును. హార్దికమైన ఆరోగ్యమునకు దోహదము చేయగలదు సాహిత్యము.

తాత ముత్తాతలకాలమునుండి సీతామహాదేవి పాతివ్రత్యప్రతిష్ఠకు సిడమెత్తిన అగ్ని దేవునారాధించిన పవిత్రవంశము వీరిది. వీరితండ్రిగారు పూర్ణదీక్షాపరులైన శ్రీ విద్యోపాసులు, సోమయాగ మొనర్చిన మహానుభావులు, రామాయణకావ్య కంఠులైన భక్తరాజులు, శ్రీరామకోటి సోమయాజులు. ఆపితృ పాదుల ప్రవచనవశమున రామాయణరమణీయత సుబ్రహ్మణ్య ముగారి హృదయసీమలో గుడిగోపురములు కట్టుకొన్నది. తత్ఫలితమే యీగ్రంథము.

ఏవంవిధ పాత్రతత్త్వానుశీలనము రామాయణ పరమార్థమును పాఠకులకు కరబదరముచేయుచున్నది. ముచ్చటైన మూలశ్లోకముల నేకము సందర్భసుందరముగా ఉదాహృతములై

తదర్థవివరణ మీగ్రంథమునకు వన్నెపెట్టుచున్నది. గ్రంథమున నెక్కడ పట్టిచూచినను వీరి రామభక్తియు, రామాయాణ కావ్యభక్తియు, సహృదయత్వము సద్యఃప్రసన్నము లగుచున్నవి. ఇందలి భాషగ్రాంథికమైనను వీరి శైలీ లాలిత్య మీగ్రంథమును సర్వోపగమ్యము చేయుచున్నది. ఇందలి భాషయు, ముద్రణమును అనవద్యములై, ఇందలి విమర్శ పాత్రచిత్రణమున ఆదికవి అవలంబించిన శిల్పమును, ప్రదర్శించిన వైదగ్ధ్యమును నిరూపించునదై యుండినచో గ్రంథస్వరూప మింకను సుందరతరమై యుండెడిది. అయితే అంతటి ఆదికావ్యము గూర్చియే తెనుగున తగినవిమర్శ నిబంధములు లేని లోటు నిది కొంతకుగొంత దీర్చుచున్నదనవచ్చును. సహృదయ వరేణ్యులైన శ్రీ సుబ్రహ్మణ్యముగారికి నా సాధువాదములు.

యస్వీ జోగారావు.



డాక్టరు పొన్నాడ సుబ్రహ్మణ్యము
ధర్మపత్ని విమలాదేవి

ఉపోద్ఘాతము

శ్రీరామచంద్రమూర్తియొక్క గాథను కవులనేకులు వివిధభాషలలో గద్యకావ్యములుగాను, పద్యకావ్యములుగాను, గద్యపద్యకావ్యములుగను రచించి కృతార్థులైరి. ఆగ్రంథములే రామాయణమను పేరఁ బరగుచున్నవి. వానిలో ప్రప్రథమమున సంస్కృతభాషలో రచియించినవాఁడాదికవి వాల్మీకి. వేదవ్యాసులవారు సంస్కృతమున నధ్యాత్మరామాయణము రచించిరి. పిదప కవులనేకు లితరభాషలలో గ్రంథములు వ్రాసిరి. కాని వాటన్నిటిలో లేని విశిష్టత యొకటి వాల్మీకిరామాయణములో నున్నది. అదెద్దియనిన, శ్రీరామజననము మొదలు రావణవధ వరకు శ్రీరాముఁడాదర్శ మానవుఁడని వర్ణించబడినది. అధ్యాత్మ రామాయణములో రాముఁడు పరమాత్మయని వర్ణింపబడినది. ఇతర రామాయణములలో నొన్నిచోట్ల మానవుఁడుగాను, నొన్నితావుల దైవముగాను చిత్రించిరి. కాని వాల్మీకి శ్రీరాముని మానవమాత్రుఁడుగానే వర్ణించినాఁడు. శ్రీరామునిచే నావిధముగా బల్కించినాఁడుకూడ.

శ్లో॥ ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్ ।
యోహం, యశ్చ, యతశ్చాహం భగవాన్తద్బ్రవీమితే॥

నేను మానవమాత్రుఁడనని, దశరథకుమారుఁడైన రాముఁడనని తలచుచున్నాను. నేనెవరిని ? ఎచ్చటనుంచి వచ్చితిని ? వివరములు దెల్పుఁడని బ్రహ్మదేవుని ప్రార్థించును. రాముని యందు మానవదౌర్బల్య మక్కడక్కడ వాల్మీకి చూపించినాఁడు. అయితే రాముఁడేవిధముగా నాదుర్బలత్వమును ప్రతిఘటించి ఆదర్శపురుషుఁడని నిరూపించుకొనినాఁడో యదిగూడ వాల్మీకి విశదబరచినాఁడు.

వాల్మీకిరామాయణమునకు తక్కిన రామాయణములకు గల తారతమ్యము నొకదృష్టాంతముచే విశదబరుపవచ్చును. రామాయణము నొక నాటకరూపములో బ్రదర్శించినారను కొందము. శ్రీరాముని పాత్ర సుబ్బారావను నొకవ్యక్తి అత్యద్భుతముగా నటించినాడనుకొందము. అభిముఖముగా గూర్చొనిన ప్రేక్షకులందరు రాముడు బాగుగనటించినాడని యందురు. ప్రాంప్టరు, నేపథ్యగృహము (Green room) లోని వారందరు, సుబ్బారావు తనపాత్ర బాగుగ నిర్వహించినాడని యందురు. ప్రాంప్టరు, తెరవెనుకవున్నవారి దృష్ట్యా రచియింపబడినదధ్యాత్మరామాయణము. ప్రేక్షకుల దృష్ట్యా రచియింపబడినది వాల్మీకిరామాయణము. రెండువిధముల యభిప్రాయములితరరామాయణములలో వర్ణింపబడినవి.

వాల్మీకిరామాయణములో మరియొక విశిష్టత గలదు. గాయత్రీమంత్రాక్షరములతో సంపుటిగా తయారుచేయబడిన పవిత్రగ్రంథమిది. బ్రహ్మవిద్యాబోధకమైన గాయత్రీమంత్రాక్షరము లీగ్రంథమందెక్కడెక్కడ నిమిడియున్నవో మూలరామాయణమున చెప్పబడియున్నవి. అందువలన దీనిని హిందువులు పవిత్రగ్రంథముగా బరిగణించుచున్నారు.

వాల్మీకిరామాయణములో గనబడు మరియొక్క ముఖ్యవిశేషమేమనిన, అతిశయోక్తిగాని, అసృతముగాని గ్రంథములో గానబడదు. బ్రహ్మవరప్రభావమున రామాయణ సంఘటనలన్నియు, ప్రత్యక్షముగా, 'పాణౌవామలకంయదా' రచనసమయమున నాతనికి గన్పట్టినవి. అందుకనే సత్యమేబల్కెదనని ప్రతిజ్ఞచేసి యావిధముగా నిర్వహించిన మహనీయుడు వాల్మీకి.

సత్యము చెప్పువాడు గనుకనే దుష్టులలోనున్న మంచిగుణములు గూడ వర్ణించినాడు. వాలిని ప్రఖ్యాత బలపౌరుషుడనియు, యతనివాక్కులు 'ధర్మసంశ్రితము'లనియు వర్ణించినాడు. రావణునిలోనున్న గొప్పదనముగూడ వర్ణించినాడు. రామునియం దక్కడక్కడ మానవదుర్బలత్వమును జూపినాడు.

వాల్మీకి ప్రకృతివర్ణన మద్వితీయము. సహజమైన మాధుర్యముతో, సులభమైనశైలితో, నవరసభరితమగు శ్రీ రామచరితమును మానవలోకమునకర్పించి ధన్యతనొందినాడు. ఆ పవిత్రగ్రంథములోని ముఖ్యమైనపాత్రలు వాల్మీకి యేవిధముగా పోషించెనో తెలిసికొనుటకై నేనుచేసిన ప్రయత్న మీగ్రంథరూపముగా బరిణమించినది. పాత్రలయొక్క గుణాగుణముల విమర్శించుచూ ప్రాసినగ్రంథముగాన పాఠకులకు కొంతవరకు నీతిబోధకము కాగలదని నాయాశయము. ప్రస్తుతపు దేశకాలపరిస్థితుల బరిశీలించినయెడల మానవునిలో నైతికపతనము బాగుగ కనబడుచున్నది. ఇందలి ముఖ్యపాత్రల ప్రవర్తననుసరించి ప్రతిమానవుడు నడచుకొనుటకు ప్రయత్నించినయెడల నతను బాగుపడుటయేగాక అచిరకాలములో మన దేశముగూడ సర్వతోముఖముగా నభివృద్ధిచెందగలదని నాయాశయము. ఏలననగా దేశమనగా నందునివసించుమానవుల సమూహమే! "దేశమంటే మట్టిగాదోయ్, దేశమంటే మనుషులోయ్" అని అన్నాడొక యాధునిక కవివర్యుడు.

వాల్మీకిరామాయణములోని పాత్రల విమర్శించునపుడక్కడక్కడ సంస్కృతశ్లోకముల నుదహరించవలసి వచ్చినది. వాటి ప్రతిపదార్థము, తాత్పర్యము రచించకపోయినను శ్లోకముల

యొక్క భావము శ్లోకమునకు ముందుగాని, తర్వాతగాని వ్రాసితిని. ఈగ్రంథమంతయు వాల్మీకిరామాయణమునీదనే యాధారపడియున్నది.

నాకు, మాకుటుంబమునకు చిరకాలపరిచితులు, మిత్రులు, సతీర్థులునగు, ఉభయభాషాప్రవీణ, వేదాంతపారీణ శ్రీపోలురుగంటి నీలకంఠశాస్త్రిగారీగ్రంథమునకు పీఠికవ్రాసిరి. వారికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు. అడిగినతోడనే సంతోషపూర్వకముగా తమ యభిప్రాయమును వెలిబుచ్చిన ప్రొఫెసర్ — యస్. వి. జోగారావు మహాశయులకు M.A. Ph. D. (Head of the Department of Telugu Andhra University P. G. Centre) నా కృతజ్ఞతాభివందనములు. ఈగ్రంథము లోని స్ఖాలిత్యముల సవరించిన శ్రీ మందలపర్తి ఉపేంద్రశర్మ గారికి, M. A. (Principal HinduCollege) దయతో బరిశీలించిన శ్రీ వావిలాల సోమయాజులగారికి (Telugu Lecturer, Hindu College) పొన్నెకంటి హనుమంతరావుగారికి (Telugu Lecturer M. A. Phd.) నాహృదయపూర్వక యభివందనములు.

ఇందలి ముద్రణస్ఖాలిత్యముల సవరించి యీ గ్రంథాంతమున నొక తప్పొప్పులపట్టికగా చేర్చబడినది.

పాఠకులు యీ పొత్తములోని సద్విషయముల గ్రహించి, దోషముల మన్నింతురుగాక !

ప్రతిభాగ్నినిలయము.
4వ లైను బ్రాడీపేట,
గుంటూరు – 2.
2–12–72

ఇట్లు
బుధజనవిధేయుడు,
పొన్నాడ సుబ్రహ్మణ్యం.

శ్రీరామాయనమః

దేవతాస్తుతి

శ్లో॥ వామే భూమిసుతా పురస్తహనుమాన్ పశ్చాత్
సుమ్రితాసుతః
శతృఘ్నోభరతశ్చ పార్శ్వదళయో ర్వాయువ్వాది
కోణేషుచ.
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబ
వాన్
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్॥

గణనాథస్తుతి

శ్లో॥ అగజాననపద్మార్కం గజానన మహర్నిశమ్
అనేకదం, తం, భక్తానా మేకదంతముపాస్మహే।

ఆదికవిస్తుతి

శ్లో॥ కూజన్తమ్ రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్యకవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.

గురుస్తుతి

శ్లో॥ నారాయణ సమారంభామ్
విద్యాశంకర మధ్యమామ్
కళ్యాణానంద పర్యంతమ్
వందే గురుపరంపరామ్.

పాదుకాంత దీక్షాపరులు, శ్రీవిద్యోపాసకాగ్రేసరులు, శ్రీ కళ్యాణానంద భారతీమాంతాచార్య ప్రియాంతేవాసులు, అస్మద్ పూజ్యగురువర్యులైన శ్రీ॥ శే॥ వడ్లమూడి లక్ష్మీ నారాయణ పాశయాజిగారికి నానమోవాకములు.

ఓం, శ్రీరామాయనమః

శ్రీ రా మ చ ం ద్రు డు

శ్రీరామచంద్రుని మహర్షి వాల్మీకి జననకాలమందు "విష్ణోరర్ధం (విష్ణువుయొక్క అర్ధాంశ సంభూతునిగా) మహా భాగమ్" అని వచించినప్పటికి ముఖ్యముగా ఆదర్శమానవుని గాను, ధీరోదా త్తపురుషునిగానువ ర్ణించినాడు. శ్రీరాముని గుణములన్నియు వాల్మీకి నారదునడిగిన ప్రశ్నలోనే యిమిడి యున్నవి.

శ్లో॥ కోన్వస్మిన్ సాంప్రతం లోకేగుణవాన్ కశ్చవీర్యవాన్
ధర్మజ్ఞశ్చ, కృతజ్ఞశ్చ, సత్యవాక్యో, ధృడవ్రతః
చారిత్రేణచకోయు క్తః సర్వభూతహి తేరతః
విద్వాన్కః సమర్ధశ్చకశ్చైక ప్రియదర్శనః
ఆత్మవాన్ జితక్రోధః ద్యుతిమాన్కోఒనసూయకః
కస్యభిభ్యతి దేవాశ్చ జాతరోషశ్చసంయు గే"

పైనచెప్పిన గుణములన్నియు రామునియందు గలవను టలో సంశయము లేదు. ఇవిగాక యింకను ఉత్కృష్టమైన గుణములామహోమహుని యందుగానవచ్చుచున్నవి. వాని నన్నిటిని దృష్టాంతసహితముగా నిరూపించెదను. ప్రథమమున రాముడు మానవుడనువిషయమై విచారింతము.

1) రాముడు మానవుడు :— శ్రీరామజననము మొదలు రావణవధవరకు వాల్మీకిరామాయణములో రాముడు మానవ మాత్రుడుగానే వర్ణింపబడినాడు. కాని జననమునకు బూర్వము దశరథుడు పుత్రకామేష్టి చేయుకాలమున దేవతలందరు మహా విష్ణువుని మానవునిగా జన్మించి రావణవధ చేయువలసినదిగా కోరిరి.

ఏవముక్తాసురాః సర్వేప్రత్యూచుర్విష్ణురవ్యయమ్
మానుషంరూపమాస్థాయ రావణంజహిసంయుగే।

ఏలననగా వానికి "నానావిధేభ్యో భూతేభ్యోభయం నాన్యత్రమానుషాత్" మానవుడుతప్ప యితరభూతము లెవ్వరి" చేతను భయము లేకుండునట్లుగా బ్రహ్మదేవుడు వరమిచ్చెను. దేవతలకోర్కెప్రకారము విష్ణువు 'పితరంరోచయామాస రాజా దశరథంనృపమ్' దశరథుని తండ్రిగాకోరుకొనెను. జననకాల మందు వాల్మీకులవారీక్రిందివిధముగా వర్ణించినారు.

ప్రోద్యమానేజగన్నాథమ్ సర్వలోకనమస్కృతమ్
కౌసల్యాఅజనయద్రామమ్ సర్వలక్షణసంయుతం
విష్ణోరర్ధం మహాభాగం పుత్రమిక్ష్వాకునందనమ్

దివ్యపాయసములో సగము కౌసల్యభుజించినది. గాన సర్వలక్షణసంయుతుడు, విష్ణువులో నర్ధాంశసంభూతుడునునై న శ్రీరాముని కౌసల్యకనెనని వాల్మీకివర్ణించినాడు. మరల రావణ వధానంతరము దేవతలందరు పితామహపురస్సరముగా రాముని

పురుషసూక్తవిధానేన స్తోత్రముచేయుదురు. అప్పుడు విస్మయ పూర్వకముగా రాముడుచెప్పినమాటలు.

ఆత్మానంమానుషమ్మన్యే రామందశరథాత్మజమ్
యోఽహం యశ్చయతశ్చాహమ్ భగవాన్తద్బవీమితే॥

నేను దశరథాత్మజుడగు రాముడనని, మానవుడనని తలచుచున్నాను. నేనెవరిని ? ఎక్కడనుంచివచ్చితిని ? అని రాముడు ప్రశ్నవేయును. దానికి బ్రహ్మచెప్పిన సమాధానము.

భవాన్నారాయణోదేవః శ్రీమాంశ్చక్రాయుధప్రభుః
సీతాలక్ష్మీర్భవాన్విష్ణుఃదేవఃకృష్ణఃప్రజాపతిః

నీవు సాక్షాన్నారాయుణుడవు. సీత మహాలక్ష్మి అని చెప్పెను. దీనినిబట్టిచూడ దేవతలకు, మహర్షులకు రాముడు విష్ణువని తెలిసినట్లుగా కనబడుచున్నది. కాని తక్కినవారందరికి మానవుడేయని అభిప్రాయము కలుగునట్లుగా వాల్మీకిరాముడు నటించినాడని వ్యక్తమగుచున్నది. వాల్మీకి, రామునివర్ణించుటలోగూడా విష్ణుతుల్యపరాక్రముడని వర్ణించినాడుగాని విష్ణువని ఎక్కడచెప్పలేదు. మీదుమిక్కిలి రామునియందు మానవ దుర్బలత్వమునుగూడ నక్కడక్కడ చూపించినాడు. కానిఆదర్శ పురుషుడుగాన ఆదుర్బలత్వమును ప్రతిఘటించి ధీరత్వమును ప్రకటించెను. ఆసంఘటనలీక్రింద పొందుపరుచబడినవి.

పట్టాభిషేకమునకు బూర్వము రాముని సుమంత్రుడు

దశరథునివద్దకు తీసికొనివచ్చును. రథారూఢుడై లక్ష్మణునితో సహా ప్రజలందరు జయజయధ్వానములు చేయుచుండగా ఆనందోత్సవములలో నోలలాడుచున్న అయోధ్యలో పితృదర్శనార్థము రాముడు వెళ్ళును. అక్కడ తనవనవాసము భరతునిపట్టాభిషేకమునుగురించి తెలుసుకొనును. తర్వాత తిరిగికౌసల్య గృహమునకు పదాతియై వెళ్ళునపుడు రాముడేమియు విచారపడలేదు. అతనిముఖమునందు మార్పేమియు గనబడలేదు. "నహిలక్ష్యతే చిత్తవిక్రియా" అని చెప్పబడినది. "నచాస్యమహతీం లక్ష్మీంరాజ్యనాశోపకర్షతి" అని వాల్మీకి వర్ణించినాడు. రాజ్యనాశమనునది రాముని ముఖకాంతిని, కళను, యేమాత్రము తగ్గించలేదట. అతనిప్రసన్నవదనములో ఏమార్పుగనబడలేదు. కౌసల్యఎదుటగాని, దశరథునిసమక్షమునగాని, ప్రజలసమ్మఖమునగాని, వశిష్టునెదుటగాని రాముడేమియు చలనమొందలేదు. పట్టాభిషేకము, వనవాసముతనకు బకచేయుని నిరూపణచేశినాడు. అటువంటిరాముడు సీతయెదుట తనఖిన్నతను వెలిబుచ్చినాడు. అత్యంతసన్నిహితులయెదుట తన అంతర్గతమనోభావముల ప్రబదర్శించుట మానవస్వభావము. అటుల చూపించనియెడల నావ్యక్తి మానవుడేకాడు. తనవనవాసవృత్తాంతము చెప్పుటకే రాముడు సీతకడకువెళ్ళును. ఆమెనుచూడగనే తనలోదాగియున్న శోకభావము వెల్లడియగును.

తాందృష్ట్వాసహిధర్మాత్మా, నశోకమనోగతం
తంశోకంరాఘవఃసోఢుంతతోనివృతతాంగతః॥

వివర్ణ వదనందృష్ట్వా తం ప్రస్విన్న మమర్ష ణమ్
ఆహాదుఃఖాభిసంత ప్తాకిమిదానీమిదం ప్రభో?॥

వివర్ణ వదనుడు, శోకపూరితుడు, స్వేదగాత్రుడునగు రాముని జూచి దుఃఖాభిసంత ప్తయగుసీత ఆతురతతో నేమిజరిగి నదనిప్రశ్నించును. వెంబడే యాశోకమును నిగ్రహించి, పితృ యాజ్ఞానుసారము 14 సం॥లు వనవాసమునకు బోవుచున్నా ననియు, పితృవాక్యపరిపాలన ఉత్తమధర్మమనియు, ఆధర్మనిర్వ హణకై ఎంతటిత్యాగమైనను జేయుటకు సంసిద్ధుడుగానుంటి ననియు జెప్పును.

గంగనుదాటి దండకారణ్యములో నొక వటవృక్షము క్రింద నేకాంతముగా సీతారామలక్ష్మణులు మొదటిరాత్రి వన వాసముగడపిరి. ఆసమయమున తనబహిఃప్రాణులగు సీతా లక్ష్మణులయెదుట తనమనోభావములను, మనఃసంక్షోభమును రాముడు వెల్లడిజేయుచున్నాడు. నాతండ్రియగు దశరథుడు ధర్మార్థములకంటే కామమేప్రధానమని పరిగణించినాడు-ఆడు దానిమాటలువిని ఛందానువర్తినియగు పుత్రుని యరణ్యము నకు బంపినాడు, పోనిమ్ము. నాసవతితల్లియగు కైకేయి సుఖము నొందుగాక. భరతుడు నిష్కంటకముగా రాజ్యభోగముల ననుభవించుగాక. నాతల్లియగు కౌసల్యను, కైకేయిమొదలగు వారెంతబాధపెట్టుచున్నారోగదా! ఒక్క-అయోధ్యనేగాదు, పృథివినంతయు దహింపజేయగలశక్తి నాలోలేకపోలేదు. కాని అకారణముగ నావీర్యమును జూపించదలచుకొనలేదు. అధర్మ

భయభీతివలననను, తండ్రిమాట వినకపోవుటచే నాతనికి దుర్గతుల గల్పించినవాడనగుదునని భీతిచేతను, నేను యీవరాజ్యపట్టాభి షేకమున కంగీకరించలేదని శోకబాష్పపరిప్లుతుడై కొంతసేపు విలపించియూరకుండెను. ఈసందర్భములో రాముడుచెప్పిన మాటలు గమనించదగినవి. ఈ దిగువనుదహరించిన శ్లోకముల భావము పైనచెప్పబడియున్నది.

ఇదం వచన మాలోక్య రాజ్ఞశ్చమతి విభ్రమమ్
కామమేవార్థధర్మాభ్యాంగరీ యమితిమేమతిః.

కోహ్యవిద్వానపిపుమాన్ ప్రమదాయాః కృతేత్యజేత్
ఛందానువర్తినం పుత్రంతాతోమామివలక్ష్మణ.

సుఖీభవ సభార్యశ్చ భరతః కైకయీసుతః
ముదితాన్ కోసలానేకోయోఖోక్ష్యత్యధిరాజవత్

అర్థధర్మాపరిత్యజ్యయః కామమనువర్తతే
ఏవ మాపద్యతెక్షి ప్రం రాజాదశరథోయథా.

ఏకోహ్యాహ మయోధ్యాంచపృథివీంచాపి లక్ష్మణ
తరేయుమిషుభిః కృద్ధోననువీర్యమ కారణమ్.

అధర్మభయ భీతశ్చ పరలోకస్యచానఘ
తేనలక్ష్మణ నాద్యాహమాత్మాన మభిషేచయే.

ఏతదన్యశ్చకరుణైర్విలప్య విజనేబహు
ఆశృపూర్ణముఖోదీనో నిశితూష్ణీముపావిశత్.

అని యీవిధముగా తనకత్యంత సన్నిహితులు ప్రాణ సములైన సీతాలక్ష్మణుల యెదుట తనమనో వేదన వెలిబుచ్చి నాడు. ఆవిధముగాచేయుట మానవుని సహజలక్షణము.

ఎంత మహావీరులైనను ఒకానొక సమయములో ప్రతి కూలపరిస్థితు లేర్పడినప్పుడు భయపడి నిరుత్సాహము చెందు దురు. ఆ విధముగా నర్జునుడు మహాభారత యుద్ధమునకుముందు జంకినాడు. రాముడు విరాధవధకు ముందు భయపడినాడు. సీతారామలక్ష్మణు లొంటరిగా దండకారణ్యములో బోవు చుండగా ఘోరరూపుడగు విరాధుడను రాక్షసుడెదురుగా వచ్చి సీతను తనతొడమీద నిడుకొని పోవదొడగెను. సీత విల పించుచుండెను. ఆ దృశ్యమునుజూచి నిరుత్సాహుడై రాముడు లక్ష్మణునితో జెప్పినమాటలు.

పశ్యసౌమ్యన రేంద్రస్య జనకస్యాత్మసంభవామ్
మమభార్యాం శుభాచారాం విరాధాంకే ప్రవేశితామ్.

పరస్పర్శాత్తువై దేహ్యాకిన దుఃఖతరమ స్తిమే
పితుర్వియోగాత్ సౌమిత్రే! స్వరాజ్యహరణా త్తదా.

చూడుసాయనా! లక్ష్మణా! శుభాచారురాలు, జనకుని కూతురు, నాభార్యయునగు సీతను విరాధుడు తనతొడమీద నిడుకొని బోవుచున్నాడుగదా! పితుర్వియోగము, స్వరాజ్య హరణముకంటె యీ పరస్పర్శ (పరపురుషుడు సీతను స్పృశిం

చుట యనునది) నాకెక్కు-వదుఃఖమును కలుగ జేయు చున్నదని విలపించెను.

అద్యేదానీం సకామాసా యామాతామధ్యమామమా
ఇతి బ్రువతికాకుస్థః బాష్పశోకపరిప్లుతః.

ఇప్పుడు నాసవతి తల్లికోరిక తీరినదిగదా. యిందుకనే కాబోలు నన్నువనవాసమున కంపినది. అని బాష్పశోక పరిప్లుతుడయ్యెను. దానికి లక్ష్మణుడు తగిన సమాధానమిచ్చి రాముని కార్యరంగమునకు బురికొల్పుచున్నాడు.

అనాథయివ భూతానాం నాథ స్త్వంవాస వోపమ।
మయాప్రేష్యేణ కాకుస్థకి మర్థం పరితప్యసే॥
శరేణ నిహతస్యాద్య మయాక్రుద్ధేన రక్షసః
విరాధస్యగతాసోర్వ్యా మహీపాస్యతి శోణితమ్।

సమస్తలోకములకు నాథుడవు. దేవేంద్రునితో సమానుడైన నీవు యీ విధముగా అనాథునివలె నెందుకు బరితపించెదవు? ఇప్పుడు నీవు చూచుచుండగనే నేను వానిని వధించి, వానిరక్తముతో భూదేవికి తర్పణమొనరించెదనని యుత్సాహపూరితమైన వాక్యములు లక్ష్మణుడు చెప్పినమీదట కృద్ధుడై రాముడు విరాధుని వధించెను.

సీతను రావణుడపహరించిన తర్వాత రాముడుజూపిన శోకమపారము. సామాన్యపు మానవుడుగూడ నావిధముగా

దుఃఖింపడేమో యని యనిపించును. కాని, లక్ష్మణుని ధైర్య ప్రసంగములవలన శోకము నుపసంహరించుకొని సీతాన్వేష ణకై తగుప్రయత్న మొనరించి తుట్టతుదకు రావణుని సంహ రించెను. లక్ష్మణుడు రావణునిశక్తిచే మూర్ఛనొందినపుడు, రాముడుజూపిన శోకమద్వితీయము.

దేశేదేశే కళత్రాణి దేశేదేశేచ బాంధవాః ।
తంతుదేశం నపశ్యామి యత్రభ్రాతా సహోదర॥

కళత్రములుగాని, బంధువులుగాని దొరకెడి దేశము లున్నవి. సహోదరుడు దొరకేదేశము గానరాదని బహువిల పించెను.

శక్యాసీతా సమానారీ మర్త్యలోకే విచిన్వతా ।
నలక్ష్మణ సమోభ్రాతా సచివః సాంపరాయకః ॥

సీతవంటిభార్య ప్రయత్నముచేసిన దొరుకునేమోగాని లక్ష్మణునివంటి సోదరుడుమాత్రము దొరకుట దుర్లభమని వచించెను. విభీషణుడు, సుగ్రీవుడు, ఓదార్చిన మీదట నా శోకము తీవ్రరోషముగా బరిణమించి రావణ వధకు మిక్కిలి ప్రోద్బలము గలిగించినది. ఇదియేగాక, వివిధస్థలముల సీతా విరహజ దుఃఖమును రాముడు ప్రకటించెను. ఇది మానవదుర్భ లత్వమునకు లక్షణము. శ్రీకృష్ణు డెప్పుడీవిధముగా శోకమును గాని మోహమునుగాని ప్రకటించలేదు. మీదు మిక్కిలి శోక మోహాగ్రస్థుడైనఅర్జునునకు గీతనుపదేశించి యుద్ధమునకు బురిగొ

లైను. రాముడు, కొంచెముజంకినను, ధీరోదా త్తపురుషుడుగాన యాదుర్బలత్వమును నిగ్రహించి తగు కార్యసాధనజేసి సిద్ధి నొందినాడు. ప్రతి మానవుడుకూడ నా విధముగా దుర్బలత్వ మును ప్రతిఘటించి, కార్యమున కుపక్రమించి, విఘ్నముల నెదొరొక్కని, విజయము సాధించినప్పుడే రామాయణ పఠనము సఫలమగును. రాముడు, మానవుడు గనుకనే, మానవుల కత్యంత సన్నిహితుడు, మార్గదర్శి, ప్రేమాస్పదుడైనాడు.

పైన చెప్పిన విషయముల వలన రాముడు మానవుడని వర్ణింపబడి నప్పటికి, ఆయన విష్ణువుయొక్క అవతారమని, దేవతలకు, ఋషులకు, తెలియును. కాని, యీ సంగతివారు రహస్యముగా దాచిపెట్టినటుల గోచరమగు చున్నది. ఈ విష యము వారు రామునికిగూడా తెలియజేయలేదు. రాముడు దైవాంశ సంభూతుడని రావణునకు దెలిసినయెడల వాడు చావడు. వాడు రాముడు మానవమాత్రుడే యను భావములో నుండవలయును. అందుకని యీ సంగతి దేవరహస్యముగా దేవతలు, ఋషులు, దాచిపెట్టినారని వ్యక్తమగు చున్నది. మీదుమిక్కిలి గుప్తముగా యొక నిర్ణీత మార్గమున రాముని లంకకు గొనిపోయి రావణవధ చేయించిరి. ఇది అంతయు నొక పథక ప్రకారము జరిగినట్లు కనబడు చున్నది. దీనికి ప్రారంభము విశ్వామిత్రుడు జేసినాడు. ఆయన, యజ్ఞరక్ష ణార్థమను నెపమున, రామలక్ష్మణుల తనయాశ్రమమునకు గొనిపోయి, తదుపరి మిథిలకు వెళ్ళి, శివధనుర్భంగము చేయించి,

సీతాకళ్యాణము జరిపించి, తద్వారా రావణవధకు నాందివేసిన మహానుభావుడు. రాముడెవడో అతనికి తెలుసును. దశరథుడు రాముని తనవెంటబంపుట కిష్టపడనప్పుడు విశ్వామిత్రుడు చెప్పినమాటలు గణనీయములు.

అహంవేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్
వశిష్ఠోపిమహాతేజా, యేచేమే తపసిస్థితాః

నాకు తెలుసును రాముడెవడయినది. వశిష్ఠునకు తెలుసు-ఇక్కడవున్న యితర మహర్షులకు తెలుసు. అని నర్మ గర్భముగా బలుకును. మీదుమిక్కిలి నీకు యశము, కీర్తిగా వలయుననిన, రాముని నాతో బంపుము. దానివలన లోక కళ్యాణము కాగలదనిగూడా చెప్పుచున్నాడు. వశిష్ఠుడుగూడ, రాక్షసుల నిగ్రహించుశక్తి, కుశికాత్మజునికి లేకపోలేదనియు "తవపుత్ర హితార్థాయత్వాముపేత్యా భియాచ్యతే" (నీ పుత్రునికి మేలుచేయు కొఱకే నీవద్దకు వచ్చి యాతని బంప మని కోరుచున్నాడు) అనిగూడ చెప్పుచున్నాడు. దీనివలన సీతా కళ్యాణము, రావణవధ, మనసులోపెట్టుకొనియే బ్రహ్మ ర్షులు మాట్లాడు చున్నారని యభిప్రాయము. ఈవిషయము స్పష్టముగా దేవేంద్రునికి, శరభంగమహాముని కి జరిగిన సం వాదములో తేటతెల్లమగు చున్నది. సీతారామ లక్ష్మణులు శరభంగాశ్రమమునకు వచ్చుచున్నపుడు దేవేంద్రుడు శరభం గుని స్వర్గలోకమునకు కొనిపోటకు స్వయముగా బరివారముతో

వచ్చెను. కాని రాముడు తన యాశ్రమమునకు వచ్చుచున్నా డనియు, ఆతని దర్శనముచేసిన తర్వాతగాని స్వర్గమునకు రానని చెప్పెను–దీనివలన స్వర్గముకంటె రామసందర్శనమే ముఖ్యమ యినదనియు, రాముడుపరమాత్మ యనియు గూఢార్థముస్ఫురిం చుచున్నది. ఈలోపల రాముడు దేవేంద్రుని దూరముననుంచి జూచి, ఆతని సందర్శించవలెనని, కుతూహలముతో త్వరగా వచ్చుచుండెను. ఇదిజూచి శరభంగునితో దేవేంద్రుడు చెప్పిన మాటలు గణనీయములు.

తతః సమభిగచ్ఛంతమ్ ప్రేక్ష్య రామంశచీ పతిః
శరభంగమనుజ్ఞాప్యవివిక్తమిదమబ్రవీత్.

ఇహోపయాత్యసౌ రామోయావన్మాం నాభిభాషసే
నిష్టాం నయతుయావత్తు తతోమాంద్రష్టుమర్హతి.
కర్మహ్యా నేనకర్తవ్యం మహాదన్యై సుదుష్కరమ్
నిష్పాదయిత్వాతత్కర్మ తతోమాంద్రష్టుమర్హతి.

ఇప్పుడు రామునితో మాట్లాడుట సమంజసముగాదనియు, ఆయన చేయవలసిన గొప్పకర్మ (ఇతరులకసాధ్యమయిన) ముందున్నదనియు, అపనిముగిసిన తర్వాత తనను, రాముడు చూడవచ్చుననియు చెప్పి వెంబడే, రాముడువచ్చు లోపలనే, త్వరితముగా గధమునెక్కి స్వర్గమునకు బోయెను.

మునులు చెప్పిన ప్రకారము, సీతారామలక్ష్మణులు దండ కారణ్యములోనున్న ఆ శ్రీమమండలమునలన్నియు సందర్శించి

చివర కగస్త్యాశ్రమమునకు వచ్చిరి. అలసిన శ్రీరామచంద్రుడు, చివర 4 సంవత్సరములగస్త్యాశ్రమములో నుండదలచినవాడై అక్కడ తనునివాస మేర్పరుచు కొనుట కనుజ్ఞనియ్యమని అగస్త్యుని కోరును. అగస్త్యుడొక ముహూర్తము ధ్యానించి అక్కడికి 16 మైళ్ళదూరములో గోదావరి యొడ్డున పంచవటియను బహురమణీయమైన ప్రదేశముగలదనియు, వేటలాడుటకు వన్యమృగములు కలవనియు, అక్కడ పర్ణశాల కట్టుకొని నివసించవలశినదిగా రాముని యాదేశించును. ఇంతియేగాక వరుణుడుతనకిచ్చిన వైష్ణవ ధనస్సు అక్షయతూణీరములు రామునికిచ్చును. ఆ దివ్యాయుధములు మున్ముందు రాబోవు ఖరదూషణాది రాక్షస వధకుపయోగ బడును. అగస్త్యాశ్రమములో రాముడున్నయెడల ఖరధూషణవధ, సీతాపహరణము జరుగుటకు వీలుండదు. పంచవటి ఖరదూషణాది రాక్షసులు వసించుచున్న జనస్థానమునకు సమీపములో నున్నది. అందుకని రాముని మెల్లగా పంచవటికగస్త్యులవారు బంపుచున్నారు. ఈ విధముగా దేవతలు ఋషులు యుక్తిచేత రాముని పంచవటికి బంపెదరు. రాక్షస వధార్థము శరభంగుని వద్ద కింద్రుడు వచ్చినాడనికూడా ఖరదూషణ వధానంతరము, రామునితో ఋషులు చెప్పెదరు.

తతో రాజర్షయ స్సర్వేసంగతాపరమర్షయ
సభాజ్యముదితా రామమిదంవచనమబ్రువన్

ఏతదర్థం మహాభాగ మహేంద్రశాశ శాసనః
శరభంగాశ్రమంపుణ్య మాజగామమహాయశః

ఆనీత స్త్వామిమం దేశముపా యేనమహర్షి భిః
ఏషాంవధార్థం క్రూరాణాంరక్ష సాంపాపకర్మణామ్.

ఖరదూషణవధానంతరము, బుషులుచెప్పిన మాటలు గమనించదగినవి. రాక్షసవధ చేయించుకొరకే ఇంద్రుడు శరభంగునివద్దకువచ్చినాడనియు, ఉపాయముచేత, మహర్షులు తనను (రాముని) పంచవటికితీసికొని వచ్చినారనియు దేవర్షులు రామునితోచెప్పిరి.

శూర్పణఖ పరాభవమే ఖరదూషణాదిరాక్షసవధకు, సీతాపహరణమునకు కారణమైనది. తద్వారా రావణవధకు నాంది వేయబడినది. శాటకవధానంతరము దేవేంద్రుడు ప్రత్యక్షమయి, రాముడుచేయవలసిన గొప్పకర్మలు ముందున్నవనియు, అవి సక్రమముగా నెరవేరుటకై అతనికి అస్త్రశస్త్ర విద్యలన్నియు నేర్పవలసినదిగా విశ్వామిత్రునిప్రార్థించును. వీటన్నిటినిబట్టిచూడిగా దేవతలు, మహర్షులు రాక్షసవధకు, రావణవధకు, యొకనిర్ణీతమార్గమున, గుప్తముగా, యుక్తితో రామునిగొనిపోయి వారికార్యములు సాధించి రనుటలో సందియములేదు-రావణుని మోహపెట్టి, తను సామాన్యమానవుడని యభిప్రాయముగలుగచేయుటకై రాముడుమానవుడుగా నటించెననియు, దేవతలు బ్రహ్మర్షులుగూడా, రాముడు పర

మాత్మయనుసంగతి ఆతనికిగూడా తెలియకుండా దాచిపెట్టి
రనియు అధ్యాత్మరామాయణములో స్పష్టముగాచెప్పబడినది.
వాల్మీకిరామాయణములో నొకటిరెండుచోట్లమాత్రమే (జనన
ప్రభృతి రావణవధపర్యంతము ప్రాశిన్రగంథములో) రాముడు
విష్ణువని చెప్పబడియున్నది. తనగర్వభంగము తదుపరి పరశు
రాముడు దశరథరామునితో ఈవిధముగాబల్కినాడు.

అక్షయ్యంమధుహంతారమ్జానామిత్వాం రఘూత్తమ
ధనుషోఽస్యపరామర్శాత్ స్వస్తితేస్తువరంతప॥

వైష్ణవ ధనస్సులీలగాసంధించుటవలన నీవుమధుకైట
భులజంపిన విష్ణువని నాకు తెలుసునని పరశురాముడు చెప్పినాడు
ఇక్కడ నొకవిశేషమున్నది. రాముడు పరశురామునికి నమస్క
రించినాడుగాని, పరశురాముడు రామునికి నమస్కరించలేదు
అదిధర్మము. ఏలనన పరశురాముడు బ్రాహ్మణుడు, వయసులో
చాలపెద్దవాడు. రాముడు క్షత్రియుడు, బాలుడు. క్షత్రియసా
ర్వభౌములందరుబ్రహ్మర్షులకు నమస్కరించెడువారు. అదిపూర్వా
చారము. రాముడుగూడవనవాసములో మునులందరికి నమస్క
రించినాడు. మునులుతిరిగి రామునికి నమస్కారము చేయలేదు
గానివారిప్రవర్తనలో గౌరవభావముచూపినారు. శరభంగుడు,
సుతీక్ష్ణుడు మొదలగు మహర్షులందరు, ఇంద్రుడు స్వయముగా
పరివారముతో వారినిస్వర్గమునకు గొనిపోవుటకు వచ్చినప్పటికి,
అందుల కియ్యకొనక శ్రీరామచంద్రుని సందర్శనమయిన

తర్వాత స్వర్గమునకు వచ్చెదమని చెప్పుదురు. రాముడు వారి ఆశ్రమముల సందర్శించుచూ వచ్చినప్పుడు తగిన ఆతిథిసత్కారములుచేసి వారితపోఫలములను రామునికి ధారవోయుదురు. రాముడుగూడ "అహమేవాహరిష్యామి" యని స్వీకరించును. పరశురాముడుగూడ తను వెళ్ళబోవుముందు, రాముని చుట్టు ప్రదక్షిణముచేసి తనగౌరవభావము వెలిబుచ్చినాడు.

మఱొక చోట రామాయణములో సూచనగా రాముడు విష్ణువని, రావణునిపితామహుడైన మాల్యవంతుడు చెప్పినాడు.

విష్ణుంమన్యామహేరామంమానుషంరూపమాస్థితమ్
నహిమానుషమాత్రోసౌరాఘవోదృఢవిక్రమః
యేనబద్ధఃసముద్రేచసేతుఃసపరమాద్భుతః
కురుష్వనరరాజేన సంధింరామేణరావణ.

విష్ణువే, మానవరూపములో, రాముడనుపేరుతోనున్నాడని తలచెదను. మానవమాత్రుడు సేతుబంధనము చేయలేడు. అతనితో నీవుసంధిచేసుకొనుట మంచిది. అని మాల్యవంతుడు హితోపదేశముచేసినాడు. కాని కాలపాశబద్ధుడగు రావణుడా మాటలువినలేదు. పైనుదహరించిన రెండుచోట్లతప్ప మిగతా రామాయణములో రాముడు మానవమాత్రుడుగానే వర్ణింపబడెను.

ఇక రామునిగుణములు వాల్మీకి ఏవిధముగా వర్ణించినాడో చూతము. ఇదివరలోవచించినప్రకారము రాముని గుణగణము

లన్నియు, వాల్మీకి నారదునడిగిన ప్రశ్నలో నేయున్నవి. ఆ శ్లోక ములు ప్రప్రథమములోనే యీగ్రంథమునందుదహరించితిని. వాటిలోచెప్పబడిన గుణములన్నియు ఏవిధముగా రాముని యందువాల్మీకి నిరూపించినాడోజూతము.

ధర్మజ్ఞుడు :- రాముడు సర్వధర్మములు తెలిసిన మహా నీయుడు. అంతియేగాదు. వాని నాచరణలోపెట్టినధీరుడు. అన్ని ధర్మములలోను పితృవాక్యపరిపాలన కగ్రస్థానమిచ్చినాడు. ఆవా క్యానుసారము 14సంవత్సరములు వనవాసము మునివేషములో దీక్షతో జరిపినాడు. "లోభాద్వా, మోహాద్వా, కామాద్వా" ఏకారణముచేతనైనా సరే, తండ్రి ఒకపని చేయమని యాజ్ఞా పించినయెడల నది జేయవలసినదే. పరశురాముడు తండ్రి యాజ్ఞానుసారము తల్లిని జంపినాడు. పితృవాక్యమున కంత గౌరవము, ప్రమాణము శాస్త్రములో నివ్వబడినది. తండ్రిని ఋణగ్రస్థునిగా చేయకూడదు. ఆయున వాక్యప్రకారము నడచు కొని తండ్రిని పరలోక భయమునుంచి రక్షించవలయును. అదిసుతుని ప్రధమ కర్తవ్యము. విధి. పున్నామనరకమునుంచి తండ్రిని రక్షించువాడే పుత్రుడు.

సత్యం సత్యాభిసంధశ్చ నిత్యం సత్యపరాక్రమః
పరలోకభయా ద్భీతో నిర్భయోస్తు పితా మమ

సత్యాభిసంధుడు, సత్యపరాక్రముడు నగు నాతండ్రి పర లోకభయమునుంచి విముక్తుడగు గాక. వనవాసమునకు బోవు

ముందు రాముడు స్వయముగా దశరథునితో చెప్పిన మాటలు.

నై వాహం రాజ్యమిచ్ఛామి, నసుఖం నచమేదినీమ్
నై వసర్వానిమాన్ కామాన్ నస్వర్గం నచజీవితమ్.
త్వా మహం సత్యమిచ్ఛామి, నానృతం పురుషర్షభ।
ప్రత్యక్షం తవ సత్యేన, సుకృతేన చ తే శపే॥

నాకు రాజ్యమక్కరలేదు. సుఖమక్కరలేదు. నిన్ను సత్యప్రతిశ్రవునిగా చేయుటయే నాకోరిక యని శపథము చేసి నాడు. మరల నీవిధముగా చెప్పుచున్నాడు.

ధర్మేహి పరమోలోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్
ధర్మసంశ్రిత మేతత్ పితుర్వచన ముత్తమం.
సంశృత్య చ పితుర్వాక్యమ్ మాతుర్వా బ్రాహ్మణస్యచ
నకర్తవ్యం వృథావీర ధర్మమాశ్రిత్య తిష్ఠతా।

ధర్మమునందే సత్యమునిలచి యున్నది. పితుర్వచన పరిపాలన యే యుత్తమ ధర్మము. తండ్రికిగాని, తల్లికిగాని, బ్రాహ్మణునికిగాని, చేసిన వాగ్దానము చెల్లించి తీరవలయును. పితృవాక్య పరిపాలనము తనకే గాక భరతునికి గూడ కర్తవ్యము భరతుడు 14 సంవత్సరములు రాజ్యము చేసి తీరవలసినదే యని భరతుని కాదేశించినాడు.

2) రాముడు నిరూపించిన ధర్మములలో రెండవది శరణాగతరక్షణ. ఎవరైనా సరే శరణ శుద్ధిగా దీనుడై, శరణు

కోరినయెడల నతని కభయ మిచ్చుట తనముఖ్య వ్రతమని రాముడు చెప్పినాడు. ఆవిధముగా శరణిచ్చి యు త్తమ గతు లను బొందిన పూర్వుల గాథలనేకములు గలవు. ఆవిధముగా శరణీయుని యెడల ఘోరపాపము సంభవించునని గూడా చెప్పి నాడు. మీదుమిక్కిలి శరణార్థికి రక్షకుడు శరణీయుని యెడల వాని సుకృతఫలమును గూడా శరణార్థి గొనిపోవునని శా స్త్ర ము లద్ఘోషించుచున్నవని కూడా రాముడు నుడివినాడు కాకా సురుని కావిధముగాశరణిచ్చి రక్షించినాడు. విభీషణుడు శరణు జొచ్చినపుడు, ఆంజనేయులు దప్ప, తక్కిన వానర శ్రేష్ఠులంద రతనికి శరణిచ్చుట యు క్తము కాదని వచించిరి. కాని వారికి రాముడు చెప్పిన సమాధానము వర్ణనీయము.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామీ తివ్రతం మమ.

ఎవరైనా, ఎప్పుడైనా సరే, దీనుడై, నీవాడను, నన్ను రక్షించమని గోరినయెడల నతనికి శరణిచ్చుట. (సర్వభూత ములనుంచి అభయమిచ్చుట) తనవ్రతమని చెప్పినాడు. మీదు మిక్కిలి ఆవచ్చినవాడు రావణుడైనను సరే శరణిచ్చితినని చెప్పి సుగ్రీవునితో విభీషణుని త్వరగా తనవద్దకు తీసికొని రావలసి సదిగా యాజ్ఞాపించెను. చూచితిరా! రాముని యొక్క శరణా గతరక్షణ ధర్మమెంత యున్నతస్థాయికి బోయినదో! శరణు

గోరినయెడల తన ఆగర్భశత్రువగు రావణునికి గూడ నభయ మిచ్చునట !

ఆనయైనం హరిశ్రేష్ఠ దత్త మస్యాభయం మయా
విభీషణో వా సుగ్రీవ యదివా రావణస్స్వయమ్.

హే సుగ్రీవ ! ఆవచ్చిన వాడెవరై నాసరే (విభేషణుడే గానిమ్ము, లేక రావణుడై నాసరే) అతనికి నేనభయమిచ్చితిని. త్వరలో నావద్దకు తీసికొని రమ్ము" అని ఘంటాపథముగా చెప్పినాడు.

రావణుని దూతలగు శుకసారణులు వానరరూపములో, శత్రురహస్యములు తెలిసికొనుటకై, వానరవాహినిలో బ్రవే శించగా విభీషణుడు వారల బట్టుకొనెను. వారిద్దరిని వానరులు భాధించుచుండగా వారు రాముని వెంబడే శరణుగోరిరి. వెం టనే రాముడు వారల విముక్తులను జేయువలసినదిగా నాజ్ఞా పించెను.

శి) రాజ్యధర్మములు :- రాజ్యధర్మములన్నియు రాము నికి బాగుగా తెలియును. వాటిని ఆచరణలో సహితము పెట్టినాడు. "రామో రాజ్యం ప్రశాసతి" (రాముడు రాజ్య మును పరిపాలించుచుండగా) అను పల్లవితో రామరాజ్య మేటులనడచుచున్నది వాల్మీకి వర్ణించినాడు. రామరాజ్యములో దుర్భిక్షము లేదు, విధవలు లేరు, వృద్ధులైన తలిదండ్రులముందు పుత్రులెవరు మరణించలేదు, ఏవిధమయిన శత్రుభయము లేదు

కరవు కాటకములు లేవు ధర్మము ననుసరించి న్యాయప్రకా రము రాజ్యపరిపాలన జరిగెను. ఏవిధమైన అశాంతిగాని, అసం తృప్తిగాని లేదు. కూటికి గుడ్డకు కొఱత యే లేదు. ప్రజావాక్య మున కుత్తమమైనస్థానము నిచ్చినాడు. ఆయనతండ్రి దశరథుడు గూడ సామంతరాజులను, సామాన్యప్రజను, జానపదులను, నగరవాసులను, అందరిని ఆహ్వానించి వారు ఏకగ్రీవముగా రామునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయమని కోరిన మీదటనే యౌవరాజ్యపట్టాభిషేక నిర్ణయము చేసినాడు. దీనినే మనవారు (Plebecite) అనియందురు. ఏకకంఠమున ప్రజలందరు తమకరకమలముల ముకుళించి రాముడే రాజు కావలెనని కోరినారు.

ఇచ్ఛామోహి మహాబాహో! రఘువీరం మహాబలమ్
గజేనమహాతాయాంతమ్! రామం ఛత్రావృతాననమ్.

శ్వేతచ్ఛత్రావృతాననుడై, పట్టపుటేనుగమీద రాజ వీధిలో రాముడు పోవుచుండగా చూడవలెననునదియే మా కోరిక యని ఏకగ్రీవముగా ప్రజలందరు కోరినారు.

చిత్రకూటపర్వతమున రామభరతసంవాదము జరుగు చున్నసమయమున భరతుడేమియు తోచక వారి యొక్క వినా దాంశము (రాముడు తండ్రియాజ్ఞానుసారము వనవాసము చేయుటయా, లేక భరతునిప్రార్థనప్రకారము సింహాసనము నధి ష్ఠించుటయా) అక్కడచేరినప్రజలయొక్క నిర్ణయమునకు వదలు

దమని చెప్పెను. దీనినే (ప్రజావాక్యము లేక Plebecite అని యందురు). దానికి రాముడియ్యకొనెను. ప్రజలందరాయిద్దరి ధర్మమూ ర్తుల సంవాదములు వినినతర్వాత వీనిర్ణయమునకురా లేక వారికే యీనిర్ణయము వదలివేశిరి. అప్పుడు పితృవాక్యపరి పాలన తమయిద్దరికి కర్తవ్యమనియు, 14 సంవత్సరములు తను వనవాసము చేయవలశినదే యనియు, భరతుడు సింహాసనము నధిష్ఠించవలశినదే యనియు రాముడు భరతుని యాదేశించి, యీక్రిందివిధముగా శపథమొనర్చినాడు.

లక్ష్మీశ్చంద్రాదపేయాద్వా హిమవాన్ వా హిమంత్యజేత్
అతీయాత్ సాగరో వేలాం నప్రతిజ్ఞామహంపితుః॥

చంద్రుడు కాంతిని వదలవచ్చును. హిమవంతుడు హిమము త్యజించవచ్చును. సముద్రుడు చెలియలకట్ట దాట వచ్చును. కాని, నేనుమాత్రము తండ్రిమాట నతిక్రమించనని ఘంటాపథముగా చెప్పెను. చూచితిరా రామునియొక్కధర్మ నిర్వహణ! ఇతరధర్మనిర్వహణలో గూడా నిదేవిధమయిన దృఢనిశ్చయము వెలిబుచ్చినాడు.

ప్రజావాక్యమున కత్యంతప్రాముఖ్యత రామడిచ్చినాడు. ప్రజలు తనవిషయమైగాని, తన పరిపాలనావిషయమైగాని యేమిఅనుకొనుచుండిరో తెలిసికొనుటకై రాముడు తరచుగా గూఢచారుల తనరాజ్యములో నలుదిక్కులకు పంపుచుండెడి వాడు. ఇది రాజుయొక్కముఖ్యధర్మము. ఒకరోజు భద్రుడను

గూఢచారి యొకడు ప్రజలలో కొంతమంది తనమీద నింద మోపుచున్నారని రామునికి తెలియచేసెను. ఒకసంవత్సరము పరాధీనములో, లంకలోయున్న సీతను, రాముడేవిధముగా (అమ గ్నిపుష్టతఃకృత్వా, సిగ్గునువెనుకకువదలి) సీతను తెచ్చుకొని యనుభవించుచున్నాడనియు, రాముడే, యావిధముగా జేసిన యెడల, వారుగూడా తమభార్యలదోషములు సహించి తమ యొద్ద నుంచుకొనవచ్చుననియు ప్రజలక్కడక్కడ గుంపులుగా చేరి గుసగుసలాడుచున్నారనియు భద్రుడు చెప్పెను. అదివినిన తర్వాత రాముడు లోకోపవాదమునకు, అపయశమునకు భయ పడి శుద్ధస్వభావురాలని తనకు తెలిసినప్పటికి గర్భిణి యగు సీతను వెంబడే అరణ్యములకు బంపెను. తిరిగి యామెను కుశ లవులతో తనవద్దకు వాల్మీకి తీసికొనివచ్చినప్పుడు,. తన పారి శుధ్యనిరూపణకై ప్రజల ప్రత్యయార్థము శపథము చేయుమని రాముడు సీతను గోరెను. ఆమె యావిధముగా శపథముచేసి భూగర్భములోకి అంతర్ధాతు రాలైనది. రామునిధర్మాచరణ మంతకఠోరమైనది. ధర్మనిర్వహణవిషయమున నిర్దాక్షిణ్యుడుగా గనబడును. సీత శుద్ధసమాచారురాలని తనకు తెలియునని యు, లోకోపవాదభయమున ఆమెను త్యజించితిననియు, తిరిగి యామె మీదనిందమోపిన ప్రజలయెడ తనపారిశుద్ధ్యనిరూపణచేసిన యెడల నాలోకోపవాదము తొలగునని యు, అంతవరకు తాను స్వీకరించజాలనని యు చెప్పెను. తను ఉపేక్ష చేసినయెడల నా యపవాదము స్థిరమగునని యు, ఆయపవాదము తొలగించుట

సాగ్వబౌమునిముఖ్యధర్మమనియు నుద్ఘాటించెను. అధర్మము కొరకై సీతనుగూడా త్యజించెను.

ఒకవృద్ధవిప్రుడు తనవైకైకపుత్రుని మృతకళేబరము రాముని యెదుట నుంచి, విలపించుచూ, రామరాజ్యములో నిటువంటి దుర్ఘటన ఇదివరకెప్పుడు జరుగలేదనియు, ఏదో అతనిపరిపాలనలో లోపముండుటచేతనో, లేదా అధర్మ మెక్కడనో జరుగుచుండుటచేతనో, యిటువంటి సంఘటన జరిగినదని శోకార్తుడై నుడివెను.

రామస్య దుష్కృతం కించిన్మహాదస్తి నసంశయః
యథాహి విషయస్థానాం బాలానాం మృత్యురాగతః
రాజదోషైర్విపద్యంతే ప్రజా హ్యవిధిపాలితాః
అసద్వృత్తేహినృపతా వకాలేమ్రియతేజనాః

ఈ బాలుని మృత్యువుకు కారణము రామునిపరిపాల నలోనే దోషముండవచ్చుననియు, రాజదోషములవలన ప్రజలు కూడా విపత్తునొందెదరనియు, రాజు అసద్వృత్తిలో నున్నయెడల ప్రజలలో నకాలమరణములు సంభవించుననియు ఆవృద్ధవిప్రుడు చెప్పెను. రాముడేమియుతోచక, తనలో నే దోషములేదని తెలిసినప్పటికి, వసిష్ఠ, వామదేవ ప్రభృతులను బిలిపించి వారిసలహా యడుగును. తనలో నేమిదోషము లేక పోయినను, తనరాజ్యములో నెక్కడనో అధర్మము జరుగు

చున్నదనియు, దానిని నివృత్తిచేసినయెడల విప్రబాలుడు బ్రదుకుననియు చెప్పిరి. వెంబడే రాముడు పుష్పకవిమానా రూఢుడై రాజ్యము నలుదిక్కుల పర్యటించెను. ఒకచోట నొకసరోవరము చెంత దారుణమైన తపము జేయుచున్న నొక వ్యక్తిని జూచెను. వానినిప్రశ్నించగా, తాను శంబుకుడను నొక శూద్రుడననియు, సశరీరస్వర్గప్రాప్తికొఱకు తపస్సు చేయు చున్నానియు, చెప్పెను. శూద్రుడు తపోనిష్ఠకనర్హుడు. మీదు మిక్కిలి సశరీరస్వర్గప్రాప్తికై తపముచేయుట అధర్మము. అది శాస్త్రనిషేధము. అందుకనిరాముడాశూద్రుని వెంటనే వధించెను. తక్షణమే మృతుడైన విప్రబాలుడు బ్రతికెను. దేవ తలు పుష్పవర్షముల గురిపించిరి. ఆవిధముగా నధర్మమును శిక్షించి, మృతబాలుని బ్రతికించెను. ధర్మముకొఱకై సీతను త్యజించెను. అధర్మనిర్మూలనకై శంభుకుని వధించెను. తనచే వధింపబడుటచే శంభుకునికి స్వర్గప్రాప్తికలిగెను. ఆవిధముగా శంబుకుని కోరిక గూడ సఫలమాయెను. ప్రజాపరిపాలన, ప్రజా రక్షణ, కోశసంగ్రహణ, రాజనీతి మొదలగు రాజ్యధర్మము లన్నియు రామునికి బాగుగా తెలియును. అవియన్నియు చిత్ర కూటమున రాముడు విపులముగా భరతునికి బోధించెను.

రాముడు యుద్ధధర్మములు బాగుగా ఆచరణలోపెట్టి నాడు. ఒక్కవాలివధ విషయములో రామునిప్రవర్తన వివా దాంశముగా పరిణమించినది. దానికి తగిన సమాధానము రాముడే జెప్పినాడు. ఆవిషయమై ముందుచర్చించెదము. ఇంద్ర

జిత్ తన మూడవసారియుద్ధములో కనబడకుండా మేఘముల చాటునుండి దివ్యాస్త్రప్రయోగము చేయును. రామలక్ష్మణులకు వాడొక్కడనూ కనబడకపోవుటచే నేమిచేయుటకు తోచక నూరకుండిరి.

అప్పుడు లక్ష్మణుని కాగ్రహమువచ్చి బ్రహ్మాస్త్రప్రయోగముచేసి వానిని వధించెద ననును. చాటునుండి ఎవ్వరికి కనబడకుండా యుద్ధముచేయువాని మీద (ప్రచ్ఛన్నయుద్ధము చేయువానిమీద) బ్రహ్మాస్త్రము ప్రయోగముచేయుట ధర్మముగాదనియు, వాడెప్పుడో యొకప్పుడు బయటికి వచ్చితీరవలయుననియు, అప్పుడు వధించవచ్చుననియు రాముడు లక్ష్మణునితో చెప్పును.

అయుధ్యమానం ప్రచ్ఛన్నం ప్రాంజలిం శరణాగతం।
పలాయంతం, ప్రమత్తం వా నత్వంహంతుమిహార్హసి ।

యుద్ధముచేయనివానిని, ప్రాంజలిని, శరణాగతుని, చాటుగానుండి కనబడకుండా యుద్ధము చేయువానిని, పలాయనము చేయువానిని, ప్రమత్తునిని వీరిలో నెవరిని చంపుట ధర్మముగాదని కలహానిచ్చును. రావణుడు తన ప్రథమయుద్ధములో రామునిచే దెబ్బలుతిని, దీనస్థితిలో వివర్ణవదనుడై, విహ్వలుడై, పరితపించుచుండెను. ఆరోజు ఉదయమునుంచి హనుమదాది మహావీరులతో యుద్ధమొనర్చి సాయంకాలమునకు రావణుడు రామునివద్దకు చేరుకొనెను. ఒకఅరగంటలో రాముడతని కిరీ

టమును భగ్నముచేసి సారథిని చంపి, హయముల కూలనేసి యతనివిూద శరవర్ష ము కురిపించెను. రావణుడు వివర్ణవద నుడై వెలవెలబోవుచుండెను. అతనినిజూచి జాలినొందిన వాడై రాముడీవిధముగా బల్కుచున్నాడు.

కృతం త్వయా కర్మ మహత్సుభీమం
హతప్రవీరశ్చ కృత స్త్వదాహం

తస్మాత్ పరిశ్రాంత యితి వ్యవస్య
న త్వాం శరై ర్మృత్యువశం నయామి

నీవు చాలాగొప్పయుద్ధ మిూరోజున చేసితివి. అనేక మంది మహావీరుల పరిమార్చితివి. అందువలన చాలా అలసి యున్నావని తెలిసి, నిన్నుయిప్పుడు చంపదలచుకొనలేదు.

ప్రయాహి జానామి రణార్దిత స్త్వం
ప్రవిశ్య రాత్రించరరాజ లంకామ్
ఆశ్వాస్య నిర్యాహి రథీ సథన్వీ
తదాబలం ప్రేక్ష్యసి మేరథస్థః

నీవు గొప్పయుద్ధము చేసి, చివరకుదెబ్బలుతిని, అలసి యున్నావని నాకు తెలుసును. నీవీరాత్రి లంకకువెళ్ళి, తగిన విశ్రాంతి తీసికొని, కొత్తరథమెక్కి, సర్వాయుధములతో మరలరమ్ము. అప్పుడు, నాబలము చూచెదవుగాక! యని రావ ణుని పంపివేసెను. దీనివల్ల రామునియొక్క ధర్మబుద్ధి, ఉదా రత, దయ వ్యక్తమగుచున్నది.

రాముడు కర్మిష్ఠి, గృహస్థుగా చేయవలసిన నిత్యనైమి
త్తికకర్మలన్నియు నాచరించెడివాడు. మిాదుమిక్కిలి యజ్ఞ,
అహితాగ్ని, అశ్వమేధాది మహాక్రతువు లనేకములు సీతయొక్క
కాంచన విగ్రహము ప్రక్కనబెట్టుకొని చేసెను. చిత్రకూట
ములోను పంచవటియందును, పర్ణశాలనిర్మాణము జరిగినపిదప,
వాస్తుశమనం, గృహప్రవేశహోమములు జరిపి పర్ణశాలలో
ప్రవేశించెను. వైశ్వదేవము చేసినతర్వాత, సీత వాయసబలి
వేయుసమయములో కాకాసురుడు వచ్చిసీతను బాధించుచుం
డగా వానిమీద రాముడైషికాస్త్రము ప్రయోగించుట జరి
గినది. ఈసంగతి ప్రక్షిప్తసర్గలో వివరింపబడినది.

పైనచెప్పినధర్మములే గాక యనేకధర్మ సూక్ష్మములను
గూడా రాముడు ఆచరణలో బెట్టినాడు. ఉదాహరణకు రెండు
మూడు సంఘటనలను వివరించెదను. విభీషణుడు రావణుని
దుష్టప్రవృత్తికిగర్హించిఅతని మృతకళేబరమునకు సంస్కారము
చేయుటకు సంకోచించెను. అప్పుడు రాముడు చెప్పినమాటలు
"మరణాంతాని వైరాణి నివృత్తిపినః ప్రయోజనమ్". అనగా
వైరభావము చావువరకేగాని తర్వాత చూపగూడదు. రావ
ణుడు తపోబలశాలి. నీకేగాదు, నాకుగూడా సోదరుని వంటి
వాడు. నీవు చేయునియడల నేనే సంస్కారము చేసెదనని చెప్పి
విభీషణునిచేత సంస్కారము చేయించెను.

రావణవధ జరిగిన పిమ్మట లంకలోనున్న సీతను విభీష

ణుని యనుమతిమీద తీసికొని రావలశినదిగా యాజ్ఞాపించెను. వీలననగా విభీషణుడు లంకకురాజు. రాజయొక్క అనుమతి లేని దేదియు చేయగూడదు. వాలి బ్రతికి యుండగనే అంగదునికి యువరాజ్యపట్టాభిషేకము సుగ్రీవునిసన్నిధిలో చేసెను. అదిధర్మము ఈవిధముగా సత్యోత్తమధర్మములే గాక ధర్మ సూక్ష్మములను గూడా ఆచరణలో బెట్టిన మహానుభావుడు.

(2) కృతజ్ఞుడు :- అనగా చేసినమేలు మరువనివాడని అర్థము. అంతియేకాదు, ఇతరులు తనకు కొద్దిమేలు చేసినను ఎక్కువగా చెప్పుకొనుట. తానితరులకు గొప్పమేలుచేసినను, బహుస్వల్పమని చెప్పికొనుట, ఇదికృతజ్ఞుని లక్షణము. ఆయన కృతజ్ఞతకు తారాక్షణము; తనకు సహాయము చేసిన సుగ్రీవ విభీషణులకు పట్టాభిషేకము చేసెను. తనకోసము ప్రాణముల బాసిన జటాయువునకు తను స్వయముగా సంస్కారముచేసి ఉత్తమగతులను కల్పించెను. రావణవధానంతరము దేవేంద్రుడు వరముల కోరుమని యడిగినప్పుడు తనకోసము ప్రాణముల నర్పించిన వానరులందరిని బ్రతికించమని కోరెను. ఆ వానరులందరికి సర్వఋతువులలోను, ఫలములను, మధువు దొరకు నట్లుగా ననుగ్రహించమని రెండవవరము కోరెను. చూచితిరా రాముని స్వార్థరాహిత్యత, కృతజ్ఞత.

(3) సత్యవాక్యి :- సత్యవాక్పరిపాలనకు రాముడ త్యుత్తమస్థానము నిచ్చినాడు. ఆడినమాట తప్పకపోవుట యను

నది. ఇక్ష్వాకుచక్రవర్తులందరికి స హా జ గు ణ మై యున్నది. ఇక్ష్వాకు, రఘు, దిలీప, మహారాజులందరు, సత్యసంగరులు, దశరథమహారాజుగూడ సత్యపాశబద్ధుడై రామలక్ష్మణుల విశ్వామిత్రుని వెంబడిపంపినాడు. ఆ సత్యమునకు కట్టుబడియే ప్రియమైన జ్యేష్ఠపుత్రుని యరణ్యమునకు బంపినాడు. రాముడు తనజీవితమంతయు సత్యనిర్వాహణలొఅకే ధారవోసినాడు. ప్రతిజ్ఞ చేసినప్రకారము రావణుని జంపి విభీషణునకు పట్టాభిషేకముచేసినాడు. సుగ్రీవుని యెదుట ప్రతిజ్ఞచేసినప్రకారము వాలిని "ఏకేనై కేనబాణేన" ఒక్కబాణము చేతనే వధించినాడు. సత్యవాక్పరిపాలనగుఱించి రాముడక్కడక్కడచెప్పినమాటలు గణింపదగినది. తనయువరాజ్యపట్టాభిషేకమునకు ముందు దశరథుని యాజ్ఞప్రకారము సుమంత్రుడు రాముని కైకేయి గృహమునకు (దశరథుడున్న స్థలమునకు) గొనిపోవును. తండ్రి దీనుడై శోకార్తుడై నోటమాటరాక స్తబ్ధుడైయుండెను. అది జూచి తనతండ్రి కోరికేదియో చెప్పమనియు ఆకోరికప్రకారము చేసెదననియు, రామునికి రెండునాలుకలు లేవనియుచెప్పెను.

తద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో యదభికాంక్షితం ।
కరిష్యే ప్రతిజానామి । రామో ద్విర్నాభిభాష తే ॥
అనృతం నహి రామస్య కదాచిదపి సమ్మతమ్
విశేషేణాగ్రమస్థస్య । సమీపే స్త్రీజనస్యచ ॥

రాజుయొక్క కోరికేదియో చెప్పుము. అదితప్పకతీర్చె

దనని ప్రతిజ్ఞ చేయుచున్నాను. రెండువిధములుగా మాటలా డుట రాముని తత్వముగాదు. రాముని కనృతమనునది ఎప్పుడు పనికిరాదు. ముఖ్యముగా స్త్రీలసన్నిధిలో ఋషులసన్నిధిలో నసలే పనికిరాదని వివరించెను.

విభీషణునితో రాముడు చెప్పినమాటలు.

అహం హత్వా దశగ్రీవం సప్రహస్తం సహాత్మజం
రాజానం త్వాం కరిష్యామి సత్యమేతద్ధ్రువీమి తే॥

దశగ్రీవుని, ప్రహస్తుని, ఆత్మజులతోసహా అందరిని వధించి నిన్ను రాజుగా చేసెదను. ఇదిసత్యము అనిచెప్పినాడు. ఆవిధముగానే, రావణుని సపుత్రమిత్రబాంధవముగా కడతేర్చి విభీషణుని రాజుగాచేసెను.

దండకారణ్యములో ఋషులు, రాక్షసులు పెట్టుచున్న బాధలన్నియు చెప్పి, రాముని రక్షించమని ప్రార్థించిరి. రాక్ష సులచే చంపబడిన మునుల అస్థిపంజరములగుట్టలు గూడ రామునికిజూపిరి. కరుణగలిగి రాముడు పెంటనే రాక్షసవధచేసి దండకారణ్యము నిష్కంటకముగా చేసెదనని ప్రతిజ్ఞ చేసెను. అదిచూచి సీత యటువంటి ఘోరప్రతిజ్ఞ చేయుట సమంజ సముగాదని నివారించెనుకాని, రాముడామెతో చెప్పిన మాటలు ప్రశంసనీయములు.

అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణ
నహిప్రతిజ్ఞాం సంశృత్య బ్రాహ్మణేభ్యోవిశేషతః

నేను, నాజీవితమునుగాని నిన్నుగాని లక్ష్మణునిగాని త్యజించుటకు సిద్ధుడ నయ్యెదనుగాని ముందుప్రతిజ్ఞ చేసి (ముఖ్యముగా బ్రాహ్మణులకు ఋషులకు) మరల వెనుదీయుట కెంత మాత్ర మంగీకరించనని రాముడుద్ఘాటించెను. ఆవిధము గానే ధర్మముకొఱకై సీతను త్యాగముచేసెను. తన బహిఃప్రాణమగు లక్ష్మణుని, సత్యవాక్పరిపాలనకొఱకై త్యజించెను. ఈవిషయములు మున్ముందు విపులముగా చర్చించబడును. ఇది యునుగాక సుగ్రీవునితో సఖ్యముచేసిన బిదప తను ఇదివరలో నెన్నడబద్ధమాడలేదనియు ఇకముందుగూడ నాడననియు ప్రతిజ్ఞాప్రకారము నీభార్య నపహరించిన వాలిని ఇప్పుడే తప్పక వధించెదనని గట్టిగా చెప్పినాడు. ఈభావమే క్రిందశ్లోకములో చెప్పబడియున్నది.

అనృతం నోక్తపూర్వం మే నచవక్ష్యే కదాచన।
అద్యైవ తం వధిష్యామి తవభార్యాపహారిణమ్ ॥

కాని, ఇక్కడ నొకవిచిత్రమైన విశేషమున్నది. సత్యవాక్యుడైనరాముడు ఒకసమయమున సూతుడైన సుమంతునితో, నవసరమైనయెడల క్లిష్టపరిస్థితులలో కొంచెమబద్ధమాడవచ్చునని సలహాయిచ్చినట్లు వాల్మీకిరామాయణములో గనబడుచున్నది. ఈసంగతి యితరరామాయణములలో నెక్కడనులేదు. సూతుడు దశరథుని యాజ్ఞానుసారము సీతారామలక్ష్మణుల నరణ్యములో దింపివచ్చుటకై రథముమీదనెక్కిం

చుకొని రాజమార్గమున బోవుచుండెను. దశరథుడు శోకమాపు కొనలేక 'తిష్ట, తిష్ట' (నిలు, నిలు, రథమాపమని) యని ఆక్రో శించుచుండెను. రాముడు "యాహి, యాహి" (పోనిమ్ము, పోనిమ్ము) అని ఆదేశించెను. ఈరెండుఆజ్ఞలమధ్య రెండుచక్ర ములమధ్యబడినవానివలె, సంధిగ్ధములోపడిన సూతుడు రథమా పబోవుసమయమున, రాముడు చెప్పినమాటలు గమనించదగినవి "రథముపోనిమ్ము! రాజడిగినయెడల నాకువినబడలేదని చెప్ప వచ్చునులే" అని సలహాయిచ్చెను. ఈసందర్భములో వాల్మీకి శ్లోకములు గమనింపుడు వీటిభావము పైనచెప్పబడియున్నది.

తిష్ఠేతిరాజాచుక్రోశ, యాహియాహీతిరాఘవః
సుమంత్రస్యబభూవాత్మా చక్రయోరివచాంతరా॥

నాక్రోశమితి రాజాన ముపాలబ్ధోసివక్ష్యసి
చిరందుఃఖస్యపాపిష్ఠ మితి రామ స్తదాబ్రవీత్॥

రాముడటువంటి సలహా దేనికిచ్చినాడని సందేహము రావచ్చును. దానికిసమాధానము పైశ్లోకములోనేయున్నది. "చిరందుఃఖస్యపాపిష్ఠమ్" అని వాల్మీకినుడివినాడు రథము నాపి నందువలన తన తల్లిదండ్రుల కెక్కువదుఃఖము కలిగించుటయే గాని వేరుప్రయోజనము లేదు. ఏలననగా, తనువనవాసమునకు వెళ్ళకతప్పదు. అయోధ్యలో వున్నకొలది తలితండ్రులకెక్కువ దుఃఖము కలుగచేసినవాడగును. అది మహాపాపము. తనకు మనోబాధ కలుగచేయును. అందుకని తను ఆగకుండా వెళ్ళ

టయే సమంజసమనితోచి రాముడావిధముగా సుమంతుని కాజ్ఞ యిచ్చినాడని వ్యాఖ్యకారులు విమర్శించినారు.

4) దృఢవ్రతుడు :- రామునిదృఢవ్రతము నిరూపించుట

కాయన ఏకపత్నీవ్రత మొక్కటియే చాలును. సార్వభౌముడయి యుండికూడా 11,000 ల సంవత్సరములు, భార్యలేకుండా (మరలవివాహముచేసుకొనకుండా) సీతయొక్క కాంచనవిగ్రహమును ప్రక్కనబెట్టుకొని అశ్వమేధాది మహాక్రతువులొనర్చెను. 14 సంవత్సరములు దీక్షతో మునివేషమున కాలము గడపినాడు. సుగ్రీవుడు తనయభిషేకసమయమున కిష్కింధకు రమ్మనమని ప్రార్థించెను. తనువనవాసదీక్షలో నుంటిననియు, పట్టణములలోనుండననియు విందులలో బాల్గొననియు చెప్పి వర్షాకాలమంతయు కిష్కింధపరిసరములలో నున్నప్రస్రవణగిరి గుహాలలో గడపినాడు. విభీషణపట్టాభిషేకసమయమున గూడ తనువిందులారగించచనియు తనకొఱకు మునివేషములో ఫల మూలాశనుడై భరతుడు వేచియుండుననియు, అతనిని చూడకుండా, 14 సంవత్సరముల వనవాసదీక్ష పూర్తిగానిది, తను విందులారగించచనియు చెప్పి వెంబడే పుష్పకవిమానమునిూద నయోధ్యకు బయలుదేరెను. సీత, భిక్షువేషములోనున్న రావణునితో, తనభర్తదృఢవ్రతుడనియు "దద్యాన్నప్రతిగృహ్ణీయాత్, సత్యంబ్రూయాత్ నచానృతమ్, ఏతత్ బ్రాహ్మణ! రామస్యవ్రతమ్, అనిచెప్పినది. ఇచ్చుటయేగాని, పుచ్చుకొనకపోవుట. సత్యము మాట్లాడుటయేగాని అనృతముమాట్లాడ

కుండుట, రాముని యొక్క వ్రతమని సీత చెప్పినది. దీనివలన రాముడు దృఢవ్రతుడని విశదమగుచున్నది.

4) చారిత్రేణచకోయుక్తః :- సచ్చారిత్రుడని యర్థము. ఇక్ష్వాకుచక్రవర్తులందరు ధర్మమూర్తులు, సచ్చారిత్రులు కనుకనే, వారిచరితమున కేకళంకము కలుగకుండునటులగా ప్రవర్తించుట తనకర్తవ్యమని రాముడుద్ఘాటించినాడు. ఆకారణము చేతనే, సీతయగ్నిప్రవేశమున కభ్యంతరము పెట్టలేదు. ఆసందర్భమున, రాముడు చెప్పినమాట లద్వితీయములు. సచ్చరిత్రకాయన యెంతప్రాముఖ్యతయిచ్చినది, ఈక్రింది శ్లోకములలో గమనించవచ్చును.

కపిమాంస్తు కులేజాతం స్త్రియమ్ పరగృహోషితమ్
తేజస్వీ పునరాదద్యాత్ సుహృల్లోభేన చేతసా॥
రావణాంకపరిక్లిష్టాం దృష్టాం దుష్టేనచక్షుషా
కథం త్వాం పునరాదద్యామ్ కులం వ్యపదిశన్ మహత్.

పరగృహములో కొంతకాలమున్న స్త్రీని, కులీనుడు సచ్చారిత్రుడైన వీపురుషుడు లోభముచేగాని, ప్రేమచేగాని, మరల స్వీకరించునా? గొప్పవంశములోపుట్టిన నేను ఏవిధముగా రావణాంకపరిభ్రష్టురాలైననిన్ను చేరదీయగలను? ఇంకా అతికఠినముగాను, నిష్ఠూర్యముగాను, ఆపరమసాధ్వని రాముడు కఠినోక్తులాడెను.

ప్రా ప్తచారిత్రసందేహా మమప్రతిముఖేస్థితా
దీపో నేత్రాతురస్యేవ ప్రతికూలాసి మేదృఢా॥

తద్గచ్ఛ త్వానుజా నేద్య యథేష్టం జనకాత్మజే।
ఏతావదశదిశో భద్రే కార్యమ స్తి న మే త్వయా॥

సందేహాచరితగా నాయెదుట నీవు నిలబడియుంటివి. కంటిజబ్బుగల మానవుడేవిధముగ దీపశిఖను చూడలేడో ఆవిధముగా నిన్ను నేచూడజాలకుంటినని రాముడు చెప్పుచున్నాడు. నేనునీకనుజ్ఞ యిచ్చుచున్నాను. నీయిష్టమువచ్చిన చోటునకు వెళ్ళవచ్చును. నీతో నాకేమియుబని లేదు. లక్ష్మణునివద్దకుగాని భరతునివద్దకుగాని, లేక శత్రుఘ్నుని వద్దకుగాని, లేక విభీషణుని వద్దకుగాని, నీవు వెళ్ళవచ్చుననిగూడా చెప్పుచున్నాడు. ప్రథమ మున కొంత ఈర్ష్యజనియించి కోపముమీద రాముడావిధముగా మాట్లాడవచ్చును; (యీఈర్ష్యాభావము సీతను విరాధుడెత్తుకొనిపోవునప్పుడు గూడా రాముడువ్యక్తపరచినాడు). కాని, శుద్ధచారిత్ర యని తెలిసి కూడా యింతకఠినముగా రాముడు బల్కుట సమంజసముగా కనబడదు. దానికి ఒకకారణము. అదిఆయనే చెప్పినాడు. సీతపవిత్రచారిత్రయని తనకు తెలియుననియు, కాని సార్వభౌముడైన తనఎదుట, వానరరాజసుల సమక్షమున, ఆమె పావనత్వము నిరూపణగానిదితను స్వీకరించినయెడల, ప్రజానిందకు పాలగుదుననియు, కులీనుడైన ఏరాజుఆవిధముగా స్వీకరించుట ధర్మముగాదనియు, అక్కడ

ఉన్న వారందరిసమక్షమున ఆమె నిష్కలంకయని నిరూపణ జరుగుటకొఅకే యామె అగ్నిప్రవేశమునకాయన అభ్యంతర పెట్టలేదనియు, తర్వాత రాముడు చెప్పియున్నాడు. ఈ సంద ర్భములో వాల్మీకి ఉదహరించిన ఉపమానము చాలా అర్థవంత మైనది. సీతను దీపమునకు రాముని నేత్ర రోగికి బోల్చినాడు. దీనివలన సీతపరిశుద్ధురాలనియు, రామునిలో నేకించిత్ దోష మున్నదనియు, అందువలననే ఎదురుగా ఉన్న ఆమెనుచూచు టకు కష్టముగానున్నదని, అర్థముస్ఫురించుచున్నది :

5) సర్వభూతహితేరతః :- (సర్వభూతేషుకోహితః). రాముడు సర్వభూతదయాళుడు. తనకపకారముచేసిన కై కేయి యందుగూడా గౌరవము, భక్తి, చూపినాడు. చిత్రకూట సమాగమములో, భరతుడు తనతల్లియగుకైకను దూషించి నపుడు, రాముడు మాతృనిందపనికిరాదనియు, ఆమెదోషమే మియులేదనియు, మందలించెను. రావణవధానంతరము దశ రథుడు ప్రత్యక్షమయి వరములుగోరుమని రామునడిగినపుడు, కై కేయిమీద ఆయనకున్నకోపము, ఆయునకై కేయి భరతుల కిచ్చిన శాపములుపహరించమని ప్రార్థించెను. రాముడు వన వాసమునకు బోయినపిదప దశరథుడు కై కయింటికిబోలేదు, కైకనుపూర్తిగావిసర్జించెను. ఆమె నరకమునకుబోవుగాక యనియు, భరతుడుపెట్టుపిండములు తనుముట్టననియు (తనకు చేరకుండుగాకయనియు) పరుషముగామాట్లాడెను. పవిత్రుడు,

రాజర్షి, యజ్ఞ, యగుదశరథుడు కోపముతో నుచ్చరించిన వాక్యములు శాపముగా బరిణమించు నేమోయను భీతిచే నావాక్యములనుపసంహరించి, కైకేయీ భరతులమీద అనుగ్రహమునుజూపుమని రాముడు తండ్రినిప్రార్థించెను. ఆయనతండ్రిని కోరినవరమిదియే. దీనివలనకైకేయీభరతులయందు రామునికిగలభక్తిప్రేమలువ్యక్తమగుచున్నవి. సర్వభూతహితుడనుటకిదియొకతార్కాణము. దశరథునిభార్యలందరిని తల్లులమాదిరి చూచెను. ప్రజలందరియందు దయచూపెను. చివరికి, పశుపక్ష్యాదులయందు గూడ నపరిమితదయజూపెను. తనకోసము ప్రాణములర్పించిన వానరులనందరిని, ఇంద్రుని ప్రార్థించి, ఆయన చేతనమృతవర్షముగురిపింపచేసి, బ్రతికించెను. చివరికి తనకోస మసువులర్పించిన, జటాయువునకు సంస్కారముచేసి అతనికి ఉత్తమగతులు కల్పించెను. ఆసమయమున రాముడు లక్ష్మణునితో చెప్పినమాటలు.

సీతావిరహజం దుఃఖమ్ నమేసౌమ్యతథాగతమ్
యథావినాశే గృధ్రస్య మత్కృతేచ పరంతప।
రాజాదశరథశ్రీమాన్ యదా యంపతగేశ్వర।
పూజనీయశ్చ మాన్యశ్చ, అని చెప్పియున్నాడు.

తనకోసముప్రాణములర్పించిన గృధ్రరాజునుచూచినప్పుడు, సీతావియోగదుఃఖమునకంటె నెక్కుడుశోకము తననుబాధించుచున్నదనియు, తనతండ్రిమాదిరి, యీపతగేశ్వరుడు మాన

నీయుడు పూజ్యుడనియు గూడా చెప్పెను.-ఇంతియేగాదు; ఈ క్రింది శ్లోకములనుచ్చరించుచు జటాయువునకు ఉత్తమగతులు కల్పించినాడు.

యాగతిర్యజ్ఞశీలానాం ఆహితాగ్నిశ్చయాగతిః
అపరావర్తినాం యాచ యాచభూమిప్రదాయినీం।

మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకమనుత్తమం
గృధ్రరాజ మహాసత్వ సంస్కృతశ్చ మయాఽవజ।

అని యాదేశించినాడు. ఆహితాగ్నులు, వెన్నుజూపించ కుండామరణించిన మహావీరులు, భూదానపరులు, ఏఉత్తమ గతులకుపోవుదురో అక్కడికిపోదువుగాక అనిజలములొదిలెను. పరమాత్మగనుక నే తిర్యగ్యోనియైనపక్షిరాజుకు గూడా నుత్తమ గతులు కల్పించినాడు. ఇక్కడరామునిని "ఈశ్వరత్వము" (సర్వసమర్థత) ద్యోతమగుచున్నది. పైనచెప్పినసంఘటనల యున్నియు రాముని సర్వభూతహితత్వమునకు తార్కాణములు.

6) విద్వాన్ :- సమస్త విద్యలయందు నుత్తీర్ణుడైన మహాపండితుడు. వశిష్టునివద్ద సాంగోపాంగముగా వేదవిద్య నభ్యసించినాడు. విశ్వామిత్రునికడ ప్రయోగసంహారక్రియ లతోసహా అస్త్రవిద్యలన్నియు నభ్యసించెను. బల, అతిబల, యను విద్యలుగూడా నేర్చుకొనెను. ధనుర్వేదపారీణుడు.

7) సమర్థుఁ :- సర్వసమర్థుడు (ఈశ్వరుడుఅని అర్థము గూడగలదు) జటాయువునకు త్తమగతులుకల్పించుట, అహల్యా శాపవిమోచనము, సముద్రశోషణము, ఈపనులన్నియు రామునిసర్వసమర్థత్వమును జాటుచున్నవి. మానవుడీపనుల చేయజాలడు.

8) ఏకప్రియదర్శనుడు :- వీకైకప్రియదర్శనుడు అద్వితీయసౌందర్యమూర్తి- అందుకనే రాముని "పుంసాంమోహన రూపాయ" అనిపూర్వకవులు ఋషులు వర్ణించినారు. వాల్మీకి, రాముని వర్ణనవచ్చినపుడల్లా మైమరచివర్ణించును. రాజీవలోచనుడు, 'ఆజానుబాహుడు, మహాబలుడు, స్మితపూర్వాభిభాషి, మత్తమాతంగవిక్రముడు, సమస్తకళ్యాణగుణగరిష్ఠుడు, చంద్రవత్ ప్రియదర్శనుడు, సింహవిక్రాంతగామి, అనుపలువిధముల వర్ణించినాడు మచ్చుకుకొన్ని శ్లోకము లీక్రింద నుదహరించుచున్నాను.

ఆజానుబాహుఃపద్మాక్షఃరామోలక్ష్మణపూర్వజఃపూర్వాభిభాషీ మధురఃసత్యవాదీ మహాబలఃసౌమ్యస్య సర్వలోకస్య చంద్రవత్ ప్రియదర్శనఃనూనంపురుషశార్దూలో మత్త మాతంగవిక్రమఃశోభయిష్యత్యరణ్యాని విచరన్ సమహాబలఃఅని అయోధ్యలో రాముడువనవాసమునకు వెళ్ళినతర్వాత ప్రజలందరు విలపించినారుట. ఆంజనేయులు సీతఎదుట ప్రత్యయా

ర్థముశ్రీరాముని ఆపాదమ స్తకమువర్ణించినాడు. ఆవర్ణన పరిశీలించినయెడలరాముడతిసుందరుడు, ప్రియుదర్శనుడని చెప్పకతప్పదు.

8) ఆత్మవాన్ - ఆత్మజ్ఞానికనుకనే దండకారణ్యములో, ఋషులు, వారితపోఫలములధారవోసినప్పుడు "అహమేవా వహరిష్యామి" అని స్వీకరించినాడు. జితేంద్రియుడుగనుకనే వన వాసము, పట్టాభిషేకము, రెండు ఒకేమాదిరిగాజూచినాడు.

9) జితక్రోధ :- క్రోధము జయించినవాడు. అనివార్య పరిస్థితులలోతప్ప నెటువంటి యావేశపూరితఘట్టములలోకూడా రాముడు క్రోధమునకు లొంగలేదు. ఖరదూషణాదిరాక్షసులతో యుద్ధము చేయబోవుటకు ముందుగూడా శాంతముగా ప్రవర్తించెను. తను మునివేషములో కాలము గడపుటకై వచ్చితిననియు, తనకువారితో వైరమేమియులేదనియు వారిని తిరిగి వెళ్ళవలసినదిగా కోరెను. వారామాటలకు లెక్కబెట్టక శస్త్రప్రహారములచే రాముని బాధపెట్టిరి. అప్పుడు తీవ్రమైన కోపము తెచ్చుకొని, వారినందరి నొక్కముహూర్తకాలములో నాశనముచేసెను. "క్రోధమాహారయ తీవ్రం వధార్థం దుష్ట రాక్షసాం" దుష్టరాక్షసుల పథకు తీవ్రమైనకోపమును తెచ్చుకొనెనని (అనగా సహజముగా లేదని యర్థము) వాల్మీకి వర్ణించినాడు.

10) ద్యుతిమాన్ - తేజోవంతుడు. ప్రథమమున, జనకుడు రామలక్ష్మణులజూచినప్పుడు వారితేజోరూపములకు విస్మ

యము చెందినవాడై యీతనుమారు లెవరిపుత్రకులనియడుగును. దేవలోకమునుండిదిగిన అశ్వినీదేవతలమాదిరి దివ్యసుందరమూర్తులువలె, ఆకాశమంతయుకాంతియుతముగాచేయు చంద్ర సూర్యులమాదిరి ప్రకాశించున్నారనిప్రశంసించెను.

12) అనసూయకః - అసూయలేనివాడు. గనుకనే భరతుడు చిత్రకూటమునకు వచ్చినపుడపారమైనవాత్సల్యము జూపినాడు. భరతుడు సింహాసనమధిష్ఠించినాడనిఏమాత్రము అసూయజూపలేదు. తనురాజ్యముచేయుట సోదరులకొఱకే యని పలుమార్లు వచించినాడు.

13) గుణవాన్ :- సమస్తకళ్యాణగుణములు మూర్తీభవించినమహాపురుషుడు. 'లోకేవురుషసారజ్ఞఃసాధుశేకోవినిర్మితః' అని వాల్మీకివర్ణించినాడు. "మత్తోప్రియతరః" తనకంటె ప్రజలకెక్కువప్రియము కలుగచేయువాడని దశరథుడేచెప్పినాడు. ప్రజలందఱకంటెముతో రామునిగుణము లీక్రిందివిధముగా దశరథునెదుటవర్ణించినారు.

బహవోనృప, కళ్యాణగుణస్సంతిహి తేసుతే।
గుణాస్గుణవతోదేవ, దేవకల్పస్యధీమతే॥

"తమేవంగుణసంపన్నం రామం సత్యపరాక్రమం।
లోకపాలోపమం దేవమకామయత మేదినీ॥

హేరాజా! నీకుమారునిగుణములిన్నియని మే మేమిచెప్ప

గలము? అనంతకళ్యాణగుణగరిష్ఠుడు, గుణవంతులలో శ్రేష్ఠుడు, దేవతుల్యుడు, లోకపాలురతోసముడై న నాతనిమేదినిభర్తగా గోరుచున్నదనిచెప్పిరి. ఒకఈలోకమునేగాదు, త్రిలోకములనేల సమర్థుడు.

13) వీర్యవాన్ - మహావీరుడు-బాల్యమున సుబాహా, తాటకవధ, మారీచవిక్షేపణము, శివధనుర్భంగము, యౌవనమునఖరదూషణాది చతుర్దశ సహస్రరాక్షసనిర్మూలనము, రావణకుంభకర్ణాదిమహావీరులవధ, రావణునిమూలబలసంహారము, పరశురామగర్వభంగము, సప్తతాళభంజనము, దుందుభికళేబరవిక్షేపణము, మొదలగుసంఘటనలన్నియు రాముని అప్రతిహత అసమానవీర్యమునకు నిదర్శనములు. ఈఅద్భుత వీర్యప్రదర్శనలనుగొన్ని వాల్మీకేవిధముగావర్ణించినది యీ క్రింద పొందుపరచుచున్నాను.

అర్థాధికముహూర్తేన రామేణనిశితైశ్శరైi
చతుర్దశసహస్రాణి రక్షసాం కామరూపిణాం
ఖరదూషణముఖ్యానాం, నిహతానిమహామృధే
చతర్దశసహస్రాణాం రక్షసాంకామరూపిణాం
హతాన్యేకేనరామేణ మానుషేణపదాతినా"

మానవుడు, ఒక్కడు, పదాతియైన, రాముసిచే 1½ముహూర్తములో 14,000ల మంది రాక్షసులు, ఖరదూష

ణాదిమహాపీరులతోసహా, పరిమార్చబడినారని వర్ణింపబడినది.

రావణునిమూలబలవధ :-

10,000ల రథములు, గధికులు, 18,000ల ఏనుగులు' యోధులు, 14,000ల మంది అశ్వికులు, రెండులక్షలమంది పదాతులుగల రావణుని మూలబలమును, దివసాష్టమభాగేన (1¼ గంటలలో) రాముడొక్కడే బరిమార్చెను. ఇదిరాముని యొక్క అసమానవీర్యప్రదర్శన. ఆయునకే విస్మయము గలిగించినది. "ఏతదస్త్రబలం దివ్యం మమవా త్ర్యం బకస్యవా" అని విభీషణునితోబలికెను. ఈ అస్త్రబలం, ఘోరవధ, నేనుచేసినదియా, లేక త్ర్యంబకునిదియా అనిఆశ్చర్యాపోయినాడు. రామునిశస్త్రలాఘవమును, ఖరదూషణాదివధ సమయమున శూర్పణఖసూచినది. రాముడు బాణమునుధనుస్సుకుసంధించినది, లాగినది, విడిచినది, ఎవరికి కనబడలేదనియు, రాక్షసులశిరములుమాత్రము తాళఫలములమాదిరి, ఆకాశములో నెగిరిపడు చుండుటమాత్రము, తనుజూచితినని రావణునితో చెప్పెను. ఇది రాము నియొక్క యుద్ధలాఘవమునకు నిదర్శనము.

14) కస్యభిభ్యతిదేవాశ్చజాతరోషశ్చసంయుగే। క్రోధా విష్ణుర్హైన రాముని చూచి దేవతలుగూడా భయపడెదరట. యుద్ధమునందు రాముడు దుర్నిరీక్షణుడగును. సహజముగా శాంతమూర్తి. కాని రాక్షసవధకప్పుడప్పుడు కోపము తెచ్చు కొనును. అసమయములలో రాముడేవిధముగానున్నది వాల్మీకి యీక్రిందివిధముగావర్ణించినాడు.

1) ఖరదూషణాదిరాక్షసవధముందు :—

అనిష్టం తేజసారామం సంగ్రామశిరసిస్థితమ్।
దృష్ట్వా సర్వాని భూతాని భయాద్వ్యథితేతదా।
రూపమప్రతిమం తస్య రామస్యాక్లిష్టకర్మణః।
బభూవరూపం కృద్ధస్యరుద్రస్యేవ పినాకినః

సంగ్రామాంగణమందు క్రోధవిస్ఫారితేక్షణుడగు రాముని జూచి సర్వభూతములు వణకినవి. సాక్షాత్ కృద్ధుడైన రుద్రుని మాదిరిగా వెలుగుచుండెను.

2) వరశరామ గర్వభంగసమయమున :—

వరాయుధధరం రామం దృష్ట్వం సర్షిగణాఃసురాః
పితామహం పురస్కృత్య భభూవుస్రస్తచేతసాః
జడీకృతేతదాలోకే రామే వరధనుర్ధరే
నిర్వీర్యోజామదగ్న్యోసౌ రామోరామ ముద్వైక్షత॥

పరశురాముడిచ్చిన వైష్ణవధనస్సునెక్కుపెట్టి యుద్ధమునకు సన్నద్ధుడైన రాముని జూచి బ్రహ్మాది దేవతలు ఋషులు, భయపడిరి. పరశురాముడు నిర్వీర్యుడయ్యెను.

3) సముద్రశోషణము :—

మూడురోజు లహోరాత్రములు ప్రాయోపవేశము చేసి ప్రార్థించినను సముద్రుడు ప్రోవనివ్వలేదు. అప్పుడుక్రోధతామ్రాక్షుడై సముద్రుని మీద బ్రహ్మాస్త్ర ప్రయోగము

చేయబోయెను. ఆసమయమున ప్రకృతి స్తంభించెను. కారకలు డుల్లెను సూర్యచంద్రులునిష్ప్రభులైరి. పిడుగులుపడినవి. దృశ్య భూతములు, అదృశ్యభూతములు భైరవస్వనములుచేసినవి. సముద్రుడు ప్రత్యక్షమయి వారధిగట్టుటకుత్రోవనిచ్చెను.ఇక్కడ రామునియొక్క ఈశ్వరత్వము బహిర్గతమగుచున్నది మానవు డెంతపరాక్రమవంతుడైనను పంచభూతములలో నొకటియగు సముద్రమును నిగ్రహించగలడా? అసంభవము.

4) రామరావణయుద్ధము :-

చకమ్పే మేదినీకృత్స్న సశైలవనకాననా
భాస్కరోనిష్ప్రభశ్చాసీత్ నవవేచాపిమారుతః
రామందృష్ట్వా సుసంకృద్ధము త్పాతాంశ్చేవదారుణా
విత్రేసుఃసర్వభూతాని రావణస్యాభవద్భయమ్.

సశైలవనకాననములతో భూమికదలినది. సూర్యచం ద్రులు నిష్ప్రభులైరి. సమస్తభూతములు సంక్షోభముచెందినవి. రావణునికి కూడా భయముకల్గెనని వాల్మీకి వర్ణించినాడు. రామరావణయుద్ధమును నొకముచ్చటైనశ్లోకములో వాల్మీకి మహర్షి చిత్రించినాడు.

సాగరం అంబరప్రఖ్యం అంబరంసాగరోపమం
రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ.

అంబరమునకు సాగరమునకు పోలికచూప వచ్చును. గాని రామరావణయుద్ధము (సరియైనఉపమానములేకపోవు

టచే) రామరావణయుద్ధము మాడిరిగానే యున్నదని వాల్మీకి వర్ణించినాడు. చానిక దేసాటియని అర్థము.

పైనచెప్పినగుణములేకాక రామునియందు ప్రశస్తగుణములు చాలకలవు. మచ్చుకుముఖ్యమైన రెండుగుణములు వర్ణించెదను.

15) రామునికి పరరాజ్యకాంక్ష లేదు. తండ్రియాజ్ఞాప్రకారము స్వరాజ్యమునేత్యజించినవాడు పరరాజ్యములకాసించునా? సార్వభౌముడయినను సామంతరాజుల స్వాతంత్ర్యమును భంగముచేయలేదు. వారినిజయించి వారివద్ద కప్పములు తీసికొనలేదు. సార్వభౌమత్వము, ధర్మరక్షణము, న్యాయపరిపాలనకు, మాత్రమే. తనఅనుగ్రహమువలన రాజ్యప్రాప్తినొందిన సుగ్రీవవిభీషణులవద్ద నేమియు తీసికొనలేదు. చివరకు వారి పట్టాభిషేకసమయములలోజరుగు విందులలో గూడా పాల్గొనలేదు. ఆయనకోదండముపట్టుట, దుష్టశిక్షణ, ధర్మరక్షణకొఱకే. సామంతరాజులు ప్రజానురంజకులుగా నున్నంతవరకు రామునివలన వారికేభయములేదు. వారిస్వాతంత్ర్యమునకేమియు నాటంకములేదు. వారిరాజ్యముల రాముడాసించలేదు.

16) రాముడు ప్రజారంజకుడు:- ప్రజలందరికప్రీతిపాత్రముగా రాముడు యువరాజు కావలెననికోరిరి. ప్రజాపవాదము తొలగించుటకై సీతనుకూడ త్యజించినాడు రాముడు. వనవాసము

నకు వెళ్ళునప్పుడు ప్రజలందరాతని వెంబడించిరి. చివరకు ప్రకృతి గూడ నాశోకములో బాల్గొనినది. వృక్షములు రాముని వైపు వంగినవి. వృద్ధులైనద్విజు లగ్ని హోత్రములతో సహా రాముని వెం బడించిరి. చివరకాయన అవతారసమాప్తి కాలమందు, ఆయన, సోదరులతో పాటు ప్రజలందరు సరయూనదిలో ప్రవేశించిరి. వారినందరిని తనతో పాటు వైకుంఠమునకు దీసికొనిపోయిన దయామయుడు. అంతకంటె ప్రజారంజకత్వమునకువేరు నిదర్శన మేమికావలయును? ప్రజారంజకుడుగనుకనే, పౌరులు వారిలో తరచుగా, ఈక్రిందివిధముగా ననుకొనెడివారట,

యశ్చరామంనపశ్యేత్తు యంచరామోనపశ్యతి.
నిందితశ్చ సర్వలోకేషు స్వాత్మాప్యేనంవిగర్హతే.

ఎవడైతే రామునిచూడడో, ఎవరినైతే రాముడు చూడడో, వారిద్దరు సర్వలోకప్రజలచే నిందితులుగా బరిగ ణించబడుదురు. చివరకు తనకుతానే నిందించుకొనిన వాడగును. (ప్రజలందరు నిందించుటయేకాక తనకుతాను నిందించుకొనును) అందుకనే, యాతనికి రామచంద్రుడను సార్థకనామధేయము కలిగినది.

రాముడు గొప్పదాత: అశ్వమేధాది మహాయజ్ఞము లలో భూరిదక్షిణలొసగెను. తనువనవాసమునకు బోవుముందు తనసర్వస్వమును ద్విజులకు యాశ్రితులకు దానమొసగెను. ఒక్కమాటలో చెప్పవలెనని సమస్తకళ్యాణగుణగరిష్ఠుడు.

ఆమహానుభావుడు భారతదేశములో జన్మించి 11,000 సంవత్స రములు రాజ్యముచేయుట మనభారతీయులభాగ్యము. ప్రతి భారతీయుడు ముఖ్యముగా ప్రజాపాలకులు శ్రీరాముని ఆద ర్శముగాపెట్టుకొని అతనిమాదిరి నడచుటకు ప్రయత్నము చేసినయెడల మనము ప్రస్తుతమనుభవించుచున్న బాధలన్నియు తొలగి ప్రజలు సుఖించెదరనుటలో నేసందేహము లేదు.

లక్ష్మణుడు

లక్ష్మణుడు సుమిత్రయొక్క జ్యేష్ఠపుత్రుడు. దశరథుడు దివ్యపాయసములో 4వ వంతు మొదటిసారి సుమిత్రకిచ్చినాడు. కాన, లక్ష్మణుడు విష్ణువుయొక్క చతుర్థాంశసంభూతుడని చెప్పబడియున్నది. వాల్మీకి లక్ష్మణు నీక్రిందివిధముగా వర్ణించినాడు.

బాల్యాత్ప్రభృతిసుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః
రామస్యలోకరామస్య భ్రాతు ర్జ్యేష్ఠస్య నిత్యశః

సర్వ్రప్రియకర స్తస్య రామస్యాపి విశేషతః
లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణయివాపరః

నచతేన, వినానిద్రాలభతే పురుషో త్తమః
మృష్టమన్నమపానీత మశ్నాతి వహితంవినా।

యదాహి హయమారూఢో న్నుగయాంయాతి
రాఘవః

అశ్నతంచ పృష్ఠతోభ్యేతి సధనుః పరిపాలయాన్

లక్ష్మణుడు రాముని బహిఃప్రాణమునియు, బాల్యము నుంచి మంచిస్వభావము కలవాడనియు, సర్వ్రప్రియకరుడనియు, ముఖ్యముగా రామునకిష్టుడనియు, వారిద్దరొకరినొకరు విడిచి యుండెడివారుకారనియు, లక్ష్మణుడు దగ్గరలేనిది రాము డన్నముతినడనియూ, నిద్రగూడాపోడనియు, వాల్మీకివర్ణించి నాడు. లక్ష్మణుడుగూడా, రాముని వెనుక ధనస్సుపట్టుకొని

అతని వెంబడి హాయహాయూరూధుడై ప్రతిరోజూ వెళ్ళుచుండెడివాడు. ఈ అవినాభావసంబంధ మీసోదరులిద్దరికి చివరివరకు యున్నది. తుదకు రాముడే అనివార్యకారణములవల్ల లక్ష్మణుని నిర్వాసముచేయవలసివచ్చినది. రామవియోగము సహించలేక లక్ష్మణుడు వెంబడే ప్రాణములు విడచెను. రాముడుగూడా లక్ష్మణవియోగము సహించలేక మహాప్రస్థానమునకు బయలుదేరెను.

లక్ష్మణునకు రామునియందపారమైన భక్తిప్రేమలు గలవు. రాముడు వనవాసమునకు బోవుముందు లక్ష్మణుని తన వెంట రావలదని నివారించును. దానికిలక్ష్మణుడొప్పుకొనలేదు. ఆయనస్వయముగా రామునితో చెప్పినమాటలు.

నదేవలోకాక్రమణం నామరత్వమహంవృణే
ఐశ్వర్యం చాపిలోకానాం కామయే న త్వాంవినా.

నీవులేనిది నాకుదేవలోకము, ఐశ్వర్యము, అమరత్వము నక్కరలేదు. నే నవేమియు గోరనని గట్టిగాచెప్పెను. గుహునితో నేకాంతముగా సంభాషించు సమయమునగూడా "నహి రామాత్ ప్రియతరో మమాస్తి భువిక్వచన" రామునికంటె తనకుప్రియతరమైన దేదియు నీభువిలో లేదనిచెప్పెను.

లక్ష్మణుడు సీతారాముల కపారమైన సేవచేసినాడు. అహోరాత్రములు వారికి శుశ్రూషచేసెను. 14 సంవత్సరముల వనవాసములో, రాత్రులందు ధనస్సుపట్టుకొని సీతారాములకు

కాపలాకాచెను. వారికి వనవాసములో సాధ్యమయినంత వర కేగొ అతయుకలుగకుండా సేవచేసెను. రాముసికి కుడి భుజమువలె నుండెడివాడు. రాముడు దుఃఖముతో నిరుత్సా హుడైనప్పుకు తగినయుత్సాహముకల్పించి సీతాన్వేషణమునకు రాముని ప్రోత్సహించెను. రాముడు విరాధునిజూచి భయపడి నప్పుడు ధైర్యము కలిగించెను. సూక్ష్మబుద్ధికలవాడుకనుక రాక్షసమాయలగుర్తెరిగి, రామునకు తగుసలహానిచ్చి సహా యముచేసెను. అజేయుడైన ఇంద్రజిత్ నువధించి రాముని కమూల్యమైన సహాయమొనరించెను. కనుకనే, ఇంద్రజిద్వధా నంతరము రాముడు లక్ష్మణుని కౌగలించుకొని యీవిధ ముగా బల్కినాడు.

త్వయాలక్ష్మణ నాధేన సీతాచ, పృథివీచ, మే
నదుష్పాపా హతేద్యద్య శత్రుజేతరిచాహవే॥

హేలక్ష్మణా! నాథుడవగు నీచేత ఇంద్రజిద్వధింపబడు టచే, నాకు సీతనుగాని, భూమినిగాని, పొందుట దుర్లభము కాదు. అనగా ఇక రావణుని సులభముగా వధించి సీతను, రాజ్యమును, బొందగలుగుదునని యర్థము.

లక్ష్మణుడు త్వరలో ఆవేశము చెందును. కోపము త్వరలోవచ్చును. కాని, తనయందు తప్పున్నయెడల అంత త్వరలో పశ్చాత్తాపబడును. రాముని శాంతవచనములతో కోపముత్వరలోతగ్గును. రాముని కేవిధమైన నపకారముజరిగినను

సహించడు. ఎవరైనా రామునికపకారముచేసినను, చేసెదరని తనకనుమానముకలిగినను, వారిని శిక్షించుటకు వెనుదీయడు, దశరథుడు రాముని వనవాసమునకు బంపుట లక్ష్మణుడు సహించలేకపోయెను. తండ్రియైన దశరథుని నిందించును. రాజధర్మప్రకారము, జ్యేష్ఠుడేసింహాసనము నధిష్ఠించవలెనుగాని, మీదుమిక్కిలి తప్పక యీవరాజ్యపట్టాభిషేకము రామునికి, మరునాడుదయమునసే చేసెదనని రాజసభలో ప్రజాసమ్మఖమున ప్రకటించి, ఆసమయములోపలనే ఆడదానికోరికమీద తన ఉద్దేశ్యమును మార్చుకొనెను. విపరీతుడు, వృద్ధుడు, కామాతురుడు, స్త్రీవాక్యవశంగతుడైనతండ్రిమాటలు జరుపనవసరము లేదు. కార్యాకార్యవిచక్షణలేని తండ్రిని శిక్షించుటధర్మమని లక్ష్మణుడు వాదించును.

గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః
ఉత్పథం ప్రతిపన్నస్యయుక్తం భవతిశాసనమ్॥

అవలిప్తుడై, కార్యాకార్యవిచక్షణలేక ధర్మమునకు విరుద్ధముగాపోవువాడు తండ్రిఅయినను, గురువైనను, శిక్షార్హుడనిలక్ష్మణుడు గట్టిగానుడివెను. రాముడు, తండ్రినిగాని, కైకేయినిగాని, నిందించగూడదనియు, వారి తప్పేమియులేదనియు, జరిగినదంతయు దైవప్రేరేపణయేననియు, తనవనవాసమునకు దైవమేకారణమనియు, చెప్పెను. లక్ష్మణుడది అంగీకరించడు. అవిధముగాహర్షించి యూరకొనుట అసమర్థుని లక్షణము.

పురుషప్రయత్నమువలన నభిషేకము జరుగునట్లు చేసెదననియు, దైవమును పురుషకారముచేత ప్రతిఘటించెదననియు చెప్పెను. యీసందర్భములో వారిద్దరివాదములు ప్రశంసనీయములు. దైవపురుషకారములకెంటియొక్క ప్రాశస్త్యమును వాల్మీకి అద్భుతముగా వర్ణించెను.

తండ్రినినిందించినటులనే, భరతునిగూడ ఆవేశపూరితుడై ప్రథమమున నిందించును. దీనికికారణము రాముని మీదనున్న నిరతిశయప్రేమయే. భరతుడు చతురంగబలములతో రామదర్శనార్థము చిత్రకూటమునకు వచ్చుచున్న దృశ్యమును వృక్షాగ్రమునుండి చూచెను. రాముని చంపి నిష్కంటకముగా రాజ్యము నేలుటకై భరతుడు వచ్చుచున్నాడని భ్రమపడెను. లేనియెడల రామ సందర్శనమునకు చతురంగబలముతో రావలసిన పనియేమున్నది? క్రోధావేశుడై క్రిందనున్నవారితో నీవిధముగా బలుకుచున్నాడు.

సంపన్నంరాజ్యమిచ్ఛంస్తు వ్యక్తం రాజ్యాభిషేచనం।
ఆవాం హంతుంసమభ్యేతి కైకేయ్యాఃభరతఃసుతఃస

సంపన్నమయినరాజ్యమును నిష్కంటకముగా భోగింప నిచ్ఛకలవాడై భరతుడు మనలనుచంపుటకు వచ్చుచున్నాడని వ్యక్తమగుచున్నది.

సంప్రాప్తోయ మరి ర్వీరభరతో వధ్యఏవహి
భరతస్యావధేదోషం నాహం పశ్యామి రాఘవ।

మనశత్రువైన భరతుడు వచ్చుచున్నాడు. అతనిని చంపుటలో నేమియుదోషముకనబడుటలేదు. అని, క్రూరభాషణములతో భరతుని నిందించుచూ నతనివధకుద్యుక్తుడైన లక్ష్మణుని జూచి రాముడు శాంతవచనములతో నీక్రిందివిధముగా చెప్పుచున్నాడు. తండ్రిమాటనిలుపుటకై రాజ్యము వదలి అరణ్యమునకువచ్చిన నేను భరతునిచంపి ఆ రాజ్యమును స్వీకరించెదనా? నేనురాజ్యమును స్వీకరించుట మీకొఱకే! భరతునితోసహా మీరందరునాకుప్రియులే. బంధువులను, సోదరులను హింసించి నేనారాజ్యమునస్వీకరింపచాలనని గట్టిగాచెప్పెను. అదిగాక, మనము భరతుని శంకించవలసిన అవసరములేదు అతడెన్నడైన నిదివరలో మనకువిరోధిగా ప్రవర్తించెనా? రాజ్యమనుభవించుటకై వచ్చినాడని నీవుదుర్భాషలాడినయెడల నారాజ్యమును నీకివ్వవలసినదిగా భరతునికోరెదను. అతడుసంతోషపూర్వకముగ నిచ్చును. (ఈమాటలలో నీకేమైనా రాజ్యకాంక్షకలదేమోగాని, భరతునికేమాత్రము రాజ్యమునందు కోరికలేదని స్పష్టమగుచున్నది) భరతుడు, శోకపీడితుడై, స్నేహపూర్వకముగా మనలనయోధ్యకు గొనిపోయి, నాకురాజ్యమిప్పించగలందులకై. చతురంగబలముతోను, ప్రజలతోను వచ్చుచున్నాడు. ఇందుకు సందియము లేదని రాముడు గట్టిగాచెప్పుచున్నాడు.

శ్మశ్రుప్రవ్రాజితంమాంహి జటావల్కలధారిణమ్।
జానక్యాసహితవీర త్వయాచపురుషర్షభ॥

స్నే హేనా క్రాంతహృదయుఁ శో కేనా కులి తేం ద్రియుఁ
దృష్టుము భ్యా గతో హ్యే షభరతో నా త్రసంశయుఁ॥

నేను, సీతోను, సీతతోను, జటావల్క లములధరించి వనవాసమునకు వెళ్ళితినని తెలుసుకొని, స్నేహముతోను, శోకముతోను బాధబడినవాడై; మనల రాజలాంఛనములతో తీసికొని వెళ్ళుటకు చతురంగబలస మేతుడై వచ్చుచున్నాడని చెప్పెను. ఈవాక్యములు విన్నతర్వాత తనపొరబాటుకు చింతిలి సిగ్గుతోలక్ష్మణుడు తలవంచుకొ నెను.

మూడవసారి, సుగ్రీవునిమీద ఆగ్రహము తెచ్చుకొ నెను. సుగ్రీవుడు వర్షాకాలము వెళ్ళగనే సీతా న్వేషణప్రయత్నము చేసెదనని రామునికి వాగ్దానము చేసెను. కాని ఆశ్వీయుజమాసము వచ్చినను, కామభోగలాలసుడై, సుగ్రీవుడాప్రయత్నము చేయకుండుటజూచి రాముడు బాధపడునను. సుగ్రీవునివద్దకు వెళ్ళి అతడిచ్చినమాట నిలుపవలసినదిగా హెచ్చరించుమని లక్ష్మణునితో చెప్పెను. సుగ్రీవుని మిత్రద్రోహమునకు, రాముని బాధకు సహించలేక, సంచలితకోపాధరుడై, కిష్కింధ ప్రవేశించి సుగ్రీవుని గృహద్వారమున నిలబడి, ధనుష్టంకారముచేసి తనరాకలక్ష్మణుడెరిగించెను. సుగ్రీవుడు తనతప్పు తెలిసికొని, తనభార్యయగు తారను లక్ష్మణుని శాంతింపచేయుటకు బంపును. లక్ష్మణుడు పరస్త్రీలనుజూచి సిగ్గుచే తలవంచుకొను స్వభావముగలవాడు. "స్త్రీ సంనికర్షాత్ వినివృత్తకోపః"

యని వాల్మీకి వర్ణించినాడు. తారనుచూడగనే లక్ష్మణుని కోపము కొంతతగ్గినది. తన నేర్పరితనముచే తార లక్ష్మణుని పూర్తిగా శాంతింపజేసి సుగ్రీవునివద్దకు తీసికొనివెళ్ళును. సుగ్రీవలక్ష్మణులిద్దరు తమతప్పులను తెలిసికొని పశ్చాత్తాపపడి రామునివద్దకు వెళ్ళుదురు.

లక్ష్మణుడు సీతయందపారభక్తి గౌరవములుగలవాడు ఆమెను తల్లిమాదిరిచూచెడివాడు. 13 సంవత్సరములామె సన్నిధిలోనున్నను, ఆమెముఖమువంక కన్నెత్తిచూడలేదు. నిత్యము పాదాభివందనము చేయుటచే నామెపాదములు, పాదాభరణములు మాత్రముగనబడుచుండెడివి. గనుకనే, ఋశ్యమూకపర్వతమునిమీదుగా సీతను రావణుడాకసమున నెత్తుకొనిపోవునపుడు ఆమె వానరులసన్నిధిలో బడవైచిన యాభరణములను లక్ష్మణునిముందుంచి అవి వదినెగారి వేమోగుర్తించుమని రాముడు లక్ష్మణునాదేశించెను. అప్పుడు లక్ష్మణు డామెకాలినూపురములు మాత్రమే గుర్తించగలిగితి ననిచెప్పుచూ యీక్రిందివాక్యములుబల్కినాడు.

నాహంజానామికేయూరే నజానామికుండలే
నూపురావేవ జానామి నిత్యంపాదాభివందనాత్।

నాకామెకేయూరములు, కుండలములెట్టులనుండునో తెలియవు. నిత్యమామెపాదములకు నమస్కరించుచుండుట వలన నామెనూపురములు మాత్రము నాకుతెలియునని వాటిని

రాము నెదుట బెట్టెను. దీనినిబట్టిచూడ లక్ష్మణునిదృష్టి సీత పాదములయందే ననవరతము లగ్నమైనదనియు సీతయందతనికి పూర్ణమైనమాతృభావముగలదని యర్థము. ఒక్కసీతయందే గాదు, ఇతర స్త్రీలయందుగూడా మాతృభావముగలవాడు. కనుకనే తారనుచూడగనే తలవంచుకొనెను.

ఆంజనేయుడు లక్ష్మణుని మహాబలుడని వర్ణించినాడు. దివ్యాస్త్రబలసంపన్నుడు. అకంపనుడు, అతికాయుడు మొదలైనవీరులనువధించెను. అతడింద్రజిత్తునుచంపి జగద్విఖ్యాతిగాంచెను. రామాయణయుద్ధములో బ్రహ్మస్త్రిగాంచినదింద్రజిత్ లక్ష్మణులయుద్ధమే. అందువలననే శ్రీరామపట్టాభిషేకానంతరము రామదర్శనార్థము వచ్చినమహర్షులందరు లక్ష్మణుని బ్రశంసించెదరు. రాముడు విస్మయుడై కారణమడిగెను. రావణుని జంపుటకంటె ఇంద్రజిత్తునువధించుటయే గొప్పకర్మయని వారు నుడివెదరు. మూడురోజులహోరాత్రములు యుద్ధముజరిగినది. ఇద్దరుమహావీరులప్రతిద్వంద్వ యుద్ధముజేసిరి. కొన్నిసార్లు లక్ష్మణుడు మూర్ఛనొందెను. కొన్నిసమయములఇంద్రజిత్ నిస్పృహుడయ్యెను. అమోఘమైనశస్త్రాస్త్రములిద్దరుప్రయోగించిరి. పంచభూతములు క్షోభిల్లినవి. దేవర్షిగంధర్వులు భయోద్వేగములతో జూచుచుండిరి. చివరకు రామునిస్మరించి, లక్ష్మణుడైంద్రాస్త్రమును ప్రయోగించెను. దానితో ఇంద్రజిత్ మరణించెను. దేవదుందుభులుమ్రోగెను, పుష్పవృష్టికురిసెను. వానరవీరులందరు లక్ష్మణుని కొగలించుకొని యభినందించిరి.

ఐంద్రాస్త్రప్రయోగముబూర్వము రాముస్మరించిలక్ష్మణుడు నుడివినశ్లోకము.

ధర్మాత్మా సత్యసంధశ్చ రామోదాశ రధిర్యది
పౌరుషేణాప్రతిద్వంద్వ: శరై నంజహిరావణిం.

ఇక్కడవిశేషమేమన ఎంతగొప్పవీరుడైనప్పటికి లక్ష్మణుడు అహంభావమువదలి పరమేశ్వరుని స్మరించినకాని ఇంద్రజిత్ చావలేదు. అప్పుడు దేవేంద్రుడు మొదలుగాగలదేవతలు, హనుమత్ జాంబవాది వానరవీరులు లక్ష్మణునభినందించెదరు, చివరకు, రాముడుగూడ లక్ష్మణునికొగలించుకొని, యిక రావణునివధించి సీతనుబొందుట దుర్లభముగాదని వక్కాణించెను.

లక్ష్మణుడు రాముని యాజ్ఞలు శిరసావహించి నెరవేర్చెడివాడు. అది రామునికి తెలుసును. తనకిష్టములేకపోయినను రామాజ్ఞనిర్వహించెను. ఉదాహరణకు రెండుసంఘటనలు చెప్పెదను. మొదటిది, తనకిష్టములేకపోయినను,సీతయగ్నిప్రవేశమునకు కాష్ఠములబేర్చి, అగ్నినిప్రజ్వలింపజేసెను, రెండవది రాముని యాజ్ఞప్రకారము గర్భిణియగు వదినెగారిని వాల్మీకియాశ్రమపరిసరారణ్యప్రాంతములో దించివచ్చెను. పొంగి పొరలివచ్చుచున్న శోకమునాపుకొని రామాజ్ఞలనిర్వహించినాడు. కాని రామాయణగాధను పరిశీలించినయెడల రెండు సార్లు రామాజ్ఞను లక్ష్మణుడుల్లంఘించినట్లు గూడకనబడును. అటులచేయని చోజరుగుప్రమాదములు బలవత్తరములనిగహిం

చుటచే నావిధముగా జేయకతప్పినదికాదు. కానిఅప్పుడుగూడా, సాధ్యమయినంతవరకు రామాజ్ఞనతిక్రమించకుండావుండుటకు బ్రయత్నముజేసెను. కాని అనివార్యపరిస్థితు లేర్పడుటచేతను ఉల్లంఘించనిచో భయంకరపరిణామములు జరుగు సూచనలు కనబడుటచే నావిధముగా లక్ష్మణుడుచేయవలశివచ్చినది.

మొదటిది శ్రీరామునాజ్ఞకు విరుద్ధముగా సీత నొంటిగా పర్ణశాలవద్దవదలి తను రాముని కొఱకు బయలుదేరుట. "హా లక్ష్మణా, హాసీతా, యను నార్తనాదము రామునిది గాదనియు, అదిమాయరాక్షసులకు తంత్రమనియు, రామునికపకారము చేయగలవాడు ముల్లోకములలోలేడనియు, రాము నాజ్ఞనతిక్రమించుట భావ్యముగాదనియు, ఆవిధముగా జేసిన యెడల రాక్షసులవలన నాపై కేదైన ప్రమాదముజరుగవచ్చుననియు గూడ చెప్పినాడు. కాని సీతవినలేదు. మీదు మిక్కిలి, శ్రోత్రదారుణమైన పరుషవాక్యముల లక్ష్మణుని నిందించి, లక్ష్మణుడు పర్ణశాలవదలనియెడల తను వెంబడే ఆత్మహత్యచేసుకొనెదనని బెదరించి రొమ్ములుబాదుకొని నేడ్వసాగెను. నీచమైన యాపరుషవాక్యములు వినలేక, మాతృరూపురాలగు వదినెగారివాక్యములకు ప్రత్యుత్తరమిచ్చుటకు మనసాడక తను పర్ణశాలవదలనిచో, సీత యాత్మహత్యచేసుకొననుభయముచే, తన కిష్టములేకపోయిననను, సీత రక్షణార్థము, పంచభూతములను, వనదేవతలనుప్రార్థించి, రామునికొఱకు వెడలెను.

రెండవ సంఘటన రామావతారసమాప్తిముందు జరిగినది. కాలపురుషుడు (రుద్రుడు) బ్రహ్మర్షి వేషమున రాముని దర్శనార్థమైవచ్చెను. ద్వారపాలకులు రామునియాజ్ఞప్రకార మాతని లోనికి గొనిపోయిరి. ఆబ్రహ్మర్షి, రామునితో సంభాషించకమునుపే, అతనిచే నొకవాగ్దానము చేయించుకొనెను. వారిసంభాషణపూర్తియగులోపల నెవ్వరిని లోనికి రానీయకూడదనియు ఎవరైననావిధముగా వచ్చినయెడల వారిశిరము రాముడు ఖండించవలయుననియుకోరెను. రాముడందులకియ్యకొనెను. లక్ష్మణునికంటె తనయాజ్ఞసక్రమముగా నెరవేర్చువారువేరొకరులేరని తెలుసుగనుక, లక్ష్మణుని బిలువబంచి, తనయాజ్ఞనుల్లంఘించినయెడల జరుగు ప్రమాదము విషయమై హెచ్చరికజేసి వారిసంభాషణ పూర్తియగులోపల నెవరిని లోనికి రానీయకుండా ద్వారరక్షణచేయవలసినదిగా యాజ్ఞాపించెను. లక్ష్మణుడువాకిలివద్దకురాగానే దుర్వాసమహర్షి రామదర్శనమత్క్షణమే కావలెనని లక్ష్మణునికోరెను. లోనయొక మహర్షి రామునితోసంభాషించుచున్నాడనియు, అతడు బయటికి వచ్చినదాక ఆగవలసినదిగా లక్ష్మణుడు బహువిధముల దుర్వాసునిబ్రార్థించెను. కానిదుర్వాసుడాగ్రహపరవశుడై అయోధ్యనంతయు, రాముని, సోదరులతోసహా, దగ్ధముచేసెదనని శపించుటకుద్యుక్తుడయ్యెను. అందరుమరణించుటకంటె తను ఒక్కడు ప్రాణమువిడచుట మేలనిదలచినవాడై లోపలికిపోయి రామచంద్రునితో దుర్వాసునిరాక నెఱింగించెను. సంభాషించుచున్న

బ్రహ్మర్షి తనసంభాషణ కంతరాయముకలుగుటచే రాముని తనశపథమునిర్వర్తించవలసినదిగా హెచ్చరికచేసి అంతర్ధాతు డయ్యెను. దుర్వాసుడువచ్చినపని నెరవేర్చినపిదప, లక్ష్మణుని తనస్వహస్తములతో చంపవలసి వచ్చినందులకు రాముడుపరితపించుచూ నేమిచేయుటకు తోచకనూరకుండెను. ఆసమయమున వశిష్టులవారేతెంచి, లక్ష్మణుని చంపనవసరములేదనియు అతనిని రాజ్యమునుంచి వెడలగొట్టిన, తలగొట్టినట్లేయనియు ధర్మసూక్ష్మము చెప్పెను. రాముడు లక్ష్మణునివెంబడే తన రాజ్యమునుంచి బహిష్కరించెను. లక్ష్మణుడుడాపరాభవము సహించలేక సరయూతీరమునకుబోయి వాయునిరోధముచేసి విగతజీవుడయ్యెను. ఈసంగతివినిలక్ష్మణుని వియోగముసహించలేక రాముడు మహాప్రస్థానమునకు బయలుదేరెను. లక్ష్మణ మరణము రామునిప్రస్థానయాత్రకు చోదింపచేసినది. లేనియెడల రాముడింకాకొంతకాలము రాజ్యముచేసెడివాడే. దీర్ఘకాలము రాజ్యముచేయుటవలన రామునికి ప్రజలయందు గాఢానురక్తి ఏర్పడినది. అందువలన రామునికి విరక్తికలుగుటకై దుర్వాసుని దేవతలేపంపినారనిప్రతీతిగలదు. కాలునిబంపినదిగూడాదేవతలే!

రావణునికి లక్ష్మణునికి జరిగినయుద్ధములో నొకవిశేషమున్నది. రావణుడు తన ప్రథమయుద్ధములో స్వాయంబుదత్తశక్తితో లక్ష్మణుని మూర్ఛనొందించెను. ఆశక్తి హృదయమున ప్రవేశించగనే లక్ష్మణుడు, విష్ణ్వంశసంభూతుడుగనుక, విష్ణునిగురించి సంస్మరించెను. ఆవిధముగా సంస్మరించుటవలన

తను చావలేదు. రావణుడతనిని తనదశ బాహువులతో నెత్త లేకపోయెను. కాని హనుమంతుడు సునాయాసముగా లక్ష్మ ణుని మోసికొని రాముని ముందట బెట్టెను. విష్ణుభక్తుడుగను కనే విష్ణ్వంశసంభూతుని నెత్తగలిగినాడు. ఆంజనేయు నను గ్రహించుకొరకేలక్ష్మణుడు తేలికఅయినాడు. మరలరావణుడు తనచివరయుద్ధములో లక్ష్మణునిమయునిచేనిర్మించబడినన అమో ఘశక్తిచేబడగొట్టెను. లక్ష్మణునిశిరస్సునిూద నాశక్తిబడబోవు సమయమున మరియొకచోట యుద్ధముచేయునున్న రాముడది చూచినవాడై "లక్ష్మణునకు మంగళమగుగాక. ఈశక్తియొక్క ప్రహారము నిష్ఫలమగుగాక" అని యాశీర్వదించెను. ఈపై సంఘటనలవలన మనకు తెలియునదేమన దైవసహాయముండుట చేతను, దైవమునుస్మరించుటచేతను, లక్ష్మణుడు ప్రతికేనుగాని లేనియెడల రావణుని శక్తిప్రయోగమువలన ప్రమాదము నొందెడి వాడనితెలియుచున్నది. కాబట్టి, ప్రతిమానవునకు తనస్వబాహుబల పరాక్రమముతోబాటు కార్యసిద్ధికై దైవ చింతనగూడా చాలాముఖ్యమైనదని తెలియుచున్నది.

తనతల్లి యాజ్ఞానుసారము సీతారాములకుసేవచేసి కృతార్థత నొందినాడు. వారిని మాతాపితరులుగ భావించి సేవ చేసి ధన్యుడైన మహనీయుడు లక్ష్మణుడు.

భరతుడు

భరతలక్ష్మణులలో నెవరు జ్యేష్ఠులని ఒకవివాదాంశము గలదు. జననకాలమునుబట్టిచూడ భరతుడే ఒకరోజు పెద్దగా కనబడుచున్నది. కాని వాడుకలో రామలక్ష్మణభరతశత్రుఘ్నులని బిలువబడుచున్నారు. శ్రీరామపట్టాభిషేకము జరిగినప్పుడు భరతునికి యీవరాజ్యపట్టాభిషేకము జరిగినది. దీనినిబట్టిచూడ భరతుడే జ్యేష్ఠుడుగా గనబడుచున్నాడు. ఏదియెట్లున్నను, సోదరులందరు ఒక్కొకరోజువ్యవధితో జనించినారు. కాన వయసులో పెద్దతేడాలేదు. దివ్యపాయసములో నెనిమిదవ భాగము (1/8) కై కేయికిచ్చుటవలన బుట్టినవాడుగాన విష్ణువు యొక్క అష్టాంశసంభూతుడుగా పరిగణింపబడుచున్నాడు. సత్య వ్రతములోనేమి, త్యాగబుద్ధిలోనేమి, ధర్మనిరతిలోనేమి, దృతిలోనేమి భరతుడు రామునకు దీసిపోడు. మీదుమిక్కిలి తనకు కరతలామలకముగావచ్చిన రాజ్యమును తిరిగిజ్యేష్ఠుడగు రాముడకే నీయవలెనని విశ్వప్రయత్నము జేసినాడు. విఫలుడైన మీదట శ్రీరాముని పాదుకలను సింహాసనమునందుంచి నంది గ్రామములో మునివృత్తిలోనుండి నిరంతరరామనామస్మరణ చేయుచు 14 సంవత్సరములు రాజ్యముచేసినాడు. సర్వవిధముల నమస్కారయోగ్యుడు.

మాతుల గృహమునుంచి రాగానే, కై కేయి, రామవన వాసము, దశరథుని మరణమును, గురించిచెప్పినదై భరతుని సింహాసన మధిష్ఠింపమనియు, తనకోసమే యీవరముల కోరితి ననియుచెప్పెను. భరతుడు మూర్ఛనొంది శోకసంతప్తుడై తల్లిని బహువిధముల నిందించును. నృశంసిని, కులఘ్ని, పాప చారిణి, యని బలువిధముల నిందించెను.

మాతృరూపే మమామిత్రే। నృశంసే రాజ్యకాముకే
నతేహమభిభాషోస్మి దుర్వృత్తే పతిఘాతిని.

నత్వమశ్వపతేఃకన్యా ధర్మరాజస్యధీమతః
రాక్షసీ తత్రజాతాసి కులప్రధ్వంసినీపితాః॥

తల్లిరూపములోనున్న శత్రురాలవు, నృశంసినివి, పతి ఘాతినివి, నీవుధర్మరాజైన అశ్వపతిమహారాజు కూతురవు కావు. తండ్రికులమును, నాశనముచేయుటకై వచ్చినరాక్షసి వని పలువిధముల నిష్ఠురోక్తులాడెను. రామునితీసుకొనివచ్చి, సింహాసనాధిష్ఠునిగాచేసి, తను 14 సంవత్సరములు వనవాస దీక్షలోనుండెదననియు, తనతల్లి చేసిన ఘోరయపచారమున కింతకంటె నిష్కృతి వేరులేదనియు తననిర్ణయము వెల్లడించెను. కౌసల్యవద్దకు భరతుడువచ్చినప్పుడు ఆమెపుత్రశోకమున భరతుని నిష్ఠురోక్తులాడెను. దానివలనభరతుడు, చాలనొచ్చుకొనినవాడై తనపారిశుధ్యమును, నిష్కలంకత్వమును, నిరూ

పించుటకొఅక్కై వేరుమార్గముగానక అనేకశపథములచేయును. "యస్యార్యోనుమతేగతః" అనుపల్లవితో దాదాపు 30 శ్లోక ములలో తనమనోబాధను వెలిబుచ్చినాడు. తనసమ్మతినే, రామవనవాసము జరిగినయెడల, నానావిధములైన బ్రహ్మ హత్యాది మహాదోషములు సంభవించుగాకయని పలువిధముల శపథములుచేసి, శోకాభితప్తుడై మూర్ఛిలెను.

దశరథుని అంత్యక్రియలుచేసి, ఆశౌచము వెళ్ళినతర్వాత 14వ రోజు ఉదయము రాజసభలో వశిష్టుడు ప్రజలందరేక గ్రీవముగా భరతుని సింహాసన మధిష్ఠించవలశినదిగా కోరుదురు. దానికిభరతుడు చెప్పినసమాధానము వర్ణనీయము.

'జ్యేష్ఠుడేరాజ్యమునకర్హుడు. చతురంగబలముల సమ కూర్చుడు! మనమందరమీ అభిషేచనిక భాండముతో వెళ్ళి, అక్కడనే రాముని కభిషేకమొనర్చి, యజ్ఞశాలనుంచి హవ్య వాహనుని తీసికొనివచ్చుమాదిరి రాముని అరణ్యమునుంచి అయోధ్యకు దీసికొనివచ్చెదను. పాపిష్ఠురాలగు నాతల్లికోరిక నెరవేర్చనని గట్టిగాచెప్పెను. సామంతరాజులు, మంత్రులు ప్రజలందరు, మరలమరల, భరతుని సింహాసాన మధిష్ఠించుమని గోరెదరు. కానిభరతుడు తనదృఢాభిప్రాయ మిూక్రింది విధ ముగా తెలిపెను.

కథందశరథాజ్జాతో భవేద్రాజ్యాపహారకః
రాజ్యం, చాహంచ, రామస్య ధర్మంవక్తుమహోర్హసి.

అనార్యజుష్టం అస్వర్గ్యం కుర్యాం పాపమహంయది।
ఇక్ష్వాకూణామహంలోకే భవేయంకులపాంసనం.

పైశ్లోకములనుబట్టి, భరతునియొక్కచిత్తశుద్ధి ధర్మనిరతి తెలియుచున్నది. దశరథునకు బుట్టినవాడెటుల రాజ్యము నపహారించును? జేష్ఠుడే, రాజ్యమునకర్హుడు. ఆర్యులు గర్హించు నదియు, అస్వర్గ్యమయిన, పని, నేనుజేసినయెడల ఇక్ష్వాకు కులపాంసనుడనగుదును. ఎక్కడయున్నను రాముడే నాకు గురువు. రామునితీసికొనిరావలశినదేయని తనదృఢనిశ్చయము తెలియచేసెను. రాముడొక కోసలరాజ్యమునకేగాక, మూడు లోకములుపరిపాలించుట కర్హుడని గట్టిగావక్కాణించెను.

భరతునిజూచినవారు, ప్రథమములో రామునివనవాస గమనములో భరతునికికూడా కొంతదోషమాపాదింతురు. చతురంగబలముతో రామునితీసికొనివచ్చుటకై భరతుడు బయలుదేరును, దారిలోసాయంకాలమగుటవలన గంగాతీరమున విశ్రమింతురు. గుహుడు భరతునిశంకించి, "నీవు రామునకపకారమొనరించుటకు కోవుటలేదుగదా!" యని సూటిగా ప్రశ్నించును. దానికి భరతుడుశోకసంతప్తుడై తనహృదయపరి వేదనను వెలిబుచ్చి, రామునిస్వాయముగా తీసికొనివచ్చుటకై వెళ్ళుచుంటినని చెప్పును. గుహుడుభరతుని ఉదారతకు, ధర్మనిరతికి మెచ్చుకొని ప్రశంసించి సేనను, భరతునిగంగదాటించెను.

భరద్వాజమహర్షిగూడా ప్రథమమున భరతునిశంకించి యీ విధముగా ప్రశ్నించును.

కశ్చనతస్యా పాపస్యపాపంకర్తు మిహేచ్ఛసి
అకంటకంభో క్తుమనా రాజ్యంతస్యానుజస్యచ ॥

నీవేమి నిష్కంటకముగా రాజ్యము ననుభవించుటకై నిర్దోషియగు రాముని కపకారముచేయుటకై బోవుట లేదు గదా ? దానికి భరతుడు శోకభరితుడై యీ క్రిందివిధముగా జవాబు చెప్పెను.

హతోస్మ్యయదిమామేవ భగవానపి మన్యతే ।
మత్తో నదోషమా శంకైవం మామనుశాధిహి ॥

"భగవత్స్వరూపులగు మీరే యీ విధముగా శంకించిన నేనేమిచేయగలను (నేను మృతతుల్యుడనే యగుదును) నాయందు దోషమూపాదించవలదు. నన్ను శాసింపనర్హా"లని పలువిధముల శోకింపదొడగెను. భరద్వాజులవారు తృప్తి నొందినవారై భరతునకు, సైన్యముతోసహా, గొప్ప విందు చేసెను. ఆరాత్రి భరతునికొఱకు ప్రత్యేకమందిర మేర్పరుప డెను. నవరత్నఖచిత సింహాసనమొకటి మధ్యనుంచబడెను. అప్సరసలు వాలవ్యజనములు బట్టుకొని భరతుని సేవకుసిద్ధ మైరి. షడ్రసోపేతమైన ఆహారము భరతునిముందు సువర్ణ పళ్ళెరమున నుంచబడెను. భరతుడు సింహాసనముచుట్టూ ప్రద

క్షీణముచేసి, రామునిసంస్మరించి, ఆయాహారమును స్వీకరించక కందమూలఫలాదులుతిని, ఆరాత్రియంతయు రామనామస్మరణతో గడపెను. భరద్వాజుడు భరతునిభ్రాతృభక్తికి, ధర్మనిరతిని, చిత్తశుద్ధికి ముగ్ధుడయ్యెను. భరద్వాజుడు భరతుని చిత్తశుద్ధిని పరీక్షించుటకై గొప్పవిందుచేసినాడని ప్రతీతిగలదు. భరతుని భ్రాతృభక్తిని, ప్రవర్తననుచూచి ఆయన కదివరలో భరతునియందు గలిగిన యభిప్రాయమును మార్చుకొనెను. ఈవిధముగా ప్రథమములో భరతునిజూచి కొంతమంది శంకించినను, ఆయన నిష్కల్మషప్రవర్తన, హృదయపరివేదనను తిలకించి, ఆయన భ్రాతృభక్తికి ముగ్ధులై వారిహృదయభావములను పూర్తిగా మార్చుకొనిరి. ప్రథమమున పరుషభాషలాడిన కౌసల్యగూడా చివరకు భరతుని యందవ్యాజానురాగము చూపినది. భరతుడు శోకముతో మూర్ఛిలినప్పుడు ఆమె చాలాబాధపడి అతనికి శీతలోపచారములుజేసి లేవదీసినది. ప్రజలందరికి రాముడెంత ప్రీతికరుడో, భరతుడుకూడా తన ప్రవర్తనవలన అంతప్రేమాస్పదుడయ్యెను. ప్రతికరణశుద్ధిగా నిర్దోషిగనుకనే తనను శంకించినవారిలోగూడా పూర్తిమార్పు తీసికొని రాగలిగినాడు.

భరతునియొక్క భ్రాతృభక్తియు రామునియొక్క భ్రాతృప్రేమయు చిత్రకూటమున వారిద్దరు కలిసినప్పుడు వ్యక్తమగును. పర్ణశాలప్రాంగణమందు దర్భాసనముమీద వీరాసన

స్ఖుడైన రాముని జూచి దుఃఖమాపుకొనలేక పరుగ త్తి యతని పాదములచేరక పూర్వమే "ఆర్యా" యని ఆక్రోశించి మారు మాట్లాడలేక బాష్పపిహితకంఠుండై నేలమీదబడిమూర్ఛిలెను.

జటిలం చీరవసనం ప్రాంజలిం పతితంభువి
దదర్శ రామో దుర్ధర్షం యుగాంతమివ భాస్కరం ॥

జటావల్కలధారియు, ప్రాంజలియు, యుగాంతమందు భూమిమీదపడిన సూర్యబింబమువలె తనపాదములకడ బడియున్న భరతుని రాముడుచూచెను. వెంబడే వాత్సల్యపూరిత హృదయుడై భరతుని తనఅంకమునమీద కూర్చొనబెట్టుకొని శిరమునమ్రుడిడి, దశరథునితోసహా అందరి కుశలప్రశ్నలనడిగి రాజ్యపాలన సక్రమముగా చేయుచుంటివా యని మృదుమధుర భాషణముల భరతునోదార్చెను. తదుపరి భరతునివలన తండ్రి మరణవార్త వినినవాడై బహుశోకించెను. తండ్రికి విధిపూర్వకముగా మందాకినీతీరమున పిండోదకక్రియలు జరిపెను. ఆ మరునాడుదయమున పర్ణశాలముందే ప్రజలు, మంత్రులు, పురోహితులు, (వశిష్టప్రభృతులు) మొదలైన వారందరి ముందు రామభరతసంవాదము జరిగెను. దానిముఖ్యాంశము భరతుడు సింహాసనమధిష్ఠించమని రాముని ప్రార్థించుట, రాముడు నిరాకరించుట. ఇద్దరివాదములు ప్రత్యక్షుల ముగ్ధుల చేశినవి. ఇద్దరుధర్మనిరతులు, దృఢవ్రతులు, ప్రజానురంజకులు అత్యద్భుతమైన యీ సంవాదమువినుటకు దేవర్షులు, బ్రహ్మ

ర్వులు, ప్రత్యక్షమయిరి. ఆసంభాషణ వాదప్రతివాదరూపములో ఈక్రింద పొందుపరచుచున్నాను.

ఆడదానిమాటలువిని మనతండ్రి మహాపాప మొనరించి నాడు. నాతల్లియొక్కకోరిక సఫలముకాకపోగా, ఆమెనరక బాధననుభవించును. దాసుడైన నాయందనుగ్రహించి, దేవేం ద్రునిమాదిరిగా యిక్కడనే అభిషేకము చేసికొనుము. దానికి రామునిసమాధానము.

'నీయందుదోషము నాకు సూక్ష్మమైనను గనబడుట లేదు. బాల్యత్వమున నీవు తల్లిని నిందించగూడదు. మన తండ్రియు, గురువునైనదశరథుడు మహాప్రాజ్ఞుడు. ఆయనకిష్ట మైన (లేక ఇష్టమయినభార్యలయందుబుట్టిన) పుత్రులకురాజ్య మిచ్చు అధికారమాయనకుగలదు. మనపూర్వులలోనొకడైన సగరమహారాజు జ్యేష్టపుత్రుడగు అసమంజుని నిర్వాసముచేసి, మనుమడగు అంశుమంతుని రాజుగాచేయలేదా?

2) భరతుడు :- మాఅమ్మ నాకిప్పించినరాజ్యము మన స్ఫూర్తిగ మరలనీకిచ్చుచున్నాను. స్వీకరించుము. జ్యేష్ఠుడవు. అర్హుడవు. సమర్థుడవు. మీదుమిక్కిలి విపరీతుడు, వృద్ధుడు, కామాతురుడు, స్త్రీవశంగతుడు, అయినమాతండ్రి నాతల్లికి ప్రియముచేయుటకై ఈపాపకార్య మొనరించినాడు. పైగా మరణకాలమాసన్నమయినప్పుడు విపరీతబుద్ధులుగలిగి ఎంతటి

మహానుభావులుగూడా ధర్మము నతిక్రమించెదరు. ఈవిధముగా ధర్మమునతిక్రమించినపుడుగూడా, దానినంగీకరించినయెడల, నపత్యదోషముకలుగును. అందువలన ధర్మవ్యతిరేకమయిన తండ్రియాజ్ఞ అనుచరణీయముగాదు. దశరథునికి జన్మించిన నేనీ జుగుప్సకర్మ నెట్లుచేయగలను.

రామునిసమాధానము :- తండ్రియాజ్ఞనీవును, నేనును ఆంగీకరించవలసినదే. లేనియెడల మనమిద్దరమధోగతి బొందెదము. నీవు 14 సంవత్సరములు రాజ్యముచేసితీరవలసినదే. ఈవనవాసముదైవప్రేరేపణయే. కానియెడల నాయందపార మైనప్రేమగలతండ్రి, క్రిందటిరోజు సాయింత్రమే రాజ్యసభలో మంత్రుల, ప్రజల, సమక్షమున నాకు మరునాడుదయమే యీవరాజ్యపట్టాభిషేకము చేసెదనని తననిశ్చయము తెలిపి, ఆరాత్రియంతయునా చేదీక్షావిధులు జరిపించి, అభిషేకమున కన్ని యేర్పాట్లుచేయించి మరునాడు సూర్యోదయములోపలనే తనునాకు పట్టాభిషేకము చేసెదనన్న సమయములోనే, నన్న రణ్యమునకుబొమ్మనుటదైవప్రేరేపణగాక మరియేమిటి? తల్లి దండ్రులు నిమిత్తమాత్రకారకులే. ఇదంతయు దైవసంఘట నయే.

మనతండ్రి దశరథుడు. నీవనుకొనినట్లు, తెలివితక్కువ వాడు, కామాతురుడు, ధర్మమునతిక్రమించువాడు, కాడు. ఆయనధర్మ బద్ధుడయు, యీపనిచేసినాడు. మీతల్లియగుకైక

వివాహకాలమండు, దశరథుడా మికుబుట్టినవానిని, సింహాస
నస్థునిగా జేయుదునని అశ్వపతిమహారాజుకు (కైకేయితండ్రికి)
వాగ్దానమిచ్చెను. అదియునుగాక కైకవరముకూడానిదియే.
14 సంవత్సరములు భరతుని సింహాసనముమీద నుంచవలసి
నదిగా కోరినది. అందువలన రెండువిధముల, ద్విగుణీకృతముగా
బద్ధుడై, భరతునికి రాజ్యమివ్వకతప్పినదిగాదు. ఇకరెండవవరము
తనను 14 సంవత్సరములు జడలుధరించి మునివేషములో వన
వాసదీక్షజరుపవలసినదిగా కోరెను. ఈరెండువరములు విష
యములుముందు చెప్పకుండగనే, దశరథునిచేవాగ్దానము
చేయించుకొనినది. ఆడినమాట తప్పనివాడుగాన, సత్యపాశ
బద్ధుడై నీయభిషేకమునకు, నావనవాసమునకు ఒప్పుకొనినాడు
ఆయన ధర్మమేమియు నతిక్రమించలేదు. మీదుమిక్కిలిధర్మ
పాశబద్ధుడై ఈపనిచేసినాడు. ఆయనమాట వినకపోవుటచే
తండ్రికిఅధోగతులుకల్పించినవారమగుదుము. అంతకంటెమహా
పాపము వేరొకటిలేదు. తండ్రిని పున్నామనరకమునుండి రక్షిం
చుటకేగదా పుత్రులుజన్మించినది. కాబట్టి, తండ్రివాక్యములు
నిర్వర్తించువిధి మనయందున్నది.

రాముడు ప్రజావాక్యమును మన్నించునని తెలిసినవాడు
గాన భరతుడు ప్రజలనుద్దేశించి రాముని రాజ్యమునంగీకరించ
మని ఆదేశించవలసినదిగాకోరును. ప్రజలిద్దరుధర్మమూర్తులు,
ప్రేమాస్పదులుగాగనబడుదురు. అందువలన నేమియుచెప్పశక్త

ఆనిర్ణయము సోదరులయిద్దరికి వదలివేసిరి. అప్పుడు రాముడు పిత్రృవాక్యపరిపాలన తమకు కర్తవ్యమనియు, భరతుని రాజ్యము చేయవలశినదిగా కోరును. కాని, భరతుడు అంగీకరించలేదు. మీదుమిక్కిలితనప్రార్థన, రాముడంగీకరించనిచో ప్రాయోపవేశము చేసెదనని, దర్భపరచి, ప్రాఙ్ముఖుడై ఉదకములస్పృశించెను. రాముడు క్షత్రియులకు ప్రాయోపవేశముచేయుట ధర్మముకాదని నివారించును. ఇదంతయుచూచుచున్న దేవతలు, ఋషులు, ప్రత్యక్షమయి భరతునితో రామునియాజ్ఞ ధర్మబద్ధమనియు, అంగీకరించమనియు, భరతుని శాసించిరి. (రావణవధగోరినవారుగనుక) అప్పుడురాముడు సంతసించి భరతుని రాజ్యముచేయుమని యాజ్ఞాపించుచూ యిట్లనిందివిధముగా శపథముచేసెను. "చంద్రుడు కాంతినివదలవచ్చును, హిమవంతుడు హిమమునుత్యజించవచ్చును, సాగరుడు చెలియిలకట్ట దాటవచ్చును, కాని నేనుమాత్రము తండ్రిమాటజవదాటలేనని" ఘంటాపథముగాచెప్పెను. భరతుడు రామునికెంతమాత్రముతీసిపోలేదు. అతనిప్రతిజ్ఞ వినుడు.

తమరు ఈపాదుకల నధిరోహించవలసినది. అవియే రాజ్యతంత్రము నడపును. రాముడావిధముగా పాదుకలమీద నెక్కి తనపాదముద్రలు వాటిమీదనుంచి మరలదిగెను. అప్పుడాపాదుకలకు నమస్కరించి 14 సంవత్సరములు మునివేషధారియై ఫలమూలాశనుడనై అయోధ్యకువెలుపల నందిగ్రామములోనుండి పాదుకలపురస్సరముగా రాజ్యముచేయుచు మీ

రాకకొరకు నిరీక్షించుచుండెదను. 14 సంవత్సరములు నిండిన తర్వాత నొకక్షణమాలస్యమయిన అగ్నిప్రవేశము చేసెదనని ప్రతిజ్ఞ చేసెను.

రామునికిభరతుని దృఢనిశ్చయము విషయమై బాగుగా తెలియునుగనుక, రావణవధానంతరము మరల నయోధ్యకు వచ్చుచుండు ఆంజనేయుని భరతునివద్దకు బంపును. భరతుడగ్నిహోత్రములు సిద్ధముచేసి రామాగమమునకై నిరీక్షించుచుండెను. హనుమంతుడు శ్రీరామాగమనమునుగురించి భరతునికి దెలిపెను. హర్షోన్మత్తుడై యీ క్రిందివిధముగా భరతుడు పలికెను.

కళ్యాణీ బతగాధేయం లోకికీ ప్రతిభాతిమే ।
ఏతి జీవంతమానందం నరంవర్ష శతాదపి ॥

"నూరుసంవత్సములు మానవుడు బ్రతికినయెడల నొకప్పుడైనా మంచికబురు వినుటకవకాశము దొరకునని కళ్యాణగాధ కలదు. (సామెత) ఇంతకాలము నేను బ్రదికియుండుట యీ మంచికబురు వినుటకేకాబోలు" అని యానందపరవశుడై పవనాత్మజుని కాగలించుకొనెను.

శ్రీరామచంద్రుడు వచ్చినతర్వాత పగమానందభరితుడై భరతుడు.

శిరస్యంజలిమాధాయ కైకేయానంద వర్ధనః ।
బభాషే భరతో జ్యేష్టం రామం సత్యపరాక్రమమ్ ॥

యావదావర్త తేచక్రం యావతీచవసుంధరా ।
తావాత్వ మిహాసర్వస్వ స్వామిత్వ మనువర్తయ ॥

శిరసాఅంజలి ఘటించినవాడై భరతుడయోధ్యలో రామునికి బట్టాభిషేక మొనరించెను. ఆ చంద్రతారార్కము రాజ్యము చేయవలశినదిగా ప్రార్థించెను. అయోధ్యప్రజల జయజయధ్వానములతో గీతన్నత్యవాదిత్యములతో దేవదుం దుభినిన్వనములతో పుష్పవృష్టితో రాముని పట్టాభిషేకమ యోధ్యలో జరిగెను. రాముడు పరమానందభరితుడై భరతు నికి యూవరాజ్యాపట్టాభిషేకము జేసెను.

భరతుడు పరిపాలించిన 14 సంవత్సరములలో కోసల రాజ్యము సర్వతోముఖముగా నభివృద్ధినొందినది. కోశ మును పదిరెట్లుపెంచెను. చూచితిరా ! భరతునియొక్క నిస్వార్థత !. ప్రస్తుతము మనదేశమును బరిపాలించు నాయ కులు, తదితరులు భరతుని యాదర్శముగా బెట్టుకొని యతని ప్రకారము నడచుటకు ప్రయత్నించిన యెడల మనదేశమచిర కాలములోనే బాగుపడును. భరతుడు కళ్యాణచారిత్రుడని రాముడే నుడివినాడు. "సహికళ్యాణ చారిత్రకి కైకేయీనంద వర్ధనకి" అని సీతాలక్ష్మణులతో నేకాంతముగానున్న సమయ ములో రాముడు బల్కినాడు.

భరతుడు మహాపరాక్రమవంతుడు. రాముడశ్వమేధ యాగము, రాజసూయము మొదలగు యాగములొనరించు

Acc no: 11,721

ముందు అన్నిదిక్కులకు సైన్యముతోవెళ్ళి రాజులనందరిని ఓడించెను. భరతునియొక్క అద్వితీయపరాక్రమము గంధర్వ రాజుతో యుద్ధము జేయునప్పుడు విదితమయ్యెను భరతుని మాతులుడు యుధాజిత్ మహారాజు తమదేశపరిసరములలో నొకగంధర్వరాజు మూడుకోట్ల గంధర్వులతో రెండుముఖ్య పట్టణములను (తక్షశిల, పుష్కలావళి) నాక్రమించుకొని ప్రజలను బాధించి సైరవిహారము జేయుచున్నాడనియు, అతనిని ఓడించి, దేశమునకు క్షేమము చేయవలశినదిగా రామునిప్రార్థించును దానినంగీకరించినవాడై రాముడు, భరతుని, అతనికుమారులగు తక్షుని, పుష్కలుని, సైన్యముతోసహా గంధర్వరాజుపై యుద్ధయాత్రకు బంపును. భరతునికి గంధర్వరాజునకు ఘోర యుద్ధము సప్త అహోరాత్రములు జరిగినది తుదకు భరతుడు సంవర్తాస్త్రము ప్రయోగించి గంధర్వరాజునుసైన్యముతో సహాఅంత మొనరించెను. తనకుమారులగు తక్షుని తక్షశిలానగరమునకు, పుష్కలుని, పుష్కలావతి (పెషావర్) నగరమునకు రాజులుగ నియమించి, ఏ సంవత్సరములు వారికడనుండి పిదప రామచంద్రుని సేవకై నయోధ్యకు వచ్చెను. రామునికినిరంతర సేవచేయుచూ, చివరకు రామునితో బాటు మహాప్రస్థానము నకు బయలుదేరి స్వర్థమలంకరించిన మహావీరుడు భరతుడు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

శత్రుఘ్నుడు

దివ్యపాయసములో ఎనిమిదవవంతు (1/8) రెండవసారి సుమిత్ర భుజించుటవలన పుట్టినవాడు శత్రుఘ్నుడు. సుమిత్ర యొక్క రెండవకుమారుడు. లక్ష్మణునియొక్కతమ్ముడు. విష్ణువు యొక్క అష్టమాంశసంభూతుడు.

లక్ష్మణుడు రామునికేవిధముగా సేవచేసెనో యావిధము గానే శత్రుఘ్నుడు భరతునికి సేవచేసెను. రామలక్ష్మణుల మాదిరి వీరిద్దరికిగూడా అవినాభావసంబంధమున్నది. లక్ష్మణుని మాదిరిగానావేశపూరితుడు శత్రుఘ్నుడు. భరతునివచనములచే శాంతినొందును. మంథరనుజూడగనే కోపమాపుకొనలేక శత్రుఘ్నుడామె శిరోజముల బట్టుకొని భరతుని సన్నిధికీడ్చి కొనివచ్చి వధింపబోవును. అప్పుడీ క్రిందివిధముగా భరతుడు శత్రుఘ్నుని నివారించెను.

"అవధ్యాః సర్వభూతానాం ప్రమదాక్షమ్యతామితి"

స్త్రీలవధ్యులు, ఆమెను క్షమించవలశినదని భరతుడు శత్రుఘ్నునాదేశించును. దుష్టచారిణియైన నాతల్లి కైకేయిని చంపలేకగాదు. ఆవిధముగా నేనుచేసినయెడల మాతృఘాతకుడనని, రాముడునన్నసహ్యించుకొనును. ఆయనకప్రియము చేసినవాడనగుదునని భయముచేత నేను నాతల్లినివధించలేదు. ఈ

మంథరను నీవుజంపినయెడల నిక నీతోను, నాతోను, రాముడు మాట్లాడడని చెప్పినమీదట శత్రుఘ్నుడు మంథరనువదలి వేయును. దీనినిబట్టిచూడ శత్రుఘ్ననికిగూడా రామునియందు భయభక్తులున్నవని తెలియుచున్నది. సోదరులందరు రామ భక్తులే. రామునియాజ్ఞ దాటనివారే. ఆయనగూడా, సోదరుల యందపారవాత్సల్యము చూపినాడు. తను రాజ్యముచేయుట సోదరులకొఱకేయని పలుమార్లు నుడివినాడు. ఆవిధముగానే తను రాజ్యవిభాగములుజేసి సోదరుల నా రాజ్యములకు పట్టాభిషిక్తులుగాచేసెను.

శత్రుఘ్ననిసంగతి మరల నుత్తరరామాయణములో వచ్చును. ఋషులందరు రామునిసన్నిధికివచ్చి లవణాసురునిబాధలకు లోకములు సహించలేకుండా వున్నవనియు, వానిని వధించమని రామునిప్రార్థింతురు. అప్పుడు శత్రుఘ్నుడు రామునికి నమస్కారమొనరించి లవణాసురినివధించెదననియు, అనుజ్ఞ యివ్వమనియు ప్రార్థించును. లవణాసురుడు శంభువరప్రసాదియనియు, శంకరుడిచ్చినశూలమతనివద్ద నున్నదనియు, అది తనగృహమందుంచి ప్రతిరోజు ఉదయమున మృగయార్థము బయటికివెళ్ళునని యు, అతను తిరిగి ఇంట్లోప్రవేశించి శంకరదత్త శూలము నందుకొనకమునుపే ఆతనివధించివలెనని శత్రుఘ్ననికిసలహానిచ్చి సైన్యముతోవెళ్ళవలశినదిగా యాదేశించును. అదియును గాక, అతను రావణునికంటె బలీయుడనియు, రావణునివిూద

నుపయోగించని దివ్యాస్త్రము తనపద్ద నున్నదనియు, ఆయుమో ఘాస్త్రము పూర్వము విష్ణువుకైటభ సంహారమున నుప యోగించెననియు, ఆయస్త్రము నుపయోగించి వానిని వధించ వలశినదని హెచ్చరికచేసి శత్రుఘ్నుని బంపెను. శత్రుఘ్ను డావిధముగా లవణాసురవధార్థము బయలుదేరి, దారిలో నొక రాత్రి వాల్మీకి ఆశ్రమములో విశ్రమించును. ఆరాత్రియే సీతకు కుశలవులు జన్మింతురు. సీతామహాదేవిని సందర్శించి, లవణాసుర సంహారమునకు బయలుదేరి, ఉదయకాలమునకే, రాముడు చెప్పినప్రకారము, లవణాసురుడు తనగృహామునకు రాకమునుపే, వానితో ఘోరయుద్ధముచేసి రాముడిచ్చిన యమోఘాస్త్రముచే వానినిజంపినవీరాధివీరుడు.

రామునియాజ్ఞప్రకారము లవణాసురుని ముఖ్యపట్టణ మైన మధురానగరమును 12 సంవత్సరములు రాజ్యపరిపాలన మొనర్చి తర్వాతమరల రాముసన్నిధికివచ్చెను. దారిలో వాల్మీకి ఆశ్రమములోదిగెను. వాల్మీకి ఆతనిని సత్కరించి ఆ రాత్రి రామాయణము వినిపించెను. మరునాడు శత్రుఘ్ను డయోధ్యకువెళ్ళెను. ఆరాత్రి సీతాదేవిని సందర్శించినట్లుగ బడదు. రాముడు సంతసించి, శత్రుఘ్ను ని కాగలించుకొని తనకుమారులతో పాటు మధురానగరమును పరిపాలించుచుండ వలయుననియు అప్పుడప్పుడు తనదర్శనార్థమువచ్చి వారము రోజులుండనచ్చునని యాజ్ఞాపించెను. ఆప్రకారము మధురను

బరిపాలించి, చివరికి తనకుమారుల మధురరాజ్యమునకు పట్టాభిషేకమొనర్చి రామునికడకువచ్చి ఆయనకు సేవచేయుచు ఆయనతోపాటు సరయూనదిలోప్రవేశించి దివికేగెను. ఇవ్విధముగా మహావీరులగు సోదరులందరు రామసేవాదురంధరులని యనిపించుకొని రామునకుసేవచేయుచు రామునితోపాటు వైకుంఠమునకేగిరి.

దశరథుడు

దశరథు డిక్ష్వాకువంశస్థుడు. అయోధ్యాధిపతి. అతిరథుడు.

ఇక్ష్వాకూనామతిరథః యజ్వా ధర్మపరోవశీ
మహర్షికల్పోరాజర్షిః స్త్రీషులోకేషువిశ్రుతః.

ఇక్ష్వాకులలోనతిరథుడు. యజ్వ. ధర్మపరుడు. జితేంద్రియుడు. రాజర్షిశ్రేష్టుడు. మహర్షికల్పుడు. త్రిలోకములయందు ఖ్యాతినొందిన సార్వభౌముడని వర్ణింపబడియెను. అతనికి 8 గురు అమాత్యులు. వారిలో చివరివాడు సుమంతుడు. అమాత్యులనగా ధర్మముల నాచరణలో పెట్టువారనిఅర్థము. ఇద్దరు ఋత్విజులు. వశిష్టుడు, వామదేవుడు, (పురోహితులనియర్థము). మంత్రులు (ధర్మనిర్ణయము, పరిపాలనా సూత్ర

నిర్ణయముచేయు వారు) ఆరుగురు. సుయజ్ఞుడు, జాబాలి, కాశ్య పుడు, గౌతముడు, మార్కండేయుడు, కాత్యాయనుడు. వారి సలహాప్రకారము రాజ్యముచేయుచుండెను. మీదుమిక్కిలి వదాన్యుడు, సత్యసంగరుడు గనుకనే మహావిష్ణువతనిని తండ్రిగా కోరుకొనినాడు. "పితరంరోచయామాసరాజాదశరథంనృపమ్" అని చెప్పబడియున్నది. అరువదివేలసంవత్సరములు రాజ్యము చేసి, చాంద్రాయణాదివ్రతము లెన్నిచేసినను, సంతానము కలుగకపోవుటచే, వశిష్టప్రభృతులయనుమతిన, అశ్వమేధ యాగముచేసి, పుత్రకామేష్టియాగము చేయుకాలమున యజ్ఞే శ్వరుడు ప్రత్యక్షమయి దివ్యపాయసమునిచ్చి తనముప్పురు భార్యలకిచ్చినయెడల అనురూపులగు కుమారులుగలుగుదురని యాశీర్వదించి అంతర్ధానుడయ్యెను, ఆపాయసము నీక్రిందివిధ ముగ దశరథుడు తనభార్యలకుపంచిపెట్టెనని చెప్పబడియున్నది. ప్రథమమున కౌసల్యకు సగభాగము యిచ్చెను. శేషించిన దానిలో సగము, (అనగా మొత్తములో నాలుగవవంతు 1/4) సుమిత్రకిచ్చెను. మిగిలినదానిలో సగము (అనగా మొత్త ములో 1/8) కైకేయికిచ్చెను. అవశిష్టభాగము. (అనగా మొత్తములో 8వ వంతు 1/8) మరల సుమిత్రకిచ్చెను. సుమిత్ర రెండుసార్లు పాయసమునినటచే ఇద్దరు కుమారులగనెను. ప్రథమమున చైత్రశుద్ధనవమి పునర్వసునక్షత్రము కర్కటక లగ్నమందు కౌసల్యకు పుత్రుడు జనించెను. తరువాతకైకే యికి కుమారుడుజనించెను. తదుపరి సుమిత్ర కిద్దరుపుత్రులు

జనించిరి. 11వ రోజున వశిష్ఠమహర్షి పిల్లలకు నామకరణమొనరించెను. కౌసల్యకు పుట్టినవానికి "రాముడనియు, కైకేయికి జనించినవానికి భరతుడనియు, సుమిత్రకు జన్మించిన యిద్దరికి లక్ష్మణ, శత్రుఘ్నులనియు, నామకరణముగావించెను. కుమారులందరు శుక్లపక్ష చంద్రునిమాదిరి దినదినప్రవర్ధమానులగుచు సమస్తవిద్యలు వశిష్ఠునికడ నభ్యసించి, తండ్రికి పరమప్రీతి కలుగ చేసిరి. వారి యందరిలోను రాముడనిన దశరథునికెక్కువప్రీతి. "రామోరతికరఃపితుః" అని వాల్మీకి వర్ణించినాడు. రాముని యందున్న నిరతిశయప్రేమ, విశ్వామిత్రుడు రాముని తనవెంటబంపమనినపుడు, వ్యక్తమగును. "నరామం నేతుమర్హసి" యను పల్లవితో ననేకశ్లోకములలో తనదుఃఖము వెలిబుచ్చును.

దశరథుడు సత్యసంగరుడు, క్షత్రియవంశములోబుట్టి బ్రహర్షిత్వము సంపాదించినాడను యభిమానముచేతను, అతని యందున్న గౌరవభావముచేతను, అతనికోర్కె ఏదైనాసరే, తప్పకతీర్చెదననిముందుగా విశ్వామిత్రునికి వాగ్దానముచేయును. ఆడినమాట తప్పనివాడుగనుకనే విశ్వామిత్రుడు రాముని పంపమనినప్పుడు చాలాబాధపడి తుట్టతుదకాతని వెంబడి రామలక్ష్మణుల బంపినాడు.

రామునిమీద దశరథునికున్న ప్రేమ అద్వితీయము. పరశురాముడు రాముని అధిక్షేపించి ద్వంద్వయుద్ధమునకు పిలచినప్పుడు శోకభయవిహ్వలుడై "షష్టివర్షసహస్రాణి జాతస్య

మనుపుత్రిక" (అరువదివేలసంవత్సరములు దాటినపిమ్మట) నాకుబుట్టినాడనివిలపించెను. రామునిరక్షించమని ప్రార్థించును. ఈత్రివధానంతరము భూమినంతయు కాశ్యపునకు దానమిచ్చి మరల యుద్ధముచేయనని ప్రతిజ్ఞ చేసి తుద కు నాకుమారుని నాశముచేయుటకు తారసిల్లితివాప్రభూ! యని బహువిధముల శోకించుచూ "బాలానాంమమపుత్రా ణా మభయందాతు మర్హసి"అని అభయముగోరును. నాసర్వవినాశమున కేవచ్చితి వామహానుభావా! రాముడొక్కడు మృతినొందినయెడల మే మెవ్వరము జీవించమని విలపించి పుత్రభిక్షగోరెను. రాముడు వనవాసమునకుబోయిననాగవరోజుననే 'రామా, రామా' యనుచు ప్రా ణములవిడచెను. రామునియందు దశరథునకున్న యపార ప్రేమకీసంఘటన బలమైననిదర్శనము.

దశరథుడు రాజనీతిజ్ఞుడు, అన్నిధర్మములు తెలిసిన వాడు. ప్రజలను, సామంతులను, జానపదులను సభచేసి, "ఈ శరీరము చాలాకాలము లోకహితార్థమై పరిపాలనచేసివయస్సు మీరి శిథిలమైనది". అందుకని రేపుఉదయమునసే రామునికి పట్టాభిషేకమొనర్చి విశ్రాంతితీసికొనదలచితినని చెప్పను. దానికి ప్రజలందరు చేతులుముకుళించి

ఇచ్చామోహిమహాబాహో రఘువీరంమహాబలం
గజేనమహాకాయాంతం రామంచ్రావృతాననం

శ్రీరామచంద్రుడు పట్టపు టేనుగునెక్కి శ్వేతచ్ఛత్రా

వృతాననుడై రాజవీథిలో పోవుచుండగా చూడవలెనని మే మందరము కోరుచున్నాము. అనగా రాముడు యౌవరాజు కావలెనని మేమందరమేకగ్రీవముగా కోరుచున్నామని చెప్పిరి. తనకుగూడాఇష్టమయినను ప్రజలఅంతరంగికభావమెఱుగగోరి "తననువదలి రాము నెందునకుగోరుచున్నారని మరలయడిగెను" అప్పుడు వారందరేకకంఠముతో "హేమహారాజా! నీసుతు డగు రాముసియందనేకకళ్యాణగుణములు గలవు. అతను నీకంటె మాకు ప్రియతముడని నొక్కి వక్కాణించిరి. రాజనీతిజ్ఞుడు కనుక ప్రజలందరేకకంఠముతో కోరినమీదనే, రామునికి యౌవరాజ్యపట్టాభిషేకము చేయుటకు నిశ్చయించెను. దీనినే మనవారు Plebecite అనియందురు. ఇక్ష్వాకురాజులు ప్రజాభి ప్రాయము పరిపాలనచేసెదరనుట కిదియొక నిదర్శనము.

ఆరోజుసాయింత్రము సభముగిసినపిదప, రామునిపిలి పించి తనయభిప్రాయము తెలిపి రామునికి రాజధర్మములన్నియు నెఱుకచేసి మరునాడుదయమభిషేకమునకు సిద్ధముగమ్మనమని ఆజ్ఞాపించెను. వశిష్టులవారిని పిలిపించి యారాత్రి సీతారాముల దీక్షలోనుంచి వారిచేతచేయించవలసిన కర్మకాండనంతయు నారాత్రేజరిపించమనికోరెను. అంత రాముడు స్వగృహమునకు బోయెను. తర్వాతతొద్దిసేపటికే రాముని మరలబిలిపించి తనకు దుర్నిమిత్తములు గనుపించుచున్నవనియు, తనకు తెలివితప్పక ముందే యభిషేకము చేసుకొనవలసినదనియు, మానవుల బుద్ధు లస్థిరములనియుగూడా చెప్పుచున్నాడు. నామనస్సు త్వరపడు

చున్నది. రేపుపుష్యమీనక్షత్రమందే అభిషేకము చేసుకొనవల
శినదనిగూడా చెప్పెను. భరతుడు సత్పురుషుడయినను, ఎవరిబుద్ధి
ఎప్పుడెటులమారునో చెప్పలేముగదా! వెంబడేదీక్షలోప్రవే
శించి రేపుఉదయమభిషేకమునకు సిద్ధుడవుగమ్మనమని మరల
మరల హెచ్చరికచేసి బంపును. దీనినిబట్టిజూడ దశరథునికి
రామాభిషేకవిషయములో నేదైనవిఘ్నముసంభవించునేమో
యని భయము, త్వరలోచేయవలెనని యాందోళన వ్యక్తమగు
చున్నది.

ఇదిగాక పట్టాభిషేకమునకు, అశ్వపతి మహారాజునిగాని,
భరతశత్రుఘ్నులనుగాని, జనకునిగాని, బిలువలేదు. తక్కిన
సామంతరాజులతో వెంబడే శీఘ్రగామినులద్వారా నాహ్వాన
ములు బంపెను. దీనికి కారణము ఒకటియియుండవచ్చును. అది
రాముడు భరతునకు చిత్రకూటమువద్ద చెప్పెను. కేకయిరా
జగు నశ్వపతిమహారాజు, తనకుమార్తెయగు కైకేయివివాహ
మునకుముందు దశరథుని నొకషరతుకోరెను. అది యెద్దియునిన,
కైకేయికి పుట్టినకుమారుని సింహాసనస్థునిగా చేయవలెను.
దానికి దశరథు డంగీకరించెను. దానికి కారణమొకటియై
యుండనోపు. బహుకాలమునుంచి కాపురముచేయుచున్నను,
కౌసల్యా సుమిత్రలకు బుత్రులుకలుగలేదు. సంతానముకొఱకే,
కైకేయిని వివాహముచేసుకొనెను. అందువలన, అశ్వపతికి
తన యుంగీకారము దెలుపుటలో ప్రమాదమేమియులేదని దశ
రథుడు భావించెను. కాని రాముడు జననమొందిన తర్వాత

తన యభిప్రాయమును మార్చుకొనెను. రామునియందున్న నిరతిశయప్రేమయే రాముని పట్టాభిషేకము వెంటనే చేసికొన మని త్వరబెట్టుటకు అశ్వపతిమహారాజును (భరతశత్రుఘ్ను లతోసహా) బిలువకుండుటకు కారణమయినది. కాని దశరథు డెన్ని ప్రయత్నములుచేసినను చివరకు కానే రామపట్టాభి షేక భంగమునకు ముఖ్యకారకుడైనాడు. దైవవిధి నెవరు తప్పించగలరు! ఇది అంతయు దెలిసినవాడుగనుకనే భరత, లక్ష్మణులతో తన వనవాసమునకు, పట్టాభిషేకభంగమునకు, తన తండ్రియొక్కగాని, తల్లియొక్కగాని తప్పేమియు లేదనియు, అంతయు దైవప్రేరేపణయేయనియు, తప్పక భరతుని పట్టాభిషే కము, తనవనవాసము జరిగితీరవలసినదేయనియు రాముడు గటి గావక్కాణించెను. దశరథుడు, సత్యవాది, ధర్మిష్టుడు గనుకనే కైకేయికిచ్చిన వాగ్దానము నెరవేర్చవలసివచ్చినది. కొన్ని రామాయణములలో దశరథుడు మూర్ఛనొంది యేమిచెప్ప లేని పరిస్థితిలో నుండగా కైకేయి తనవరములు, దశరథుని యంగీకారము గురించి రామునితో చెప్పి, వనవాసగమనము నకు త్వరబెట్టినదనియు, రాముడు వెళ్ళెననియు చెప్పబడియు న్నది. కాని అదినిజముగాదు. దశరథుడు రాముని యరణ్యము నకు వెళ్ళుమని ఆశీర్వదించిన తర్వాతనే రాముడరణ్యమునకు వెళ్లినట్లుగా వాల్మీకిరామాయణములో నున్నది. ధర్మపాశ బద్ధుడుగాన రాముని యరణ్యమునకు బొమ్మనమని ఈక్రింది విధముగాచెప్పెను.

శ్రేయసే వృద్ధయే తాత పునరాగమనాయిచ
గచ్ఛస్వారిష్ట మవ్యగ్రః పంథానమకుతోభయమ్,

నీకు శ్రేయస్సు గలుగుగాక, తిరిగి క్షేమముగా వత్తువు గాక, నీకేమి దారిలో అరిష్టములు గలుగకుండుగాక యని ఆశీర్వదించెను. ధర్మమార్గములోనున్న నిన్నుత్రిప్పుటకు నాకు శక్యముగాదనికూడ చెప్పుచున్నాడు. కాని నీవు నన్నుత్రోసి రాజయినయెడల నాఅభ్యంతరమేమియు లేదని చెప్పినాడు. జ్యేష్ఠసుతుడవైన నీవు తండ్రిని ఋణగ్రస్తుకాకుండునటుల (అపాస్మృతుడిగా) చేయుటకు గోరుచున్నావు. ఇందులో నాశ్చర్యమేమియు లేదు. నీవునీధర్మము నాచరణములో బెట్టుచున్నావనియు ఆవిధముగా నీవు చేయనియెడల నాశ్చర్యమునకు కారణభూతుడవగుదువనియు, అర్థము స్ఫురించుచున్నది. దీనినిబట్టి చూడ రాముడు తనవాక్యానుసార మరణ్యమునకుబోవుట ధర్మమే యని దశరథుడు తలచినాడని తెలియుచున్నది. దశరథుని మాటలకు రాముడీ క్రిందివిధముగా ప్రత్యుత్తరమిచ్చినాడు.

నహి మే కాంక్షితం రాజ్యం సుఖమాత్మనివా ప్రియమ్
యదానిదేశం కర్తుం వై తవైవ రఘునందన

"నాకురాజ్యము, సుఖము, ఏమియునక్కరలేదు. నీయాజ్ఞ శిరసావహించుటయే నాకర్తవ్యమని చెప్పి, నారచీరెలు ధరియించి, సీతా లక్ష్మణులతో సహా తండ్రికి, తల్లులకు నమ

సాకర్రప్రదక్షిణములుచేసి రథమెక్కి అరణ్యమునకుబోయెను. రాముడు వెళ్ళిన ఆరవరోజు రాత్రియే, అతనిని స్మరించుచు దశరథుడు ప్రాణములను విడిచెను.

దశరథుని జీవితములో చెప్పవలశిన విషయమొకటియున్నది. వేటకై ఒకరోజు దశరథుడు, తన యౌవనమున, అరణ్యమునకుబోయెను. ఆరోజురాత్రి తెల్లవారిఝామున నొక చెట్టుమీదమాటుబెట్టుకొనియుండగా "బుడ, బుడ"మనిశబ్దము వినవచ్చెను. ఏదియోమృగము నీరుత్రాగుచున్నదని భ్రమపడి బాణమువదలెను. అది నీటిలోపాత్రనుముంచుచున్న యొకముని బాలకునికితగిలి అతడు మరణించెను. అమృతబాలుని, యలని మాతాపితరుల కడకుగొనిపోయి, జరిగినవృత్తాంతమంతయు చెప్పి, వారినిక్షమాభిక్ష వేడుకొనెను. శోకాభిభ్రుడైన యా ముని బాలకునితండ్రి "నీవుగూడా మరణసమయమున పుత్రవియోగముచే బాధపడుచు ప్రాణములవిడచెదవుగాక" యని శపించెను. దీనివలన మనము నేర్చుకొనవలశినదేమన, తెలియక తప్పుచేశినను దానిఫలమనుభవించవలశినదే. పశ్చాత్తాపము కొంతదోషమును తగ్గించునుగాని పూర్తిగా దుష్కలమును త్రోసివేయజాలదు.

రావణవధానంతరము, స్వర్గములో దివ్యరూపములోయున్న దశరథుడు దేవతలతో బాటు ప్రత్యక్షమయి సీతారామలక్ష్మణుల నాశీర్వదించెను. ఆడినమాట తప్పనివాడు

రాజర్షి, యజ్వ, గాన దశరథునికి స్వర్గప్రా ప్తిలభించినది. అస్వర్గ ప్రా ప్తికి రాముని పితృవాక్యపరిపాలన ముఖ్యకారణమైనది.

హ ను మ ం తు డు

హనుమంతుడు వాయుదేవుని ఔరసపుత్రుడు. అంజనీ దేవికి జనించెను. మహాపరాక్రమశాలి. వినువీధిలో నెగురుటలో తండ్రియగు వాయుదేవుని కెంతమాత్రము దీసిపోడు. పుట్టుటతోనే పండుయని తలచి సూర్యబింబమును కబళింపబోయిన మహాపరాక్రమశాలి. సూర్యబింబమును కబళింపబోవు సమయమున ఇంద్రుని వజ్రాహతికి గురియై భూమిమీదపడి మూర్ఛిలెను. వజ్రాహతికొక హనువు దెబ్బతినినందున హనుమంతుడను పేరు కలిగెను. కుమారుడు మూర్ఛిలినపుడు తండ్రియగు వాయుదేవున కాగ్రహమువచ్చి తనచలనము స్తంభింపజేసెను. జీవరాసులన్నియు దేవతలతోసహా, క్షోభిల్లినవి. బ్రహ్మాదులందరు ప్రత్యక్షమయి హనుమంతుని ఆరోగ్యవంతునిగాచేసి అనేకవరములు ప్రసాదించిరి. అస్త్రశస్త్రము లచే నవధ్యత్వము, చిరంజీవత్వము, మొదలగు వరములాంజనేయునికి ప్రసాదించి వాయుదేవుని శాంతింపజేసిరి. వాల్మీకి అతనిని "రామాయణ మహామాలారత్న"మనియు, "బుద్ధిమతాంవరిష్ఠు"డనియు వర్ణించినాడు. నిజముగా రామాయణ

మను మహామాలకు రత్నమువంటివాడే! కార్యాకార్యవిచక్షణ, యుక్తాయుక్తవివేకము గలవాడు. మహాపండితుడు. నవవ్యాకరణవేత్త. తనతపోబలముచే భవిష్యద్బ్రహ్మత్వమును సంపాదించిన మహాతపస్వి. దూతలలో నుత్తమోత్తముడు. దూతలలో సామాన్యముగా మూడురకము లుందురు. (1) ఉత్తముడు (2) మధ్యముడు (3) అధముడు. యజమాని పనిచేయకపోగా చెడగొట్టువాడధముడు. పని అయినను కాక పోయినను చెప్పినంతవరకు చేయువాడు మధ్యముడు. యజమాని చెప్పినంతవరకేగాక తనబుద్ధిని వినియోగించి, యజమాని పనిని పూర్తిచేసి కృతకృత్యుడై యజమానికి పూర్తిగా సంతృప్తిగలిగించువాడుత్తముడు. ఆ యుత్తమదూతలలో నగ్రస్థానమునకు చెందినవాడు హనుమంతుడు. అందుకనే శ్రీరాముడు పవనాత్మజుని చూడగనే లక్ష్మణునితో చెప్పిన వాక్యములు గమనింపదగినవి.

ఏవం విధో యస్యదూతో నభవే త్పార్థివస్యతు।
సిధ్యంతి హికథంతస్య కార్యాణాంగత యోనఘు ॥

ఏవం గుణగణైర్యుక్తా యస్యస్యుః కార్యసాధకాః।
తస్యసిధ్యంతి సర్వేర్థాః దూతవాక్య ప్రచోధితః ॥

ఈవిధమైన దూత నెవరికి వుండడో ఆరాజు కార్యము లెట్లు సిద్ధించును? (అనగా సిద్ధించవని అర్థము) ఇటువంటి గుణములుగల దూతనెవరికి సిద్ధించునో ఆయజమాని యొక్క

కార్యములు తప్పక పూ ర్తిగా నెర వేరును. దీనినిబట్టి తెలియున దేమన, ఆంజనేయుని చూడగనే ఉ త్తమో త్తముడైన దూత యని రాముడు గ్రహించినట్లు తెలియు చున్నది.

సుగ్రీవ సందర్శనమునకై, కబంధుని ఆదేశానుసారము ఋశ్యమూకపర్వతము సమీపించునప్పుడు వారిని (రామలక్ష్మ ణుల) చూడగనే వాలిదూతలని భయపడి సుగ్రీవుడా పర్వత మునుండి మరియొక పర్వతముమీదికి తననలుగురు అనుచరు లతోసహా దూకును. భయవిహ్వలుడైన సుగ్రీవుని ఆశ్వా సించి, హనుమంతుడు భిక్షురూపమున సుగ్రీవుని ఆజ్ఞప్ర కా రము రామలక్ష్మణుల వద్దకువచ్చి వారి పూర్వో త్తరముల గ్రహించును. భిక్షురూపములో వచ్చిన హనుమంతునిరూపము, వాగ్ధోరణి రాముని వెంబడే యాకర్షించును. తక్షణమే లక్ష్మ ణునితో నీ క్రిందివిధముగా జెప్పుచున్నాడు. ఈ వచ్చినపురుషు డద్భుతమేధావి, నవవ్యాకరణవే త్తగా గనబడుచున్నాడు– బహుజాగరూకతతో నాతనిప్రశ్నలకు సమాధాన మీయవల శినదని లక్ష్మణునికి హెచ్చరిక చేయుచున్నాడు. నాల్గువేద ములుచదివినవాడుగూడా నీవిధముగా భాషించలేడు–ఇంత సేపు మాట్లాడినను కించిదప శబ్దముగూడా లేదు. నవవ్యాకరణ వే త్తగా కనబడుచున్నాడు. అసందిగ్ధమయినవి, అప్రయత్న ముగా స్వరయు క్తముగా వెలువడుచున్నవి, సంస్కార క్రమ సంపన్నమయినవియగునీతని కళ్యాణవాక్కులు నాహృదయము

నాకర్షించుచున్నవని, శ్రీరాముడు లక్ష్మణునితో చెప్పెను. శ్రీరాముడే యీవిధముగా ముగ్ధుడై హనుమంతుని వర్ణించి నప్పు డాయన తేజోరూప విశేషములు, వాచాపైపుణ్యము లిట్టివని మనమేమి వర్ణింపగలము. లక్ష్మణుడుగూడ మృదు, మధురవినయ భాషణముల నాంజనేయునికి తమసంగతి యంతయు చెప్పి కబంధుని యాదేశానుసారము సుగ్రీవసహాయ మపేక్షించుటకు వచ్చితిమని చెప్పెను.

సర్వలోకస్యధర్మాత్మా శరణ్యం శరణం పురా
గురుర్మే రాఘవస్యోయం, సుగ్రీవం శరణంగతః ॥

"సర్వలోకము లేమహానుభావుని శరణుగోరునో, అంద రికి శరణు యివ్వగల నాగురువైన రాఘవుడీరోజున సుగ్రీవుని శరణుగోరుటకు వచ్చినాడని వినయముతో బల్కెను.

పవనాత్మజుడు, దివ్యమంగళరూపులు, వరాయుధ ధరు లైన రామలక్ష్మణులజూచి మోహితుడై, వీరివలన సుగ్రీవుని కష్టములు దీరుననిదలచి, సుగ్రీవునకు జరిగిన యవమానము, వాలి దుష్టప్రవర్తన గురించి వారికిచెప్పి, తననిజస్వరూపమును దాల్చి, వారిని భుజములమీద నెక్కించుకొని సుగ్రీవునొద్దకు బోయెను.

సుగ్రీవుడు సీతాన్వేషణకై అన్నిదిక్కులకు వానర సైన్యముల బంపెను. దక్షిణదిశ కంగదుని నాయకత్వముక్రింద

హానుమత్ జాంబవదాది మహావీరుల బంపెను. రాముడు తన యనుభవమువల్లను, సుగ్రీవునిస లహావలనను, ఆంజనేయుడే కార్యసాధకుడని గ్రహించి తనస్వనామాంగుళీయకమును సీత గనబడినయెడల గుర్తుగా నివ్వమని బ్రసాదించెను.

దక్షిణపుదిక్కు వెళ్ళినవారందరు సీతకోసము వెదకి, వేసారి యేమియు తోచక వింధ్యపర్వతప్రాంతములో నొక చోటచేరి శ్రీరామచంద్రునిగాధ నేకకంఠముతో పాడ మొదలిడిరి. ఇదంతయు. సమీపములోనుండి వినుచున్న సంపాతి యనుగృధ్రరాజము వారల సంబోధించి, తనకు దూరదృష్టి గలదనియు. సీతాదేవి తనకు గనబడుచున్నదనియు, యామె రావణుడు పరిపాలించుచున్న లంకాబట్టణములో నశోకవని కలో నిగ్బంధించబడి యున్నదనియు చెప్పెను. హానుమదాది మహావీరులంద రావార్తవిని సంతసించినవారై దక్షిణ సముద్రతీరమునన్న మహేంద్రపర్వతమును జేరిరి.

ఎదుటనే ఘోషిల్లుచున్న శతయోజన విస్తీర్ణ సముద్రమును, అంబరమున కెగురు తరంగములను జూచి యీ సముద్రము నెటుల దాటుటయీయని వానరులందరు నిరుత్సాహులై నూగకుండిరి. అప్పుడు జాంబవంతుడు, హానుమంతుని సమర్థత తెలిసినవాడు గాన ఈక్రిందివిధముగా యీతని సముద్రలంఘన మునకు బురికొల్పుచున్నాడు.

ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్।
పరాహిసర్వభూతానాం హానుమాన్ యా గతిస్తవ॥

నాయనా! ఈక్లిష్టపరిస్థితులలో నీవేమాదిక్కు. లెమ్ము! సముద్రమునుల్లంఘించుము. విహాయసమార్గమున వేగముగా బోవుటలో నీతండ్రితోసమానుడవని ప్రోత్సహించినమీాదట హనుమంతుడు సముద్రమును లంఘించుటకు సిద్ధుడయ్యెను.

హనుమంతుని పరాక్రమము, కార్యదీక్ష, స్వామిభక్తి, బుద్ధికుశలత, రాజనీతిజ్ఞత యుక్తాయుక్తవిచక్షణ, మొదలగు గుణములన్నియు సుందరకాండలో బహిర్గతమగును.

ప్రథమమున పవనాత్మజు డొనర్చిన గొప్ప కర్మసముద్ర లంఘనము. ఆకర్మను "దుష్కరం, నిష్ప్రతిద్వంద్వం" (దుర్భేద్యమైనది, అసమానమైనది) అని వాల్మీకివర్ణించినాడు. మహేంద్రపర్వతముమీాదినుంచి, హనుమంతు డాకసములో నెగురుట వాల్మీకి అద్భుతముగా వర్ణించినాడు.

తతో రావణసీతాయాః స్సీతాయాః శత్రుకర్శనః
ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి।

సీతాన్వేషణకై విహాయసమార్గమున బోవుటకు నిశ్చయించుకొనెను. పైశ్లోకము మొదలు

"ససాగరం దానవపన్నగాయుతమ్ బలేన విక్రమ్య
మహోర్మిమాలినమ్।
నిపత్య తీరేచ మహోదధే స్తదా దదర్శ లంకా మమరావతీమివ"

అనుశ్లోకమువరకు 200 శ్లోకములలో సముద్రలంఘన మద్వితీయముగాను, మనోరంజకముగాను వాల్మీకివర్ణించెను.

సూర్యోదయము మొదలు, సూర్యాస్తమయములోపల, శతయోజనసముద్రమునుదాటి, దారిలో తనకెదురొక్కనిన విఘ్నముల నణచి, అవతలి తీరమునుచేరెను. ఆయన ఎంతసమర్థుడైనను, ఆత్మవిశ్వాసము గలవాడైనను ప్రధమమున దేవతలకు, దిక్పాలురకు నమస్కారముచేసి సముద్రోల్లంఘనమున కుపక్రమించెను. కాన, ప్రతిమానపు డహంకారమును చంపుకొని కార్యారంభమందు దేవుని దలచవలయును. దైవానుగ్రహము లేనిది పురుషప్రయత్నము సఫలీకృతముకాదు.

ససూర్యాయ మహేంద్రాయ పననాయ స్వయంభువే
భూతేభ్య శ్చాంజలిం కృత్వా చకార గమనేమతిమ్॥

"సూర్యునికి, దిక్పాలకులకు, దేవతలకు, పంచభూతములకు, అంజలియొనర్చి సముద్రలంఘనమునకు ప్రక్రమించె" నని వర్ణింపబడియున్నది.

ఆంజనేయునకు దైవభక్తితోపాటాత్మవిశ్వాసముగలదు. యీరెండును లేనిది మానవు డేకార్యమును సాధించలేడు. ఈసందర్భమున ఆంజనేయుని వాక్యములుగమనింపదగినవి. రామునిచేత విడువబడినబాణమెంతవేగముగాపోవునో, యంత వేగముతో లంకకు వెళ్లెదను. సీతకనబడనియెడల రావణుని బంధించి తీసికొనివచ్చెదను. సర్వవిధముల కృతకృత్యుడనై

సీతతోసహా వచ్చెదనని చెప్పెను. చూచితిరా! హనుమంతుని ఆత్మవిశ్వాసము.

ఆత్మవిశ్వాసము, దైవభక్తితోపాటు మహనీయుని కుండవలసిన లక్షణము ధీరత్వము. ధీరత్వమనగా విఘ్నములకు లెక్కసేయక కార్యము సాధించుట. ఎన్నివిఘ్నములు వచ్చి నను గణనసేయక, సీతజాడ కనిపెట్టి ఆమెతో తృప్తిగామా ట్లాడి, ఆమె సందేశమును రామునికందచేసిన ధీరుడు, బుద్ధి మంతుడు. సముద్రమును దాటుచుండగనే ఆయనకు విఘ్ను ములు కలిగినవి. ప్రథమవిఘ్నము మైనాకపర్వతము తనమా ర్గము నిరోధించుట. మైనాకునితో మరల వచ్చెదనని ఆయన అనుమతిని తీసికొని ముందుకుసాగెను. రెండవవిఘ్నము దేవ మాతైన సురసాతని ప్రింగుటకు వచ్చుట. ప్రథమమున నామీకు నమస్కరించి రామకార్యార్థము వెళ్ళుచుంటి ననియు, తిరిగి వచ్చునపుడ మెవదనగహ్వరములలో ప్రవేశించెదన నియు జెప్పెను. కాని యామె నోరు తెరచుకొని ప్రింగుటకు రాగా ప్రహ్వరూపుడై యామెనోటిలో ప్రవేశించి వెంబడే బయటికి వచ్చెను. అతని లాఘవమునకు నేర్పరితనమున కామె మెచ్చుకొని దీవించిపంపును-మూడవవిఘ్నము సింహిక యను రాక్షసి సముద్రములో గనబడుచున్న హనుమంతుని ఛాయను గ్రహించి తద్వారా ఆతని గమనమును నిరోధించెను. అది చూచి హనుమంతు డాశ్చర్యపడి, సముద్రములోదూకి యా మెను వధించి మరల నాకసమునకెగిరి సూర్యాస్తమయము

లోపల నవలిదరికి చేరెను. ఈవిధముగా సూర్యోదయము మొదల స్తమయములోపల విఘ్నముల నణచి, శతయోజన సముద్రమును లీలగాదాటి, లంకప్రవేశించిన పరాక్రమశాలి, ధీరుడు.

హనుమంతుని బుద్ధికుశలత పరాక్రమము లంకయందున్న కాలములో జూపినాడు. ఆయన లంకలో ప్రవేశించుసరికి సూర్యాస్తమయము ప్రారంభించుచున్నది. ఇంకా వెలుతురు భాగుగనే యున్నది. అందుకని చీకటి పడునంతవరకు సముద్ర తీరమునవున్న వనములలో సంచరించెను. తను మామూలు రూపమున పోయినయెడల నెవ్వరైనా శంకించవచ్చునని దలచి నవాడై ప్రహస్వరూపము ధరించి (మార్జాలవత్) త్రికూటపర్వ తము నెక్కి- శిఖరమునందమరావతివలె వెలుగుచున్న లంకా పట్టణమునుజూచి విస్మయ మొందెను. లోనికి ప్రవేశించుసమయ మున లంఖణీయను రాక్షసి అడ్డగించగా నామెనువధించి, ప్రా కారముదాటి లంకాపురభూభాగములో తన వామపాదమును బెట్టెను-అది పుష్యశుద్ధ పౌర్ణమిరాత్రి - "పోష్ప్లూయమానం సరసీవహంసః" అని పున్నమచంద్రుని వాల్మీకి వర్ణించినాడు. అనగా, "స్వచ్ఛమయిన సరస్సులో మందగమనమున నీదు చున్న హంసమాదిరి, చంద్రుడాకసమున బోవుచున్నాడని వర్ణిం చెను. లంకనంతయు వెదకి సీతనుగానక రావణుని అంతఃపురము ప్రవేశించెను. ప్రబ్మతేజోవిశిష్టుడు, భయంకరుడు, భుజంగము వలె నిశ్వసించుచు నిదురబోవుచున్న రావణునిజూచి "ఆసాద్య

పరమోద్విగ్నఃసోపాసర్పత్సుభీతవత్'' దగ్గరకువెళ్ళి ఉద్విగ్న హృదయుడై భయపడినవానివలె రెండుమూడడుగులు వెను కకువేసెను - దీనినిబట్టిచూడ రావణుని తేజోరూపములు నిదు రబోవునప్పుడుగూడ యితరులకుద్వేగము కలుగచేయునని తెలియుచున్నది. అతని ప్రశ్నశయనమున బరుండిన, సర్వా భరణభూషితురాలు, సౌందర్యవతియగు మండోదరినిజూచి ప్రథమమున సీతయని భ్రమించెను. కాని బుద్ధిసూక్ష్మతగల వాడు గనుక మహాపతివ్రతయగు సీత సర్వాలంకారములతో రావణుని సమీపములో శయనించుట అసంభవమనిదలచి, యా నిద్రించుచున్నవ్యక్తి మండోదరియని నిర్ణయించినవాడై తన పొరబాటుకు సిగ్గుచెందెను. మరల పుష్పకవిమానమంతయు వెదకెను. లంకనంతయు మరలవెదకెను - కాని సీత కనబడ లేదు. నిర్వేదము చెందినవాడై ప్రాయోపవేశము చేయుదల చుకొనెను. కాని, ఆత్మహత్యవలన ప్రయోజనము లేకపోగా పాపమనిదలచినవాడై ఆప్రయత్నము విరమించెను. ముహూ ర్తము ధ్యానముచేసి, సీతారాములను, సూర్యచంద్రులను దిక్పాలకులను స్తోత్రముచేసెను,

నమోస్తు రామాయ చలత్కణాయ
దేవ్యైచతస్యై జనకాత్మజాయ
నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః

తల యె త్తిచూచుసరికి తనిదివర కెన్నడుచూడనిదైన అశోకవనిక గానబడెను. హర్షోత్ఫుల్లనయనుడై వెంబడే ప్రాకారమువతలికి దూకి అశోకవనికనంతయు వెదకెను. ఒక చోట చైత్యప్రాసాదము గనబడెను. దానిదగ్గరవున్న శింశుపా వృక్షము నధిరోహించి ప్రాసాదమువై పుజూచెను. రాక్షసస్త్రీల మధ్య దీనురాలై, మలినురాలై యున్న సీతను జూచెను. "ఉప వాసకృశాం దీనాం మండనార్హామమండితామ్" ఉపవాస ముచే కృశించి దీనురాలైనదియు, సర్వభూషణములు ధరిం చుట కర్హురాలైనప్పటికి అలంకారరహితయైనదియునగు జాన కిని చూచి పరితపించెను. రాముడు వర్ణించినప్రకారము గనబడు టచే యీ మెసీతయనినిశ్చయించెను. ఆవృక్షాగ్రమమునకుండే యీదేవిని జూచుచు, రాముని ధ్యానము చేయుచూ, తగిన సమయమునకై నిరీక్షించుచుండెను. తనుజూచుచుండగనే దశా ననుడువచ్చి, ఆమెను ప్రలోభపరచి, చివరకు బెదిరించి రెండు మాసములే వ్యవధినిచ్చితిననియు, యీలోపల మనసుమార్చు కొని తననుస్వీకరించనియెడల గడువుదాటినమరునాడుదయమే తనప్రాతరశనార్థము ఆమె శరీరమును వంటవారు భేదించి వండె దరనియు చెప్పెను. రావణుని యాజ్ఞప్రకారము సీతను తర్జన భర్జనలు చేసి రాక్షసస్త్రీలు నానావిధముల హింసించుచుండిరి వారిహింసాకృత్యములకు తట్టుకొనలేక రామునిగూర్చి విలపిం చుచూ, దగ్గరవిషముగాని, శస్త్రముగానిలేకపోవుటచే తనదీర్ఘ వేణిని గొంతుకుచుట్టికొని ఆంజనేయులున్న వృక్షశాఖక్రిందికి

వచ్చి ఆత్మహత్య చేసికొనుటకై ప్రయత్నింపబోవుచూ, చింతా నిమగ్నురాలైయుండ కొన్ని సుభసూచకములు గనబడుటచే నేమిచేయుటకుతోచక నూరకుండెను. అప్పుడు వాయుసూను నకు గొప్పపరీక్షాసమయ మాసన్నమయ్యెను. రాక్షసస్త్రీలింకా నిద్రచెందలేదు. సీతను బలుకరించుటయా ? లేక తిరిగివెళ్ళు టయా ? యనుసమస్య ఉత్పన్నమయ్యెను. తను స్వయముగా రావణుని దుర్భాషలువినినాడు. రాక్షసస్త్రీల ప్రవర్తన కను లార జూచినాడు. తనుఆలస్యముచేసినయెడల నామె ఆత్మహత్య చేసుకొనునేమో? తనుపలుకరించక, సీతాసందేశమేమియు తీసికొనక వెళ్ళినయెడల రామునకసంతృప్తి గలుగుటయేగాక సీతకూడ ప్రబుద్ధురాలు. పలుకరించవలెనని, నేవిధముగా బలుక రించవలయును ? రాక్షసులకతను రామదూతయని తెలిసిన యెడల కార్యభంగమగును. తననిజరూపముతో వృక్షమునుండి దిగిన సీతభయపడునేమో ? మానవరూపమున సంస్కారమైన వాక్కులతో మాటలాడిన రావణుడే మానవుని రూపములో వచ్చినాడని భయపడునేమో ? ఈవిధముగా నాలోచించు చుండగా దైవకృపవలన త్రిజటయను రాక్షసస్త్రీ ప్రోద్బల ముచే సీతనుబాధించుటమాని రాక్షసస్త్రీలు నిద్రచెందిరి. బుద్ధి మంతుడుగాన తగినసమయము వచ్చినదని తెలిసికొనినవాడై, హ్రస్వవానరరూపమువాల్చి, పర్ణాంతరలీనుడై వృక్షముమీ దనే యామెసన్నిహితమునకువచ్చి మృదుమధురమైన మానుష వాక్కులతో శ్రీరామచరితమును జననప్రభృతి యప్పటివరకు

వర్ణించి తను రామమిత్రుడైన సుగ్రీవుని సచివుడననియు, హను మంతుడను నామధేయముగలవాడననియు సీతాన్వేషణకై రామసుగ్రీవులయాజ్ఞ చేబంపబడి దైవకృపవలన నామెను గంటి ననియు-

అహం సంపాతివచనాత్ శతయోజనమాయతమ్
తస్యాః హేతోర్విశాలాక్ష్యాః సముద్రం వేగవాన్ ప్లుతః
యథారూపం యథావర్ణం యదాలక్ష్మ్యావతించ తామ్
అశ్రౌషం రాఘవస్యా యం సీయమాసాదితామయా॥

"సంపాతివచనమువల్ల, తన యునికిని తెలుసుకొని, శత యోజనసముద్రమును వేగముగాదాటి శ్రీరాముని చే వర్ణింప బడిన రూపము, శీల, కాంతి, కలిగిన ఆమెను (సీతను) జూచితి ననీ సంతోషముగా బలికి విరమించెను. ఈవిధముగా రామ చరితమును వినిపించి సీతానుగ్రహము సంపాదించి, ఆమెప్రసన్న దృష్టి తనయందు లగ్నమగునటుల చేసికొనిన ధీశాలి, బుద్ధి మంతుడు.

తతః శాఖాంత రేలీనం దృష్ట్వా జీలితమానసాం
వేష్టితార్జునవస్త్రంచ విద్యుత్ సంఘాతపింగళమ్ ॥
సోదదర్శ కపిం తత్ర ప్రశితం ప్రియవాదినమ్ ।
పుల్లశోకోత్కరాభాసం తప్త చామీకరేక్షణం ।
విద్యుత్ సంఘాతవర్చసుడు, పింగళనయనుడు, తెల్లని

వస్త్రము ధరించినవాడు, కపిరూపుడైన నాంజనేయుని జూచి నది. ప్రథమమున భయపడినదిగాని, తనకు శుభనిమిత్తములు (వామనేత్రము, వామభుజము నదరుట) కనబడుటచే స్థిమితము నొందినదై, నతనివంక విస్మయ, ప్రసన్న దృష్టితోజూచెను. బుద్ధిమంతుడగు హనుమంతుడు తగిన సమయమనిదలచి చెట్టుదిగి వినయవిధేయతలతో నామెను సమీపించెను. రాముని చరిత్రయు, సుగ్రీవరామ సమాగమముచెప్పి, త్వరలో రామ సుగ్రీవులు కపిసైన్యముతోవచ్చి తనకు విముక్తి కలిగించెదరని చెప్పి యామెకు నమ్మకము కలుగుటకై రామనామాంగుళీయక మిచ్చెను.

వానరోహం మహాభాగే దూతో రామస్య ధీమతః ।
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగుళీయకమ్ ।

ప్రత్యయార్థం తవానీతం తేనదత్తం మహాత్మనా ।
సమాశ్వసిహి భద్రంతే క్షీణదుఃఖపరాన్యాసి ॥

"నేను రామదూతను, వానరుడను, రామనామాంగుళీయకము దీసికొనివచ్చితిని. చూడుముదేవి ! ఆమహాత్ముడు తనప్రత్యయార్థము నాకిచ్చినాడు, తీసికొనుము. ఇకనుంచి నీ దుఃఖము తొలగుగాక" అని యామెనోదార్చి ఆమెకు రాముని వుంగరము నిచ్చెను. అపరిమితసంతుష్టాంతరంగురాలై యిక రెండుమాసమునే తనకు జీవన వ్యవధియనియు, రాముడువచ్చి రావణుని సపుత్రమిత్ర భాంధవముగా నిర్మూలముచేసి తనను

దీసికొనివెళ్ళుట ధర్మమనియు, అది తనకోరిక యనియు చెప్పెను. హనుమంతుడు సంతసించినవాడై రాముడు తప్పక సుగ్రీవుని తోను, సైన్యముతోనువచ్చి రాక్షసనిర్మూలనము కావించి తనను తీసికొనివెళ్ళునని చెప్పి, యామెనాశ్వాసించి ప్రత్యయార్థ మామెయిచ్చిన చూడామణిని తీసికొని ఆమెయనుమతి, ఆశీ ర్వాదము నొంది, తదుపరి కార్యక్రమమున కుపక్రమించెను.

బుద్ధిమంతుడు, కార్యదక్షుడు, గనుక ఇకముందుచేయ వలసిన కార్యము విషయమై నాలోచించెను. రావణుని దర్శించి యతనితో మాట్లాడవలెనని సంకల్పము కలిగెను. తనవృత్తాం తము రావణునికి తెలియుటకై ముందు అశోకవనమును భగ్న ముచేసి కాపలావారిని కొంతమందినిచంపెను. వారుపోయి రావణునితో యొక కోతివచ్చి సీతతో నేదియోసంభాషించి, అశోకవనమును భగ్నముచేసి కాపలావారిని కొంతమందిని చంపెనని నుడివిరి. కోపావిష్టుడై రావణుడు కొంతమంది వీరులను హనుమంతుని మీదికి బంపెను. వారు యుద్ధభూమిలో మడి సిరి. తదుపరి, నొకరితర్వాతనొకరిని, కొన్ని వేలకింకరసమూహ మును, పంచసేనాగ్రనాయకులను, ప్రహస్తపుత్రుడగు జంబు మాలిని, తనరెండవకుమారుడగు నక్షయకుమారుని, రావణు డాంజనేయుని జంపుటకు బంపెను. వారినందరిని ద్వారతోర ణము మీదనుండియే తనచేతిలోనున్న పరిఘతో యీశ్లోకింది శ్లోకములు స్తుతించుచూ అందరిని బరిమార్చెను.

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః

దూతోహం కోసలేంద్రస్య రామస్యా క్లిష్టకర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతాం మారుతాత్మజః

"అతిబలుడగు రామునికి, మహాబలుడగు లక్ష్మణునికి, రాజగు సుగ్రీవునికి, జయమగుగాక. నేను కోసలేంద్రుడగు రాముని దూతను. హనుమంతుడను నామధేయము గలవాడను. వెయ్యి రావణులుగూడా నాతో యుద్ధమునకు సరిబోలరు. మీ రందరు చూచుచుండగనే, లంకను కొంతనాశనముచేసి, రాక్షసులను చంపి, సీతకు నమస్కారము చేసి, సమృద్ధార్థుడనై తిరిగి వెళ్ళెదను" అని గర్జించుచూ ఎదిరించిన రాక్షసులందరిని (జంబుమాలిఅక్షయికుమారులతో సహా) నిర్మూలనమొనరించిన మహా పరాక్రమశాలి. చివరకు ఇంద్రజిత్ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే బంధింపబడినవాడై రావణునివద్దకు కొనిపోబడెను. రాజసభలో సింహాసనస్థుడైన రావణుని తేజోరూపములజూచి విస్మయము నొంది ఈక్రిందివిధముగాబలికెను.

అహోరూప మహోధైర్య మహోసత్వ మహోద్యుతిః
అహో రాక్షసరాజస్య సర్వలక్షణ యుక్తతా॥

యద్యధర్మోన బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరం
స్యాదయం సురలోకస్య, సశక్రస్యాపిరక్షితః

"ఏమిరూపము ! ఏమితేజస్సు ! ఏమిసత్వము! ఏమి ధైర్యము ! వీనిలో నధర్మమే లేనియెడల వీనినెవ్వారు జయించ లేరు. అనగా వీనిలో నధర్మమున్నదిగనుక రాముడితనిని చంపగలడని ధైర్యము తెచ్చుకొనెను. దేవేంద్రునిచేత రక్షిం పబడిన సురలోకమునుగూడా జయింపగలడని తలచెను.

నిర్భయముగా హనుమంతుడు రావణునికి హితబోధ చేసెను. రాముడు లేనిసమయములో చోరునివలె సీతను తీసి కొని వచ్చినాడవు. ఇది వీరలక్షణము గాదు. మీదుమిక్కిలి పరదారాభిమర్శనము మహాపాపము. రామునికి వినయపూర్వ కముగా సీతనిమ్ము ఆదయాళుడు నిన్ను తప్పక క్షమించును. లేనియెడల నీనాశము తథ్యము, సీత లంకానాశనమునకై యుద్భవించిన కాళియనుకొనుము. రామసుగ్రీవు లిద్దరేకమై నారని తెలుసుకొనుము. రాముడు వాలిని ఒకేబాణమున జంపినాడు. అదిబాగుగా గమనించుము. ఖరదూషణాది మహా వీరులను, చతుర్దశసహస్రరక్షో గణమును, ఒక ముహూర్త కాలములో రాముడొక్కడే, పదాతిగానుండి చంపినాడని తెలు సుకొనుము. రాముడు మానవుడు, సుగ్రీవుడు వానరుడు; ఈ రెండు జాతులచేత నీవవధ్యత్వము గోరలేదనికూడ హెచ్చరిక జేసినాడు బాగా ఆలోచించుకొనమని స్పష్టముగా హితోప దేశము చేసెను. సీతనపహరించిన దుష్టుని సర్వనాశనము చేసెదనని బుద్ధివానరులసన్నిధిని రాముడు ప్రతిజ్ఞ చేసినాడని గూడ చెప్పెను.

ఈ హితోపదేశము వినినతర్వాత రావణుడు క్రోధా విష్టుడై వాయుసూనిని తోకతగులబెట్టి వదలివేయుడని యాజ్ఞా పించెను-ఆవిధముగా తగులబెట్టిన పిదప లంకనంతయు (విభీష ణుని గృహముతప్ప) తగులబెట్టెను. యుంత్రాగారములు, ఆయుధాగారములు, ముఖ్యమయిన రాక్షసవీరుల గృహములు, (రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్ ప్రహస్తుడు మొదలగువారి గృహములు) తగులబెట్టి, ప్రాకారగోపురముల భగ్నమొనర్చి, యగడ్తలనుబూడ్చి రావణుని బలములో 8వ వంతు (1/8) నాశనముచేసి, శత్రురహస్యముల తెలుసుకొని, లాంగూల మును సముద్రములోముంచి చల్లార్చి, సీతాసందర్శనము మరల జేసి, యామెనాశ్వాసించి, ఆశీర్వాదమునుబొంది, ఆమెకి యుదంతమునంతయుచెప్పి, ఆమెయనుమతిని తీసికొని, ద్విగుణీ కృత యుత్సాహముతో మరల సముద్రముదాటి శ్రీరామునికి సీతాసందేశము చెప్పిన కార్యదక్షుడు, ఉత్తమదూత, మహా పరాక్రమశాలి. సుగ్రీవరామలక్ష్మణుల జూడగనే "దృష్టా దేవి" యను రెండు మాటలాకసమునుండి దిగకమునుపే చెప్పి వారిని సంతోష భరితాంతరంగుల చేసెను.

హనుమంతుడు జరిగిన వృత్తాంతమంతయు చెప్పినమీ దట, రాముడు లంకయొక్క గుప్తవిధానమును, రావణుని బలపరాక్రమముల గురించియు ప్రశ్నించెను. లంకకు నాల్గు వైపుల నాలుగు పెద్దద్వారములు గలవనియు, ప్రాకారమునకు

వెలుపలనగాధమైనపరిఘ చుట్టూకలదనియూ, ఆ అగడ్తనుదా టుటకు నాల్గువైపుల వం తెనలుగలవనియు, ఆవం తెనలు యంత్ర సహాయమున నెత్తబడి, మరల నవసరమైనయెడల దింపబడున నియు, ప్రతిద్వారమును కోటిరాక్షసులు సాయుధపాణులై కాపలాకాచుచుండెదరనియు, దాదాపు 60కోట్ల రాక్షసబలము కలదనియు, అసంఖ్యాకమైన మూలబలముకలదనియు చెప్పెను. రావణుడు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్, ప్రహస్తుడు, మొదలైన వారందరు ఇంద్రాదిదేవతల నోడించిన మహావీరులనిచెప్పెను. శత్రుబలమంత గొప్పదైనను, మనము నిరుత్సాహపడ నవసరము లేదనియు, సముద్రము మనసేనదాటు మార్గమాలోచించవల యుననియు, అది దాటినయెడల మనము రాక్షసుల సులభముగా చంపవచ్చుననియు చెప్పెను. సీతను జూచివచ్చుటయేగాక, లంకను దగ్ధమొనరించి, రావణునిబలములో 8వవంతు నాశనము చేసి, లంకయొక్క గుప్తనిధానమును, శత్రువుల పరాక్రమ విశేషములను తెలిసికొని, రామునికంతయు దెలిపిన ఉత్తమ దూత, రాజనీతిజ్ఞుడు.

మారుతి రామాయణ యుద్ధములో నద్వితీయపరాక్ర మము జూపినాడు. ధూమ్రాక్షుడు, వజ్రదంష్ట్రుడు, అకంప నుడు, మొదలైన రాక్షసవీరుల బరిమార్చినాడు. రావణు నొక్కదెబ్బతో మూర్ఛనొందించినాడు. ఇంద్రజిత్ తన మాడవసారియుద్ధములో రామలక్ష్మణుల జయింపలేక చివరకు పశ్చిమద్వారముగుండా వెడలివచ్చి హనుమంతునితోయుద్ధము

చేయును. ఆరోజు హనుమంతుడుజూపిన పరాక్రమమద్వితీయము. ఇంద్రజిత్తుయొక్క సారథినిజంపి, హయములను గూల్చి, మేఘునాధుని విరథునిగాచేసి, శిలావర్షము కురిపించెను. వాడెన్ని శస్త్రాస్త్రములవేసినను జంకక వానితో నమోఘమైన యుద్ధమునుజేసెను. ఇంద్రజిత్తున కేమియు తోచక లంకలోపలికిబోయి, మాయపన్నాగమొగటి బన్నెను. మాయసీతను సృష్టించి, రథముమీద నామెనుబెట్టుకొని, హనుమంతు నెదుటకువచ్చి, ఆయన చూచుచుండగనే, మాయసీత శిరమును "హారామ, హారామ" యని యాక్రందించుచుండగా తన నిశితఖడ్గముచే ఖండించెను. అదిజూచి హనుమంతుడు శోకమోహపరితప్తుడై యుద్ధమును జాలించెను.

హనుమంతుడు, రామలక్ష్మణులకు, వానరసైన్యము నంతటికి, ప్రాణదాత. ఇంద్రజిత్ చేసిన రెండవయుద్ధములో రామలక్ష్మణులు మూర్ఛనొందిరి. ఇంద్రజిత్ అపారమైన పరాక్రమము చూపి 67 కోట్ల వానరసైన్యమును బరిమార్చెను. సుగ్రీవ, అంగదప్రముఖులు నిశ్చేతనులై బడిపోయిరి. అదిగాఢమైన నిశీథసమయము. మృత్యుదేవత భీకరతాండవముచేయుచుండెను. కాగడాలుపట్టుకొని ప్రతికియున్నవారికొరకు విభీషణుడు హనుమంతుడు వెదకుచుండిరి. ఒకచోట హీనస్వరముతో మూల్గుచు, బాణములు నేత్రములలోగ్రుచ్చుకొనుటచే దృష్టి గూడసరిగాలేక బాధపడుచున్న జాంబవంతుని జూచిరి. విభీష

ణుము పలుకరించగా నతనినిగు ర్తించి అతనితో జాంజవంతుడీ క్రిందివిధముగా బలికెను. "ఆంజనా దేవి సుపుత్రుడైన హాను మంతుడు బ్రదికియున్నాడుగదా? యని బ్రశ్నించెను. దాని కాశ్చర్యముచెంది విభీషణుడు, "సుగ్రీవరామలక్ష్మణుల సేమ మరయక నీవిధముగా బ్రశ్నించుచున్నావేమని" యడిగెను. అప్పుడు జాంబవంతుడు చెప్పిన సమాధానమద్వితీయము. హాను మంతుడొకడు బ్రతికియుండిన మిగతావారందరు విగతప్రాణు లైనను, జీవించినట్లే. హానుమంతుడే బ్రాణములబాసిన మనము జీవించియున్నను మృతతుల్యులమేయని గట్టిగాచెప్పెను. అప్పుడు హానుమంతుడు "తాతా! నేనుబ్రదికియుంటి" ననిచెప్పెను. అప్పుడు పరమానందభరితుడై, ఆంజనేయుని కౌగలించుకొని కైలాసపర్వతపరిసరము లలోనున్న సంజీవపర్వతము మీదనున్న జీవనౌషధులతీసికొనివచ్చి అందరిని బ్రదికించమనిప్రార్థించెను. ఆప్రకారము వెంబడే వాయువేగమునబోయి, ఔషధులు గన బడక పోవుటచే సంజీవపర్వతమునే బెకలించి, సూర్యోదయము లోపల లంకకుదీసికొనివచ్చి, రామలక్ష్మణులను, సమస్తవానర సేనను, బ్రతికించినప్రాణదాత. రావణునిశక్తిచే నిశ్చేతనుడైన లక్ష్మణుని రెండవసారి సంజీవపర్వతముదెచ్చి బ్రతికించిన మహాను భావుడు. అందువలన రామునిజయమునకు మూలస్తంభము హానుమంతుడేయనిచెప్పకతప్పదు. గనుకనే శ్రీరామచంద్రు డుత్తరకాండలో ఋషులతోబ్రసంగించు సమయమున నీక్రింది విధముగా హానుమంతుని బొగడినాడు.

ఏతస్యబాహువీర్యేణ లంకా సీతా చలక్ష్మణ!
ప్రాప్తామయా, జయశ్చైవరాజ్యం మిత్రాణి బాంధవాః
హనుమన్యదిమేనస్యాత్ వానరాధిపతేః సఖా
ప్రవృత్తిమపి కోవేత్తుం జానక్యాః శక్తిమాన్భవేత్.

"సీతను, రాజ్యమును, లక్ష్మణుని, లంకాజయమును, మిత్రులను, బాంధవులను, యీతని సహాయముపలననే బొంద గలిగితిని. హనుమంతుడేలేనియెడల సీతజాడ నెవరుతెలిసి కొన గలుగుదురు?" అని రాముడు బల్కెను. ఇందులోన అతిశయమేమి యులేదు. సీతకూడా యీసంగతి గుర్తెరింగినది గనుకనే, తన కృతజ్ఞత వెల్లడించుటకు, శ్రీరామపట్టాభిషేక సమయమందు, రాముడు తనకిచ్చిన ముక్తామణిహారమును ప్రీతితో హనుమం తుని కంఠమునవైచెను. ఇక్కడ నొకవిశేషమున్నది. రాముడు తనకిచ్చిన ముక్తామణిహారమును సీత, వాయుసూనుని కొసగు ముందు, వానరులవంకను, భర్తవంకను మాటిమాటికిజూచెను. రాముడామె యభిప్రాయమును గనిపెట్టి యీ ప్రకారవిధముగా ప్రేమతో మాట్లాడెను.

ప్రదేహి సుభగేదేవి! యస్యతుష్టా సిభామిని
పౌరుషం, విక్రమో, బుద్ధి ర్యస్మిన్నేతాని సర్వశః

"పౌరుషము, విక్రమము, బుద్ధి, మొదలగు సుగుణము లేమహామహుని యందుగలవో, ఎవనియందు నీకు ప్రీతిగ లదో" వానికా హారము నివ్వమని రాముడుచెప్పెను. వెం

బడే, యా మె వా యుపుత్రుని కంఠమున నా హా రముంచినిదట. దీనివలన సీతా రాములకెంత ప్రేమాస్పదుడో హానుమంతుడు తెలియుచున్నది.

హానుమంతుడు రామసేవా దురంధరుడు, రామభ క్తా గ్రేసరుడు. రామసంకీ ర్తన జరుగుచోట నిప్పటికి, చిరంజీవి గనుక, అదృశ్యరూపములో నుండునని వాల్మీకి వర్ణించినాడు.

యు।తయత్ర రఘునాథ కీ ర్తనమ్ ।
తత్రతత్ర కృతమ స్తకాంజలిమ్ ॥
బాష్పవారి పరిపూర్ణలోచనమ్ ।
మారుతింనమత రాక్ష సాంతకమ్ ।

"శిరసాంజలి ఘటియించి, ఆనంద బాష్పపూరితనయనుడై, అదృశ్యరూపములో, రామసంకీ ర్తన జరుగుచోట కుప్పిగంతులు వైచుచుండునట ! అదియే ఆయన శ్రీరామ చంద్రుని గోరినవరమట ! చూచితిరా ! పవనాత్మజుని రామ భ క్తి. మరియొక విశేషమేమనిన, రామభ క్తులలో ఆయన కొక్కనికే పూజార్హత్వము లభించినది. అందుకనే ఆయన పేర అన్నిచోట్ల దేవాలయములు, మందిరములు వెలసినవి. తన ఉపాసనాబలముచేత భవిష్యద్బ్రహ్మత్వము సంపాదించిన మహానుభావుడు.

విశ్వామిత్రుడు

వాల్మీకిరామాయణములో విశ్వామిత్రు డాకస్మిక ముగా ప్రవేశించును. మరలనంత నాకస్మికముగా నిష్క్రమిం చును. నిర్గమనానంతరము మరల రామాయణగాథలో నెక్కడ ప్రవేశించినట్లుగనబడదు. ఉత్తరరామాయణములోమాత్రము ఋషులందరితోపాటు విశ్వామిత్రుడుగూడ రాముని సంద ర్శించినట్లు చెప్పబడియున్నది. కాని, అసలురామాయణములో మాత్రము నాతనిప్రస క్తిరాదు. దీనినిబట్టిచూడ, సీతారాముల కళ్యాణము చేయించుటయే నాతని ముఖ్యోద్దేశ్యముగా గన బడుచున్నది. తద్వారా, రావణవధకు నాందివేసిన మహాను భావుడు.

విశ్వామిత్రుడు బ్రహ్మర్షి. తపోబలశాలి. దుర్నిరీక్ష ణుడు. సహజముగా కోపస్వభావము గలవాడు. దశరథునికడ కొక కోరికతోవచ్చెను. కాని కార్యార్థికుండవలసిన వినయము గనబడదు. ద్వారపాలకునితో "శీఘ్రమాఖ్యాహిమాంప్రా ప్తం కౌశికంగాధినఃసుతమ్" దశరథునితో "త్వరగా చెప్పుము. గాధి సుతుడైన కౌశికుడగు నేనువచ్చితినని" యాదేశించును. దశ రథుడు, వశిష్టుడు, అమాత్యులతోసహా నందరు సంభ్రాంతమన సులై ప్రత్యుద్గమించి, యుచితాసనమిచ్చి షోడశోపచార పూజలుచేసి సత్కరింతురు. క్షత్రియుడు, సక్రమముగా రాజ

ర్షిత్వము, బ్రహ్మర్షిత్వము, సంపాదించిన మహానుభావుడగు టచే సాభిమానగౌరవములతో దశరథుడు విశ్వామిత్రునాదరించి, ఆతనికోర్కె ఏదైననుసరే, తప్పకతీర్చెదనని ముందుగానే అతనికి వాగ్దానముచేయును. అదివిని సంతోషభరితాంతరంగుడై తనువచ్చిన కారణమువిషయమై దశరథునితో చెప్పను. మారీచసుబాహులను రాక్షసులు (రావణానుచరులు) తనయజ్ఞమునకు విఘ్నములు కలిగించుచున్నారనియు తనొకయాగము చేయనుంటిననియు, ఆయాగరక్షణార్థము రాముని, లక్ష్మణునితో, సహాబంపమని కోరెను.

దశగధుడు ప్రథమమున నొప్పుకొనడు. అప్పుడు సర్వజ్ఞుడైన విశ్వామిత్రుడు చెప్పినవాక్యములు. "మహాత్ముడైన రాముడెవడో నాకు తెలుసును వశిష్టమహర్షికి తెలుసును. ఇక్కడ సభలోయున్న మునులందరికి తెలుసును" అని నర్మగర్భముగా, గంభీరముగా మాట్లాడెను. దీనినిబట్టిచూడ రాముడు విష్ణువనినసంగతి ఆతనికి తెలిసినట్లు వ్యక్తమగుచున్నది. రావణవధవరకు ఈసంగతి దేవరహస్యముగా దాచిపెట్టవలయును. లేనిచో రావణుడు చావడు. ఈసంగతి రాముని పాత్రవర్ణనములో విశదముగా చర్చించబడినది. ఇంకా యీ క్రిందివిధముగా దశరథునితో చెప్పుచున్నాడు. రాముని బంపుటవలన మూడులోకములలో నీకు కీర్తివచ్చును. నీవుయజ్ఞమును ధర్మలాభము బొందదలచినయెడల నావెంట బంపుము"

అని గట్టిగా చెప్పుచున్నాడు. దీనివలన రాముని చే భవిష్యత్ లో మహాకార్యములు జరుగబోవునని సూచించుచున్నాడు. అదియునుగాక రాముని బంపుటవలన నతనికి (శేయస్సు, శుభము కలుగుననిగూడ చెప్పుచున్నాడు. (దీనివలన రాబోవు సీతా కళ్యాణము సూచనప్రాయముగా తెలియచేయుచున్నాడని వ్యక్తమగుచున్నది. అదియునుగాక వశిష్టుడుగూడ అనుమతి నిచ్చిన మీదటనే రామలక్ష్మణులను బంపమని కోరుచున్నాడు. వశిష్టుడుగూడ రాముని బంపమని సలహానిచ్చుచున్నాడు. ఇక్ష్వాకురాజులలో నింతవరకు నాడినమాట తప్పినవారెవ్వరు లేరనియు, విశ్వామిత్రునికి వాగ్దానముచేసి వెనుకాడుట ధర్మ ముకాదనియు, మహాపాపమనియు, విశ్వామిత్ర రక్షణలోనున్న రామున కేమియు (బమాదము లేదనియుగూడ చెప్పుచున్నాడు. "అగ్నిచే కాపాడబడిన అమృతమువలె, విశ్వామిత్రుని రక్ష ణలోనున్న రామున కేమియు (బమాదము లేదనియు, అస్త్ర విద్యలో నిపుణుడైనను, కాకపోయినను, రాముని రాక్షసము లేమియు చేయలేరని, వశిష్టుడుచెప్పుచున్నాడు. అదియునుగాక రాక్షసుల నిగ్రహించుశక్తి విశ్వామిత్రునికి లేకపోలేదనియు, యాచించుచున్నాడనియు, వశిష్టుడుచెప్పెను. ఆమాటలు విని నతర్వాతదశరథుడు రామలక్ష్మణుల నాశీర్వదించి బంపును.

ముఖ్యముగా విశామిత్రుని జీవితమున (మనము నేర్చుకొన వలసిన విషయ మొకటియున్నది. పురుషప్రయత్నమువలన నెం తటికార్యమునైనను మానవుడు సాధించగలడనుటకు విశ్వా

మిత్రుని జీవిత మే తా రా ర్థ ము. వశిష్టునితో యుద్ధమునకో టమి
బొందినవా డై క్ష త్రి యబలము నిరర్థక మనియు బ్రహ్మబల మే బల
మనియు తెలిసికొనినవా డై ఘో రతప మొనరించి బ్రహ్మర్షి
త్వమును సంపాదించినసమర్థుడు. ఈసందర్భమున విశ్వామిత్రుని
వాక్యములు గణనీయములు. "ఛీ! క్ష త్రి యబల మెందులకు ?
బ్రహ్మబల మే బలము. వశిష్టుని బ్రహ్మదండముచే నాసర్వాస్త్ర
ములు కుంటువడినవి" అని రా జ్యము మంత్రులకొప్పగించి, తను
బ్రహ్మర్షి త్వము సంపాదించుటకై ఘో రతప మొనరించి, ఎన్ని
విఘ్నములువచ్చినను లెక్కసేయక, బ్రహ్మ తనకువరుసగా బుషి,
రా జర్షి, మహర్షి త్వముల ప్రసాదించినను సరకుగొనక, తుదకు
బ్రహ్మ దేవుని మెప్పించి బ్రహ్మర్షి త్వము బొం దినధీరుడు. చివరకు
వశిష్టుడు స్వయముగావచ్చి నీవు బ్రహ్మర్షి వై తివని యభినందన
చేసినతర్వాతనే తపము విరమించెను. పురుషప్రయత్నమువలన
సృష్టికిప్రతిసృష్టిచేసిన అపరబ్రహ్మ. త్రిశంకునకు సశరీరస్వర్గ
ప్రా ప్తి కలుగచేసినాడు. అమోఘతప మొనర్చి, ఎన్నివిఘ్న
ములువచ్చినను వాటినిజయించి చివరకు బ్రహ్మత్వము సంపా
దించినధీరుడు. కనుకనే పరమేశ్వరునిచేత శిష్యునిగాసేవ
చేయించుకొని, ఆయనకళ్యాణము స్వయముగాచేయించు
భాగ్యమతనికేయబ్బినది.

యాగసంరక్షణసమయములో మారీచసుబాహులు
వచ్చినప్పుడు రాముడు సుబాహునిజంపును. మానవాస్త్ర

ప్రయోగముచే మారీచుని సముద్రములో బడవేయును. మారీచుడు మరణించినయెడల రామాయణమే లేదు. మారీచుడు చావకుండా బ్రతుకుట దైవనిర్ణయమే.

యాగమైనపిదప మిథిలకు పోనిపోయి, రాముని చే నహల్యా శాపవిమోచనము చేయించి, శివధనుర్భంగము చేయించి, సీతా కళ్యాణము జరిపించిన మహనీయుడు. కళ్యాణమయినరాత్రే, పెళ్ళివారు మిథిలనుంచి బయలుదేరకమునుపే, విశ్వామిత్రుడు నిర్ణమించును. మరలనాతనిబ్రస్తకిరాదు. దీనివలన సీతాకళ్యాణముచేయించుటకే దశరథునికడకు విశ్వామిత్రుడు వచ్చినాడనియు, యాగరక్షణమనునది యొకనెపమనియు, సీతాకళ్యాణముద్వారా రావణవధకు నాందికల్పము జరిపించిన మహనీయుడని నిస్సందేహముగా తేలుచున్నది.

సుగ్రీవుడు

సుగ్రీవుడు సూర్యాంశసంభూతుడు. వాలిసోదరుడు. నిజమైనమిత్రుడు. మహావీరుడు. సాహసి. వాలితర్వాత వానరులకు రాజయ్యెను. హనుమంతుడు రామలక్ష్మణులను బుజముమీద నెక్కించుకొని ఋశ్యమూకపర్వతముమీదనున్న సుగ్రీవునివద్దకువచ్చెను. రాముడు రాజ్యమునుత్యజించి, తనభార్యను

రావణుడెత్తుకొనిపోవుటచే, సుగ్రీవుని సహాయమపేక్షించుటకై వచ్చెను. సుగ్రీవుడు తనభార్యనుపోగొట్టుకొని, వాలిచే రాజ్యమునుండి వెడలగొట్టబడినవాడై ఋష్యమూకపర్వతము మీద తననలుగురు అనుచరులతో తిరుగుచుండెను. ఇద్దరు సమానశోకములోనుండి, పరస్పరసహాయమపేక్షించుచుండిరి గాన, కరసంచాలన మొనరించుకొని, అగ్నిసాక్షిగా, లక్ష్మణపవనాత్మజులసన్నిధిలో మిత్రతవీర్పరుచుకొనిరి, రాముడు వాలిని ఒక్క బాణముతోనేచంపి, సుగ్రీవుని రాజుగాచేసెదనని ప్రతిజ్ఞ చేసెను. "రసాతలమునందుండనీ, నభస్థలమునందుండనీ, ఎక్కడవున్నను వెదకి సీతయునికి తెలుసుకొని నీకు తెలియచేయుదు"నని సుగ్రీవుడు శపథముచేసెను. ఈవిధముగా నొకరి కొకరు సహాయముచేసికొనెదమని దృఢప్రతిజ్ఞలు చేసుకొనిరి. సుగ్రీవరామప్రణయప్రసంగసమయమున ముగ్గురి వామనేత్రము లదరినవని వాల్మీకి ముచ్చటగా వర్ణించినాడు.

సీతాకపీంద్రక్షణదాచరాణాం రాజీవహేమోజ్వలనోపమాని।
సుగ్రీవరామప్రణయప్రసంగే వామాని నేత్రాణిసమంస్ఫురంతి।

వాలికి, రావణునకు, సీతకు, ఆసమయమున వామనేత్రములు (పింగళ, రక్త, రాజీవనయనములు) అదరినవని వాల్మీకి ప్రవాసినాడు. అనగా సీతకు శుభశకునము, వాలికి రావణునకు అశుభశకునములు.

సుగ్రీవుడు నిజమైనమిత్రుడు, కృతజ్ఞుడు. ప్రథమమున

సుఖలంపటుడై తనకర్తవ్యము మరచినను, వెంబడే తనతప్పు తెలిసికొని నలుదిక్కులకు వానరవీరుల సీతాన్వేషణమునకై బంపెను. దక్షిణదిక్కుకుబోయిన హనుమదాది మహావీరులు దక్కతకిక్కునదిక్కులకు వెళ్ళినవారందరు సీతజాడ తెలియులే దని వచ్చిరి. కాలాతిక్రమణమైనను, దక్షిణదిక్కుకు వెళ్ళిన హనుమంతుడు సీతజాడ తెలిసికొని రామసుగ్రీవుల కామెసందేశము తెలియచేసెను. నిజమైనమిత్రుడు గనుకనే తనుచేసిన వాగ్దానముప్రకారము సీతయునికి రామునికి దెలియచేసెను. కృతజ్ఞుడు గనుకనే రామునికి 60కోట్ల వానరబలముతో అచింత్యమైన సహాయముచేసి, రాక్షసవీరుల ననేకులచంపెను.

సుగ్రీవుడు మహాబలపరాక్రముడు. సాహాసప్రియుడు. రామాయణయుద్ధము మరునాడు ప్రారంభమగుననగా, ఆరోజు రాత్రి (ఫాల్గుణశుద్ధ పౌర్ణమినాటిరాత్రి) రాముడు, సుగ్రీవుడు, లక్ష్మణుడు, మొదలగు వారందరు సువేలాద్రి నధిరోహించి, ఎదురుగానున్న త్రికూటాద్రిమీద వెలుగుచున్న లంకాపట్టణమును విస్మయముతో నిరీక్షించుచుండిరి. రావణుడదే సమయమున రాజసభలో తనమంత్రులతో యుద్ధవిషయముల నాలోచించుచుండెను, రావణునిజూడగనే కోపమునాపుకొనలేక, రామునితోనైనను చెప్పకుండగనే, వెంబడే రావణుడు సభ చేయుచున్న ప్రాసాదముమీదికి దూకి, అతనితో ద్వంద్వ యుద్ధమున కుపక్రమించిన మహాసాహసి. వారి ద్వంద్వయుద్ధ

ముజూచి సుగ్రీవునకేమి యపకారము జరుగునోయని రాముడు భయపడుచుండెను. కొంతసేపటికి రావణునికిరీటము నేలదన్ని వానికిచిక్కకుండ తిరిగి రామునివద్దకు వచ్చిచ్రావాలెను. రాముడు సుగ్రీవుని కాగలించుకొని రాజైనతను ఇటువంటి సాహసకృత్యము లెన్నటికిని చేయరాదని మందలించెను.

మహాబలుడైన కుంభకర్ణునితో విచిత్రలాఘవముతో యుద్ధముచేసి అతనిమెప్పువడసెను. చివరకు కుంభకర్ణుని శూల ప్రహారముచే మూర్ఛనొందెను. మూర్ఛనొందిన తనశత్రు రాజగు సుగ్రీవుని తనఅగ్రజునకు కానుకగా సమర్పించుటకై తనభుజముమీదపెట్టుకొని లంకప్రవేశించి రాజమార్గమున రావణునిగృహమునకు బోవుచుండెను. ప్రజలందరు తమసౌధములనుంచి కుంభకర్ణునిమీదపుష్పవృష్టిగురిపించి, చందనసుగంధతోయములుచల్లిరి. ఆ శీతోపచారములకు సుగ్రీవునికి తెలివి వచ్చెను. తనపరిస్థితి వెంబడే గ్రహించినవాడై, కుంభకర్ణుని ముక్కు, చెవులు కొరికి, వీపుచీల్చి, ఒక తన్నుతన్ని మరల రామునివద్దకు వచ్చెను. ఈవిధముగా సాహసకృత్యములతోగూడిన యుద్ధములుచేసి, రాక్షసవీరులజంపి, రామునికి సహాయముచేసి తనకృతజ్ఞత వెలిబుచ్చిన మహావీరుడు, వానరులకు రాజు.

వాలి

వాలిసుకేంద్రాంశ సంభూతుడు.

శూరశ్చ శూరమానీచ ప్రఖ్యాతబలపౌరుషః
బలవాన్ వానరో వాలీ సంయుగేష్వపరాజితః.

శూరుడు, ప్రఖ్యాతబలపౌరుషుడు, బలవంతుడు యుద్ధములో వెనుదీయని మహావీరుడని, వాల్మీకి వాలినివర్ణించినాడు. "శూరమాని" అనుటలో వాలికి స్వాభిమానము, అహంకారము ఉన్నటుల గోచరమగుచున్నది. తనవీపుచూపించకుండా ధర్మమార్గమున సుగ్రీవునితో యుద్ధము జేయుచు, రామునియందధర్మ నిరూపణావకాశము గల్పించి రామబాణముచే మరణమొందిన మహావీరుడు. రావణునంతటి జగద్వీరుని తనచంకనబెట్టుకొని నాల్గుసముద్రములలోముంచి క్షమార్పణ కోరినపిదప నతనివదలివేసిన ఏకైకవీరుడు. వాలినిబ్రశంసాపాత్రునిగాను, వీరునిగాను వాల్మీకి వర్ణించినాడు.

వాలినుడివిన పరుషవాక్యములుగూడ "ప్రశ్నితమ్" "ధర్మసంహితమ్"అని వాల్మీకి వర్ణించినాడు. వాలివాక్యములు బ్రశంసనీయములు. రామునియందధర్మారోపణచేయుట తప్పుగాదేమో యనునటుల మాటలాడినాడు. కులీనుడు, సత్వసంపన్నుడు, సానుక్రోశుడు, మహావీరుడునైనరాముడు చెట్టుచా

టుననుండి, ఇంకొకనితో బోరుచున్నతనను బాణమువేసి జంపుట ధర్మముగాదని రామునినిందించెను. తనువనమూలా దులభుజించు శాఖామృగము. తనకు రామునికి ఏవిధమైన వైర ముశేదు. నిర్వైరముగా వధించుట ధర్మముగాదు. ఇటువంటి వాడు దశరథునికి బుట్టదగినవాడు కాడని పరుషవాక్యములా డెను. మీదుమిక్కిలి తనమాంసము భక్షణీయముగాదు. వేటలోనైనను కొతినిచంపుట మహాపాతకము. ఏవిధమున జూచినను, అందులో నధర్మమార్గమున చెట్టుచాటునుండి చంపుట ఎంతమాత్రము న్యాయము, ధర్మసంమతముగ దని నుడివెను.

ధర్మార్థగుణసంపన్నుడు, ఉత్తముడు, హరీశ్వరుడైన వాలిని అధిక్షేపించుచు రాము డీక్రింది విధముగాబల్కెను.

నీవధర్మమార్గ ప్రవర్తకుడవు. నీకు సుగ్రీవుడు కుమా రుని వంటివాడు. అతనునిర్దోషి. చేసినపొరపాటుకు పశ్చాత్త ప్తుడై నీవు మాయావినివధించిరాగానే రాజ్యము నీకిచ్చి క్షమించమని వేడుకొనెను. అటువంటి వానినిక్షమించకపోగా, బాధపెట్టి రాజ్యమునుంచి వెడలగొట్టితివి. మీదుమిక్కిలి స్నుషతో సమానురాలైన నతని భార్యయగు రుమను బలా త్కారముగా చేరదీసితివి. భరతుడీదేశమునకంతయు రాజు. అతని ప్రతినిధిగా నేను దండకారణ్యమునకు వచ్చితిని రాజు కెవ్వరేమి అపకారముచేయకపోయినను, శిష్టరక్షణము దుష్ట

శిక్షణము అతనికర్తవ్యము. నీవు చారిత్రదూషకుడవు. అందు వలన నేను నిన్ను వధింపవలసివచ్చినది.

కోడలుగా చూడవలశిన తమ్ముని భార్యను, తమ్ముని వెళ్ళగొట్టి బలాత్కారముగా దగ్గరకు చేరదీసినావు. నీవుదండనార్హుడవు. అందువలన శిక్షించితిని. అదియునుగాక రాజులు మృగములను, మాంసముకోసము, క్రీడార్థము వేటాడుదురు. పరుగెత్తుచున్నను నిలుచున్నను మృగముల, వేటలో, రాజు లెటువైపునుంచి అయినాసరే బాణము వేసికొట్టుట రాజ ధర్మము. "అయుధ్యం ప్రతియుధ్యంవా తస్మాచ్ఛాఖామృగో హ్యసి" యుద్ధముచేయకున్నను, ఇంకొకరితో యుద్ధముచేయు చున్నను, నీవు శాఖామృగమవు. మృగముల వేటలో చెట్టుచా టునుండి కొట్టుట నధర్మముగాదు. అదియునుగాక ఋష్యమూకవానగ సన్నిధిలో నేనిదివరకే నిన్ను ఒకేబాణముతో వధించెదనని ప్రతిజ్ఞచేసితిని. ఆప్రతిజ్ఞ నిర్వహించుటకే నిన్నువధించవలసి వచ్చినది." వాలితో నెదురుగా బోరినఎడల నొకేబాణముతో చంపుట దుర్లభముగావచ్చును. అందుకని ప్రతిజ్ఞనిర్వహించు కొనుటకొఱకై బవళ్ళు రాముడుచెట్టుచాటునుండి బాణము విడువవలసివచ్చినది.

రాముని సమాధానము విన్నతదుపరి వాలిపశ్చాత్తప్తుడై రామునికి నమస్కరించి, సుగ్రీవునాదరించి, అంగదుని యువరాజుగాచేయమని రాముని ప్రార్థించును. అది ధర్మము

గనుక రాముడావిధముగా వాగ్దానముచేసి సుగ్రీవుని పట్టాభిషేకసమయమున, అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేయించెను. మరణాసన్నుడైనవాలి సుగ్రీవుని కౌగలించుకొని, తన కంఠమునన్నున్న కాంచనమాల నతని మెడలోవైచి, తారను, అంగదుని, జాగ్రతతో చూడమనిచెప్పి రాముసికి నమస్కరించి తన ప్రాణముల విడచెను. ఈవిధముగా ప్రశస్తమైన వానరవీరుడు మరణించెను.

రావణుడు

బ్రహ్మదేవుని మనుమడైన విశ్రవసబ్రహ్మకు, కైకసియను రాక్షసికి రావణుడు జన్మించెను. కైకసియను రాక్షసికన్య, తండ్రియాజ్ఞానుసారము సంతానార్థియై విశ్రవసబ్రహ్మకడకేగెను. ఆమెచేరిన సమయము దారుణ సంధ్యాసమయమగుటచే నామెకు దుర్నిర్గులు, భయంకరులు బుట్టుదురని విశ్రవసబ్రహ్మ నుడివెను. కాని, యామె సత్సంతానము కావలెనని కోరగా చివరకు బుట్టువాడు పరమధార్మికోత్తముడగునని యాశీర్వదించెను. ఆప్రకారము వరుసగా రావణ, కుంభకర్ణ శూర్పణఖ, విభీషణలు జన్మించినారు.

అరణ్యకాండలో ఖరదూషణాది వధానంతరము అకంపనుడను రాక్షసుడు రావణునకు ఖరదూషణాది రాక్షసులవధ

తెలియుచేయుటకై లంకకు వెళ్ళును. అప్పుడు రావణుడు రాజ్య సభ చేయుచుండును. ఈసర్గలోనే వాల్మీకి రావణుని ప్రప్రథమముగా రామాయణగాథలో ప్రవేశబెట్టును. దాదాపు ఆసర్గ పూర్తిగా రావణుని వర్ణనకై వినియోగింపబడును. రావణుని దుర్గుణములేకాక, సుగుణములుకూడ వాల్మీకి వర్ణించినాడు. బ్రహ్మతేజోవిశిష్టుడు, దీప్తపావకసంకాశుడు. అనేకయుద్ధములలో ఇంద్రోపేంద్ర మహేంద్రాది దేవతలతో యుద్ధముచేసి జయించినవీరుడని వర్ణించినాడు. వెంబడే, "యజ్ఞవిఘ్నకరుడు, బ్రహ్మఘ్నుడు, క్రూరుడు, కర్కశుడు, నిరనుక్రోశుడు, పరదారాభిమర్శనుడు, సాధుసజ్జన సంతాపకుడు, అనిగూడ వర్ణించినాడు. శ్రీరామచంద్రుడు, ఆంజనేయులు, యుద్ధభూమిలో ప్రథమమున రావణుని తేజోరూపములజూచి దిగ్భ్రమచెందిరి. వారిద్దరు ప్రథమమున రావణుని జూచినప్పుడు చెప్పినమాటలీ క్రింద పొందుపరచుచున్నాను. శ్రీరామచంద్రుడు యుద్ధభూమిలో మొదటిసారి రావణుని జూచినప్పుడు ఈవిధముగా బల్కినాడు. ఏమితేజము ! ఏమికాంతి ! సహస్రకిరణుడగు నాదిత్యునిమాదిరి దుర్నిరీక్ష్యుడుగా వెలుగుచున్నాడు. దేవదానవీరులలోగూడ నింతశరీర కాంతిగలిగిన వారెవ్వరులేరని వచించెను. ఆంజనేయులు లంకలో రాజసభలో రావణుని జూచినప్పుడు చెప్పినమాటలు, ఏమిరూపము ! ఏమితేజస్సు ! ఏమిసత్వము ! ఏమిధృతి సర్వలక్షణములున్నవని మిగ్ధుడయ్యెను. వీనిలో నధర్మమే లేనియెడల, వీనినెవ్వరు జయించలేరనిగూడ

చెప్పెను. వీనిలో నధర్మము, పరాదారాభిమర్శనము, వున్నవి గాన తప్పక రాముడు వీనిని వధించగలడని ధైర్యము హాను మంతునికి గలిగినది. ఎంతతపోబల సంపన్నుడైనను, పరదా రాభిమర్శనము, వరదానగర్వాంధత, దురహంకారము, అధర్మ మార్గాచరణము, సాధుసజ్జనహింస మొదలగు దోషములేనతని మృత్యువునకు కారణములైనవి. ప్రథమమున అకంపనుడు ఖర దూషణాది రాక్షసవధ వృత్తాంతమంతయు చెప్పి మొరబెట్టు కొనును. రావణుడు క్రోధావిష్టుడై తనసోదరులను వారి యను చరులనుజంపిన దుష్టుడెవడనియు, అతనికి తనసంగతి బాగుగ తెలియదనియు, తనుకాలునకు కాలుడననియు, మృత్యుదేవ తకు మృత్యువుననియు ప్రగల్భములాడెను. కానిరాముడు మహాబలపరాక్రముడనియు, అతని జయించుట దుర్లభమ నియు, ఆయనభార్య త్రిలోకసుందరియనియు, ఆమె నపహరిం చిన తదుపరి రాముని సులభముగా జయించవచ్చుననియు అకంపనుడు చెప్పెను.

రావణుడు దుష్టుడైనను ధర్మాధర్మవిచక్షణ, యుక్తా యుక్తవివేకము లేనివాడుకాడు. అకంపనుని సలహాప్రకారము సీతాపహరణము చేయదలచినాడు. తనుఒక్కడే మారీచుని ఆశ్రమమునకుపోయి సీతాపహరణ ప్రయత్నములో తనకు సహాయము చేయవలసినదిగా కోరెను. దానికి మారీచుడు రామునిపరాక్రమము తనకు దెలుసుననియు, యీసలహా యిచ్చినవాడు తనకు మిత్రరూపములోనున్న శత్రువనియు,

ఇక నాప్రయత్నము విరమించమనియు ప్రార్థించెను. యుక్తాయుక్తవివేకము గలవాడుగనుక, సీతాపహరణప్రయత్న మప్పటికిమానిని, తిరిగి లంకకువచ్చెను. రావణుడు క్రోధావిష్టుడై రెండుసార్లు సీతను వధింపబోయెను. మొదటిసారి అశోకవనికలో సీత పరుషవాక్యము లాడినమీదట నామెను జంపబోయెను. అప్పుడు తనభార్యలలో నొకతెయగు ధాన్యమాలిని అడ్డుతగిలి సీతనుజంపుట ధర్మముగాదనియు తనకోపము రాము నిమీద జూపమనియు జెప్పి నివారించెను. ధర్మము తెలిసిన వాడు గనుక స్త్రీహత్య కొడిగట్టలేదు. రెండవసారి, ఇంద్రజిద్వధానంతరము అపారమైన బుత్రశోకము క్రోధముగామారి వెంబడే సీతను వధింపబోవును క్రోధావిష్టుడైన రావణునిజూచిన వారందరు సీతజచ్చునని భయపడుచుండిరి. అప్పుడు సుపార్శ్వుడను సేనాధిపతి స్త్రీవధ ఎంతమాత్రము బనికిరాదనియు, "వేదవిద్యావ్రతస్నాతుడగు తనబోటివార లీపనిచేయగూడదనియు, రాముని జంపి తనకోపాగ్ని శమింపచేసికొనుట వీరోచిత ధర్మమనియు, చెప్పెను." ధర్మాధర్మవిచక్షణ గలవాడు గనుకనే సీతను జంపుటమాని యుద్ధభూమికి వెడలెను.

హనుమంతుని హితోపదేశము వినినతర్వాత కోపావేశముతో నాతనిజంపుమని రావణుడు రాక్షసుల కాజ్ఞాపించెను. కాని తన కనిష్టసోదరుడైన విభీషణుడు వెంటనేలేచి హనుమంతుడు దూతగా వచ్చెననియు దూతనుజంపుట ధర్మముగాద

నియు, తగినవిధముగా దండనముచేసి బంపమనియుకోరెను, ధర్మము తెలిసినవాడు గనుకనే ఈక్రిందివిధముగా విభీషణు నకు సమాధానము చెప్పుచున్నాడు. "నీవుచెప్పినది యుక్త ముగానే యున్నది. దూతవధగర్హితము. కోతులకు తోక యనిన యిష్టము. గాన హనుమంతుని తోకకు నిప్పంటించి వదలివేయుడ"ని యాజ్ఞాపించెను.

సీతాపహరణ ప్రయత్నము మానిన రావణునికి, మరల తనసోదరియగు శూర్పణఖవచ్చి బురికొల్పును. తనకుజరిగిన పరాభవము, ఖరదూషణాది రాక్షసవధయుచెప్పి కామభోగ ములలో, స్వైరవిహారములుచేయుచు తనకుజరిగిన యాపద, జరుగబోవు ప్రమాదము గుర్తించలేక యుంటివని దూషిం చును. గ్రామ్యభోగముల యుందాసక్తుడైన నృపతిని స్మశా నాగ్ని మాదిరిగా అగౌరవముతోను, అసహ్యముతోను ప్రజలు జూతురని నిందించును. రామునిపరాక్రమ మప్రమేయమనియు, ఖరదూషణ త్రిశిరసులను, వారి యనుచరులను 14000 మంది రాక్షసుల నత్యధికముహూర్తములో నొక్కడేపదాతిగా యుద్ధముచేసి నిర్మూలనమొనర్చెనని చెప్పును. రాము నెవ్వరు ప్రత్యక్షయుద్ధములో జయించలేరనియు, త్రిలోకసుందరియగు సీతనపహరించి తీసికొనివచ్చిన యెడల శోకసంతప్తుడై రాముడు మరణించుననియు, అధవాజీవించి యుండినయెడల శోకమగ్నుడైన రాముని జంపుట దుర్లభముగాదనియు నచ్చ

జెప్పి సీతాపహరణమునకు మరల రావణుని ప్రోద్బలము జేసెను.

రెండవసారి దశగ్రీవుడు మారీచునివద్దకుబోయి, మాయ లేడిరూపము ధరించి సీతాపహరణములో తనకుసహాయము చేయుమని కోరును రాముడు నిరుపమపరాక్రమశాలి యనియు, తనకు స్వానుభవముగలదనియు, రామునితోవైరము కృష్ణ సర్పముతోచెరలాటయనియు, సీతయతనిపాలిటి కాలమృత్యు వనియు, కొలదికాలము తను రాక్షసులు ప్రబుకదలచినయెడల నీదుప్రయత్నమును విరమించమని పలువిధముల బోధించెను. కాని రావణుడుకోపోద్రేకుడై తనమాట వినినియెడల వధించెదననిఖడ్గమెత్తెను. రాముడీసారితనను తప్పకవధించు ననియు, రావణునికిగూడా రామునిచే మరణముతప్పదనియు, మరణమాసన్నమైనబురుషుడు సుహృదుల వాక్యములు చెవిని బెట్టడనియు లంకను, రాజ్యమును, తననురక్షించుకొనవలశిన దిగా రావణునకు హెచ్చరికజేసి యతని వెంబడి జనస్థానమునకు మారీచుడు బయలుదేరెను,

రావణుడు కామభోగలాలసుడు. పరదారాభిమర్శన మతని సహజదుర్గుణములలో నొకటి. రామలక్ష్మణులు లేనిసమ యములో కాషాయాంబరుధరుడై, ఛత్రము, యష్టికమండ లము ధరించి "ప్రబ్రహ్మఘోషముదీరయన్" వేదమంత్రములు స్వరక్రమయుక్తముతో బఠించుచూ పరివ్రాజకవేషముతో

రావణుడు పర్ణ శాలనొద్దకు వచ్చెను. వచ్చినయతికి సీతసత్క
ముగా నతిథిసత్కారములు చేసి, రామునిరాకకొరకు, భిక్ష
సీయుటకై, నిరీక్షించుచుండెను. ఈలోపల రావణుడా మె
బూర్వోత్తరముల గురించి బ్రశ్నించగా, ఋజుస్వభావురాలు
గనుక తనచరిత్రయు, రామునిచరిత్రయు నప్పటివరకు విశద
ముగా వివరించెను. సీత యడిగినమీదట తనగోత్రనామాదులు
చెప్పి యా మెను బ్రేమించితిననియు, నతని వెంట రావలసినదిగా
గోరెను. కామోద్రేకుడై సీతను బట్టమహిషిగా చేసెదనని
వాగ్దానముచేయును. దానికి సీతచెప్పిన సమాధానము.
సాక్షాద్వైశ్రవణునికి సోదరుడవైన నీవీమాదిరి బ్రవర్తించుట
తగదు. పరదారాభిగమనము మహాపాతకము. రామబాణము
లంకను, రాక్షసులనుదగ్ధముచేయును. రామునినుంచి తననువిడ
దీయుట నేరికి శక్యముగాదని పలువిధముల నిందించును,
అప్పుడు రావణుడు క్రోధావిష్టుడై తన నిజరూపమును చూపెను.
భయంకరాకారుడు, తీక్ష్ణదంష్ట్రుడు, దశగ్రీవుడు, వింశతిభుజు
డైన రావణునిచూచి సీతవణకినది. దుష్టాత్ముడైన రావణు
డా మెను సమీపించి తనవామహస్తముతో నా మెశిరోజములు
గట్టిగాబట్టుకొని, దక్షిణహస్తమా మె యూరువులక్రిందదిగిచి,
గిలగిల కొట్టుకొనుచున్న సీతను తనయంకముననిడికొని వి హా
యసమార్గమున లంకాభిముఖుడుగా బోయెను. దీనినిబట్టిచూడ
రావణుడు సీతను స్వయముగా నెత్తుకొనిబోయినట్లు విశద
మగుచున్నది. కొన్ని రామాయణములలో సీతయున్న

భూ ప్రదేశమును బెకలించి, ఆగడ్డతోసహా నా మెను తీసికొని బోయెనని చెప్పియున్నది. వనదేవతలంద రీదృశ్యమునుజూచి భయా ర్తులై పరుగిడిరి. సీత నీవిధముగా గొనిపోయి లంకలో ను త్తమభవనములోనుంచి, యా మెను ప్రలోభపెట్టి, భయ పెట్టి, యాచించి, ప్రార్థించి శతవిధముల సీతను వశపరచుకొను టకు ప్రయత్నించెను. కాని ఫలము లేకపోయెను.

అన్నివిధముల విఫలీకృతుడైన పిదప చివరకు, మోసము, యు క్తిచేత సీతను వశపరచుకొనుటకు ప్రయత్నము చేసెను. విద్యుజ్జిహ్వుడను నొక మాయావిచేత మాయరాముని సృష్టించి యాతనిశిరము ఖండించి, ఆశిరము, ధనుస్త్రాణములు, సీత ముందుబెట్టించి, రాముడు నిద్రబోవుచున్న సమయములో ప్రహస్తునిచే వధింపబడెననియు, యిక రామునిమీద ఆశవద లుకొని తనను వివాహమాడి సుఖముగా కాలముగడపుమని కోరెను. సీత అందులకియ్యకొనక బహువిధముల నిలపించి తననుకూడా చంపుమని రావణుని ప్రార్థించును. ఇంతలో రావణుని వెంబడే రావలశినదిగా అమాత్యులు కబురంపుటచే రావణుడు, విద్యుజ్జిహ్వుడు రాజసభకు వెళ్ళిరి. వారు వెళ్ళిన మరుక్షణమే మాయరాముని శిరస్సు, ధనుస్త్రాణ ములు, మాయమైనవి. నిజమైనశిర మీవిధముగా నంతర్ధా నము నొందదనియు, యుద్ధభేరీ నినాదములు వినవచ్చుచున్న వనియు, మరునాడుదయమే యుద్ధము ప్రారంభమగుననియు,

విభీషణుని భార్యయగు సరమ సీతనోదార్చి ధైర్యము కలుగ చేసెను.

అనేకమంది స్త్రీలను బలాత్కారముగా చెరబెట్టిన రావణుడు సీతనెందులకు బలాత్కారము చేయలేదు? అను ప్రశ్న సహజముగా వచ్చును. తనయందు ప్రేమలేని ఏస్త్రీ నైనా బలవంతముగా చెరచినయెడల నాతనిశిరస్సు సహస్ర శకలములగునని నలకూబరుని శాపముకలదు. ఆ శాపభయము వలన సీతజోలికి బోలేదు. నలకూబరుడు శాపమిచ్చిన పిదప ఏస్త్రీని రావణుడు బలాత్కారము చేయలేదు.

రాక్షసులలోగూడా కొంతమందిపెద్దలు, మహావీరులు (విభీషణుడేకాక) రావణునికి సీతను రామునకివ్వవలసినదిగా హితబోధచేయుదురు. కాని కాలచోదితుడు, వరదానగర్వాం ధుడు, నైన రావణుడు వారిసలహాలను తృణీకరించెను. అంద రికి రావణుడు ఒకటేమూర్ఖమైన జవాబుచెప్పినాడు. దేవతలు, దానవులు, గంధర్వ, లొక్కమ్మడిగా నామీదవచ్చి యుద్ధ ముచేసినను, సర్వలోకములకు భయము వాటిల్లినను, నేను రామునికి సీతనివ్వనని గట్టిగాబల్కెను.

ఈవిధముగా అందరి హితోపదేశములను తిరస్కరించి రావణుడు సైన్యవిభాగముచేసి లంకలోపల నాల్గుద్వారముల వద్ద రాక్షసవీరులను రక్షణకు నియమించి, రామునికెదురుగా నుత్తరద్వారమున తను, సైన్యముతోసహా నుండుటకు నిశ్చ

యించుకొని, సభచాలించి అంతఃపురములోనికి వెళ్ళును. మరునాడుదయమునుంచే, యుద్ధము ప్రారంభమయ్యెను.

రావణుడు మహాపరాక్రమశాలి. వెనుకంజవేయని వీరుడు, యుద్ధము ప్రారంభించిన ఐదవరోజుననే, యుద్ధభూమికి బయలుదేరును. రామలక్ష్మణులు నాగపాశవిముక్తులగుటచే తను, ధూమ్రాక్షుడు, అకంపనుడు, వజ్రహస్తుడు, ప్రహస్తుడు మొదలైన మహావీరులు మరణించుటచే, రిపులనవజ్ఞ చేయకూడదనితలచి, ఇంద్రజిత్ మొదలగు మహావీరులు వెంటరానాదిత్యసంకాశమైన రథమునెక్కి అసంఖ్యాకమైన రాక్షసబలముతో స్వయముగా రావణుడు యుద్ధభూమియందు ప్రవేశించును. అతని తేజోరూపములజూచి రాముడే విస్మయమందెను. ఆరోజు రావణుడు అచింత్యమైన పరాక్రమము చూపించెను. ప్రథమమున సుగ్రీవునోడించెను. తర్వాత నీలునాగ్నేయాస్త్రముచే మూర్ఛనొందించెను. పిదప ముష్టిపాతముతో హనుమంతుని విహ్వలునిగా నొనర్చెను. అంగదప్రభులందరిని శరవర్షముతో నిశ్చేష్టులచేసెను. చివరకు లక్ష్మణునితో భయంకర యుద్ధమొనర్చి శక్తిప్రయోగముచే నాతని మూర్ఛనొందించెను. లక్ష్మణునెత్తుకొని లంకకు పోవలెనని ప్రయత్నము చేసెను కాని లక్ష్మణునిశరీరము నెత్తలేకపోయెను. ఈలోపల హనుమంతుడువచ్చి తన ముష్టిఘాతముచే రావణుని మూర్ఛనొందింపజేసి లక్ష్మణునెత్తుకొని రాముసన్నిధికి చేరెను. రావ

ణుడు త్వరలో తెలివినొందినవాడై రామునివీర యుద్ధము నకు బోయెను. రామచంద్రుడర్ధగంటలో రావణునిరథము భగ్న మొనర్చి సారథిని, హయములను ద్రుంచి కిరీటమును బడగొట్టి శరవర్ష ముచే బ్రాణావశిష్టునిగా చేసెను. విభ్వాలుడై వెలవెలబోవుచున్న రాక్షసరాజును జంపనొల్లక లంకకుపోయి విశ్రాంతితీసుకొని మరలరమ్మనమని ధగ్నమూర్తియగు రాము డతనిని వదలిపెట్టును. రామబాణార్దితుడై, భగ్నదర్పుడై, తన గృహమునకుబోయి విలపించెను. బ్రహ్మదేవునివరము (మానవులుతప్ప ఇతరులచే నవధ్యత్వము) వేదవతీశాపము, నందీశ్వరునిశాపము, ఒక్కసారి జ్ఞాపకమునకువచ్చి మనస్సును కలవరబెట్ట సాగినవి. రాముడు మానవమాత్రుడుగా గనబడ లేదు. విష్ణువే మానవరూపములో రాలేదుగదా! యని భయపడెను. కాని దురహంకారుడు, వరదానగర్వాంధుడు, శూరాభిమానియగు రావణుడు ధైర్యము తెచ్చుకొని యుద్ధము కొనసాగించుటకు నిశ్చయించుకొనెను.

కుంభకర్ణుడు మరణించెనని తెలియగనే రావణుడు బావురువిలపించును. విభీషణుని హితబోధవినకపోతినిగదా యని చింతించును. అజ్ఞానమువలన విభీషణకుంభకర్ణ, ప్రహస్తుల మాటలువినకపోతినికదా! ధార్మికుడైన విభీషణుని తిరస్కరించి నందులకు తగినఫలమనుభవింపవలసివచ్చినదని సిగ్గుచేబాధప డెను. తనసోదరులు, పుత్రులైన నరాంతకుడు, దేవాంతకుడు,

అతికాయుడు మొదలైనవారు మరణించినతర్వాత మరలభయపడును.

రాముడెంత పరాక్రమవంతుడు! అమోఘమైన అస్త్రబలము! నారాయణుడే రాముడుగా వచ్చినాడని తలతునని మొదటిసారి భయముతో గౌరవముతో రామునిగురించి బలికినాడు. ఇంతభయమునొందినను "వినాశకాలే విపరీతబుద్ధి" యనునట్లు రాముని అభయముగోరుట కిచ్చగింపక వీరుడుగాన యుద్ధమునే కొనసాగనిశ్చయించుకొనెను. దైవవిధినెవ్వరు తప్పింపలేరుకదా! ఇంద్రజిద్వధవినిన తర్వాత రావణుడు కూలిపోయెను. కాని వెంబడే శోకమంతయు క్రోధముగా మారెను. మరునాడు రామునితో యుద్ధము జేయనిశ్చయించుకొనెను. తనబంధువులు సోదరులు, పుత్రులు, మహావీరులందరు, మూలబలముతో సహా మడియుటచే, జీవితముమీద నిరాశచెందినవాడై ద్విగుణీకృతక్రోధముచే, రావణుడు మరునాడమోఘమైన యుద్ధమొనరించి, హనుమదాదిమహావీరులందరిని కుంటుబరచి రాముమీదికి క్రోధతామ్రాక్షుడై దూకెను. రామరావణులిద్దరు పరస్పర జయైకకాంక్షిణులై దివ్యాస్త్రములతోను, శస్త్రములతో నప్రతిహతద్వంద్వ యుద్ధమొనర్చిరి.

ఒకరినొకరు జయించుటకై వృత్రవాసవుల మాదిరియుద్ధము జేయుచుండిరి. రామరావణులిద్ద రనేకమండలగతుల విచిత్ర

ముగాయుద్ధముచేయుచుండిరి. ఒకదినమహోరాత్రమంతయు న చింత్యమైన యుద్ధముజరిగినది. "ఉభౌహిపరమేష్వాసౌ ఉభౌ యుద్ధవిశారదౌ" ఇద్దరు గొప్పధనస్సులు కలవారే. ఇద్దరుయుద్ధ విశారదులే. ప్రకృతి అంతయు స్తంభించినది. సూర్యచంద్రులు నిష్ప్రభులైరి. వాయుదేవుడు వీచుటమానెను. దేవతలు దాన వులు పరమోద్విగ్నహృదయులై నెవరుగెలిచెదరోయని ఆతు రతతో నిరీక్షించుచుండిరి. ఈలోపల లక్ష్మణుడు రావణునకెదు రుగాబోయి అతనిచే ప్రయోగింపబడిన శక్తిచే మూర్ఛనొం దెను. తన బహిశ్ప్రాణమగు లక్ష్మణుడు నిశ్చేష్టుడుగా బడి యుండుటజూచి క్రోధస్ఫారితేక్షణుడై రాముడీ క్రిందివిధముగా ప్రతిజ్ఞ చేయుచున్నాడు. "సత్యప్రతిజ్ఞ చేయుచున్నాను. వినుడు. ఈముహూర్తములో రాముడైనా జీవించియుండవ లెను. లేదా రావణుడైనా వుండవలెను. ఇద్దరు బ్రదికియుం డుట అసంభవము. మూడులోకముల ప్రజలు, దేవతలు, గంధ ర్వులు, ఋషులు, రామునియొక్క రామత్వమిప్పుడు జూచె దరుగాక" యని ప్రచండరోషముతో రావణునివీడ శరవృష్టి గురిపించెను. రాముడు పదాతిగా రథస్థుడైన రావణునితో బోరుట ధర్మముగాడని సురేంద్రుడు తన దివ్యరథమును, సా రథియగు మాతలితోసహా రామునివద్దకు బంపెను. అప్పటినుంచి "సుమహాద్వైరథం యుద్ధం తుములం రో మహార్షణం" రథికులిర్వురమధ్య గొప్పయుద్ధము జరిగెను. ఆయుద్ధములో సా యంత్రమగుసరికి రావణుడు నిస్తేజుడై నిర్వీర్యుడై వెలవెలబోవు

చుండెను. రావణుని ప్రమాదస్థితిజూచి యతనిసారథి రథమును ప్రక్కకులాగెను. స్పృహవచ్చిన వెంటనే రావణుడది తెలుసు కొని క్రోధావిష్టుడై "రావణుడేరికి నింతవరకు లొంగలేదు. రథము నెందుకు నీవుప్రక్కకు లాగితివి ? అటులచేయుట శత్రు వునకు లొంగినట్లే. ఇంతనీచమైన కార్య మెందుకు జేసితివని సారథిని చంపబోయెను. గుర్రములలసి యుండుటచే వాటికి విశ్రాంతి యిచ్చుటకై రథము ప్రక్కకులాగితినని తెలివిగల సమాధానము చెప్పెను. దానికి సంతోషించి వానికి హస్త భరణము పారితోషికముగానిచ్చి వెంటనే రామునిమీదికి రథము బోనివ్వమని యాజ్ఞాపించెను. మరణాసన్నమైనకాల ములోగూడ వెనుకంజవేయుట కిచ్చగింపని సాభిమానముగల మహావీరుడు రావణుడు. సారథి, రావణునాజ్ఞప్రకారము రామునిమీదికి రథముబోనిచ్చెను. మరల ఇద్దరిమధ్య నద్భు తమైన సంగ్రామము జరిగెను. ఎన్నిసార్లు రాముడు రావ ణునితలలు ఛేదించినను మరల ఉద్భవించుచుండెను. ఆ రాత్రి అంతయు యుద్ధమావిధముననే జరిగెను. రామున కేమియు తోచక చింతావిష్టుడై నిలబడెను. సూర్యో దయసమయమునకు అగస్త్యమహర్షివచ్చి రామునకాదిత్య హృదయముపదేశించెను. శుచియై ఆదిత్యహృదయము రాముడు మూడుసార్లు పఠనచేసి మరల కోదండమునెత్తెను. ఈ చివరయుద్ధ మత్యద్భుతముగా జరిగెను. అమోఘమైన శస్త్రాస్త్రములిద్దరు ప్రయోగించిరి. చివరకు రాముడు మాతలి

సలహాప్రకారము పై తామహాస్త్రము ప్రయోగించెను. దానితో సప్తసాగరములు ఘూర్ణిలెను, నక్షత్రగ్రహ చంద్రార్కులు గతులదప్పిరి. దేవతలు, ఋషులు లోకక్షేమము కొఱకు స్వస్తివచనములు చెప్పుచుండిరి. రాముడు వదలినబ్రహ్మాస్త్రము రావణుని దశశిరస్సుల ఖండించి విగతప్రాణుని చేసెను. దేవదుందుభులు మ్రోగెను. దేవతలు పుష్పవృష్టి గురిపించిరి. అప్సరసలు నాట్యమాడిరి. నారదతుంబురులు గానమొనర్చిరి. ఈవిధముగా శత్రవవీరుని జంపి, తనప్రతిజ్ఞ నెరవేర్చినవాడై తన స్వజనములమధ్య, దేవతలమధ్య సురేంద్రునిగా రాముడు ప్రకాశించెను.

రావణునిచరిత్ర మనము సమీక్ష చేసినయెడల, వాడెంత దుష్టుడు, బ్రహ్మఘ్నుడు, సాధుసజ్జనసంతాపకుడు, పరదారాభిరతుడైనను, వేదవేదాంగవిదుడు, శివపూజా దురంధరుడు, స్వకర్మనిరతుడు, ధర్మాధర్మవిచక్షణ గలవాడు, అధర్మమార్గమున యుద్ధముచేయుట కిచ్చగింపక రామునితో నహోరాత్రములబోరి, రామునంతటి వానినిగూడ "చింతావ్యాకులితేంద్రియునిగా చేసి", చివరకు రాఘవనిర్ముక్తపై తామహాస్త్రముచే మరణించిన జగదేకవీరుడు. అతని దుర్గుణములే అతని తపోబలమును కృంగదీసి అతని మృత్యువునకు కారణములైనవి.

ఆదిత్యహృదయము

అగస్త్యుల వారుపదేశించిన "ఆదిత్యహృదయ"మను స్తోత్రమును మూడుసార్లు శుచియై రాముడు పఠించినతర్వాత రావణుడు వధింపపడెను. దీని రహస్యమేమున అగస్త్యునిచే నుపదేశము బొందువరకు, రాముడు తను మహావీరుడననియు ఖరదూషణాది రాక్షసవీరుల జంపితిననియు, రావణుని తప్పక వధించగలుగుదునని అహంకారముతోను, ధైర్యముతోను యుద్ధముచేసెను. ఆ అహంకారమున్నంతవరకు తపోబల విశిష్టుడనని, బ్రహ్మవరప్రసాదినని భావముతోనున్న రావణుని జయింపలేకపోయెను, "నేను బ్రహ్మచేత వరముల బొందితిని. నన్నెవరు చంపలేరని" భావముతో రావణుడుండెను. "నేను దశరథకుమారుడను. అనేకమంది రాక్షసవీరుల జంపితిని. మహాపరాక్రమవంతుడ"నని భావముతో రాముడుండెను. ఇద్దరిలో నహంకారమున్నను, రాముని అహంకారము స్వబలమునీద నాధారపడి యున్నది. రావణుని అహంకారము బ్రహ్మవర ప్రభావమునీద నాధారపడి యున్నది అందువలన రాముడు జయించలేకపోయెను. "నేనుబ్రహ్మను" "అహం బ్రహ్మస్మి" యను జ్ఞానము కలిగినగాని రావణుని చంపుశక్తి రామునికి కలుగదు. ఎందుకనగా బ్రహ్మవరప్రభావముకంటె బ్రహ్మజ్ఞానము గొప్పది. "ఆదిత్యహృదయము" యొక్క

అంతరార్ధమేమనిన, ఆదిత్యమండలాంతర్గత పురుషుడే సర్వాంత ర్యామియగు పరబ్రహ్మయనియు, ఆతేజము తనలోనుండి తనను ప్రచోదింప చేయుచున్నదనియు, తనే ఆతేజస్సు, బ్రహ్మ యనియు ఆత్మబోధ రామునికి కలిగినగాని రావణుని చంప లేడు. ఆయాత్మజ్ఞానము కలిగినమీదట రావణుని బరిమా ర్చుట స్వల్పకార్యముగా దలచి రావణుని వధించెను. అది యునుగాక "ఆదిత్యహృదయ"మును జపించుటవలన, సర్వ శత్రు వినాశనము జయముకలుగునని చెప్పబడి యున్నది.

మానవు డెంతపరాక్రమవంతుడైనను దైవానుగ్ర హము కలుగువరకు కృతార్థుడుగానేరడు. అందువలన ప్రతి మానవు డేకార్యమును సాధించదలచుకున్నను, ప్రారంభము నుంచి, పూర్తియగువరకు దైవప్రార్థన చేయుచుండవలయును. రాముడెంత మహావీరుడైనను తన బాహుబలమువీదనే ఆధారపడి యున్నంతవరకు తపోబలవిశిష్టుడు, వరప్రసాదియగు రావణుని జయించలేకపోయెను. ఆదిత్యహృదయ స్తోత్రము జపించి, దైవమునుస్మరించిన తర్వాతగాని రావణుని వధించలేక పోయెను. గానకార్యము సాధించవలెనన్న పురుషప్రయత్న ముతోగూడ దైవారాధన తద్వారా దైవానుగ్రహముగూడ యుండిననేగాని కృతార్థుడు కానేరడని ఆదిత్యహృదయము బోధించుచున్నది.

కుంభకర్ణుడు

కుంభకర్ణుడు రావణుని తమ్ముడు. విశ్రవసబ్రహ్మకు, కైకసికి, జనించినవాడు. మహాకాయుడు. అతనుశయనించు గుహయేయోజనాయతమైనది. విభీషణుని అన్నగారు. రాముని చే ప్రథమయుద్ధములో నోటమినొంది, యుద్ధముప్రారంభమయినతరవరోజున, రావణుడు కుంభకర్ణునితనసభకుపిలిపించెను, తనకుజరిగిన పరాభవము విషయమైచెప్పి, రామలక్ష్మణులజంపి తనకుసహాయముచేయమనికోరెను. కుంభకర్ణుడు ధర్మాధర్మములు తెలిసినవాడు. రావణుడుచేసినది తప్పనియు, ఎవరితోను సంప్రదించక, తనుఒక్కడేపోయి సీతనపహరించి తెచ్చెననియు, సుహృదులైన విభీషణాదులమాటలు వినలేదనియు, చేసిన దుష్కర్మకు ఫలమనుభవించక తప్పదనియు చెప్పెను. విభీషణుడు చెప్పినమాదిరి సీతను రాముసకొప్పగించుట మంచిదనియు, అటులకాదేని, రావణునియాజ్ఞప్రకారము యుద్ధభూమిని ప్రవేశించి, రామలక్ష్మణులబరిమార్చి, అన్నగారి ఋణముతీర్చుకొనెదనని చెప్పెను.

కుంభకర్ణుడు మహాబలుడు, వరదానసంపన్నుడు. శాపములబొందనివాడు. దీనినిబట్టిచూడ నతడధర్మమార్గప్రవర్తకుడు కాడని తెలియుచున్నది. సురేంద్రునిజయించిన మహావీరుడు. బలముతోకూడిన క్రూరయుద్ధముతప్ప నైపుణ్యము,

శస్త్రాస్త్రములాఘవము లేదు, యుద్ధభూమిలో కోపమెక్కువయిన పుడు స్వపక్షపరపక్షవిజ్ఞానము లేకుండా నందరినివధించి తినుట మొదలిడెను. ఈ వికటాట్టహాసముచూచి రాముడు విస్మయము చెందెను. సుగ్రీవుడు, అంగదుడు, నీలుడు, హనుమంతుడు మొదలగు మహావీరులజయించి, లక్ష్మణుని సాయకములకు లెక్కసేయక నాతని త్రోశివేసి రామునిమీదికిదూకిన మహా వీరుడు. రామచంద్రుడు దివ్యాస్త్రప్రయోగముచే నాతని బాహువులను, చరణములను ఖండించెను. చివరకు మొండెము, శిరముతోసహా, దొర్లుకుంటూ రామునిమింగుటకై వచ్చెను. రాముడతని వికృతయుద్ధమునుజూచి చకితుడై బ్రహ్మాస్త్ర ప్రయోగముచే నతనిశిరమును ఖండించెను. శిరము పై కెగిరి త్రికూటాద్రిశిఖర గోపురముఖద్వారమును నిరోధించెను. శరీర మెగిరిపోయి శతయోజనసముద్రమధ్యమునబడి, తరంగముల నంబరముదాకునట్లుచేసెను. ఈవిధముగా నతికాయుడు, మహా బలుడై నకుంభకర్ణుడు ఘోరయుద్ధముచేసి దివంగతుడై నాడు.

విభీషణుడు

విభీషణుడు విశ్రవసబ్రహ్మకు, కైకసియను రాక్షసికి బుట్టిన వారిలో చివరివాడు. రావణ కుంభకర్ణులిద్దరితనికంటె జ్యేష్ఠులు. వారిద్దరు, దుర్మార్గులు క్రూరకర్మలగుటచే, సత్సంతానమను గ్రహించమని కైకసిప్రార్థించగా చివరబుట్టినవాడు ధార్మికుడగు

నని విశ్రవసుడు వరమిచ్చెను. ఆ విధముగా బుట్టినవాడు విభీషణుడు.

విభీషణుడు పరమధార్మికోత్తముడు. అతనికి రాజ్య కాంక్ష లేదు. రాముడు పురుషోత్తముడు, ధర్మస్వరూపుడని తెలిసినవాడు గనుక, అన్నగారుదూషించి వెడలగొట్టినపుడు రాముచంద్రు నాశ్రయించినాడు. రామున యందతనికున్న అపారభక్తియే నాతనికడకు తీసికొనిపోయినది.

విభీషణుడు ధర్మజ్ఞుడు. రావణుడు హనుమంతుని వధించమని దూతలకాజ్ఞాపించినపుడు, పవనాత్మజుడు దూతయనియు, నతని వధించుట ధర్మసంమతముగాదనియు నుడువును. "యుక్తాయుక్తములు విచారించి తగినదండన విధించవలశిన దని" సోదరునకు విన్నవించెను. రావణుడాతని మాటలువిని తోక తగులబెట్టివేయుడని యాజ్ఞాపించెను.

విభీషణుడు, రావణుడుచేసిన తప్పపని, రాముని అమోఘవీర్యము తెలిసినవాడగుటచే "ప్రదీయతామ్ దాశరథాయ మైథిలీ" యను పల్లవితో అనేక శ్లోకములలో సీతను రామున కిచ్చివేయవలశినదిగా ప్రార్థించును. రాజసభలో ప్రహస్తుడు, ఇంద్రజిత్ మొదలగువారు రావణుని ప్రోత్సహించినను, విభీషణుడు మాత్రము, సీతలంకకు వచ్చినప్పటినుండి దుశ్శకునములు గానవచ్చుచున్నవనియు, రావణుడుచేసినది తప్పనియు, అతను అధర్మమార్గములో ప్రవర్తించుచున్నాడ

నియు, అధర్మము తప్పక ఓడుననియు, ధర్మము రాముని వైపు న్నదనియు రాముని పరాక్రమ మద్వితీయమనియు, లంకను, రాక్షసులను తనను, రక్షించుకొనదలచిన యెడల, సీతను రామునకు వెంబడే అర్పించవలశినదిగా యనేకవిధముల ప్రార్థించెను. రావణుడందుల కియ్యకొనక విభీషణునితో జ్ఞాతిదుర్గుణములు విడువలేదనియు, తను బాగుపడుట కిష్టములేక ఈర్ష్య వలన ఈవిధమైనసలహా యిచ్చుచున్నాడనియు, కులపాంసనుడనియు నిందించి లంకనుంచి వెడలిపొమ్మని వెంబడే యాజ్ఞాపించెను. రావణునిమీద నసహ్యముకలిగి, తననలుగురి అనుచరులతోసహా లంకను వదలిపెట్టెను.

విభిషణుడు తనఅనుచరులతోసహా లంకనువదలినతోడనే రాముని శరణుగోరెను. ఆకసమునన్నుండియే రక్షించుమని రాముని ప్రార్థించెను. రావణునిచే నవమానింపబడితిననియు, రామునికంటె వేరుదిక్కెవరులేరనియు నుడివెను. లంకను, మిత్రులను, ధనమునుత్యజించి, సర్వభూతములకు శరణ్యుడైన శ్రీరామునిసేవకై వచ్చితిననియు నుడివెను. ఈవిధముగా విభీషణుడు శరణుగోరినతర్వాత నాతనికాశ్రయమివ్వవచ్చునాలేదా యనుసమస్య ఉత్పన్నమయ్యెను. రాముడందరిసలహాదీసికొనెను. గర్భశత్రువుని సోదరుడుగనుకను, రాక్షసుడు, మాయావిగనుకను, మనము రావణునితో యుద్ధముచేయబోవుచున్న సమయముగనుకను, శరణిచ్చుట ఎంతమాత్రము పనికిరాదని సుగ్రీవ అంగదాది ప్రముఖులునుడివిరి. ఇదంతయువిని రామచంద్రు

డాతనినిశ్చయము వెలిబుచ్చెను. "ఎవరై ననుసరే దీనుడై ప్రా
రణశుద్ధిగా తనను శరణుకోరినయెడల నతనికి శరణిచ్చుట తన
ముఖ్యధర్మమనెను. మీదుమిక్కిలి అతను రావణుడైనసరే!
శరణిచ్చితిని వెంబడే తీసికొనిరమ్మనమని" సుగ్రీవునాజ్ఞాపిం
చెను. ఈవాక్యములువినినతర్వాత సుగ్రీవుడు విభీషణుని
రాముసికడకుకొనివచ్చెను.

విభీషణుడు రాక్షసుడు గనుక, రక్కసులమాయలు
దెలుసునుగనుక, కష్టసమయములలో నిరుత్సాహముచెందిన
వానరవీరులకు రామలక్ష్మణులకు ధైర్యముకలిగించి వారలనాప
దలనుంచి రక్షించెను. శుకసారణులు వానరరూపములో వానర
వాహినిలో ప్రవేశించినపుడు వారలబట్టుకొని రాముసికి దెలియ
చేసెను. రామలక్ష్మణులు నాగపాశబద్ధులై మూర్ఛనొందినపుడు,
వారలు చావలేదనియు, త్వరలో తెలివినొందెదరనియు చెప్పి
వారికి ధైర్యము కలిగించెను. రావణుని శక్తిప్రయోగముచే
నిశ్చేష్టితుడై లక్ష్మణుడు భూమిమీద ప్రాలెను. లక్ష్మణునిలో
జీవకళ యున్నదనియు, కొలదికాలములోనే తెలివి తెచ్చుకొ
నుననియు రాముని ఆశ్వాసించెను. చివరకు మాయసీత నిం
ద్రజిద్వధించిన తర్వాత, అందరు, హనుమంతునితోసహా, నిర్వి
ణ్ణులైరి. సీత చావలేదనియు. చంపబడినది మాయసీతయనియు,
రావణుడు బ్రతికియుండగా సీతనెవ్వరు చంపలేరనియు, నికుం
భిలాహోమము పూర్తిచేయుటకై తగిన వ్యవధికోస మీపన్నా

గము బన్నినాడనియు, అతను వేరొకచోట హోమము పూర్తిచేయుచున్నాడనియు, అది పూర్తిఅయిన, వానినెవ్వరు చంపలేరనియు, వెంబడే హోమమునకు విఘ్నమొనరించినగాని ఆతడు చావడనియు, చెప్పి, లక్ష్మణునిసేనతో గోనిపోయి, నికుంభిలాయాగమునకు విఘ్నమొనరింపచేసి అజేయుడైన ఇంద్రజిత్తునువధించుటలో లక్ష్మణునకు చాలసహాయమొనర్చెను. ఈవిధముగా విభీషణుడన్నగారి శత్రుపక్షమునకు సహాయమొనరించుట ధర్మమాయనుప్రశ్నగలదు. అధర్మమును జయించుటలో ధర్మమున కన్నివిధములసహాయమొనరించుట అధర్మముకాదు, కానేరదు. లోకకంటకుడైన రావణుని సంహరించుటలో ధర్మమూర్తియగు రామునకు సహాయమొనరించుటధర్మమని భావించి విభీషణుడుసహాయముచేసెను.

విభీషణుడు పరమభాగవతోత్తముడు కనుకనే రాముడు, తనపూర్వులకాలమునుంచి తనయింట్లో నారాధ్యదైవమగు పత్నీసహితజగన్నాధవిగ్రహమును పూజచేసుకొనమని విభీషణునికి ప్రసాదించెను. ఆవిగ్రహములిప్పటికి దర్భశయనములోనున్నవి. అక్కడికివెళ్ళినయాత్రీకులందరు ప్రధమమున యాజగన్నాధవిగ్రహములను పూజించి తదుపరి శ్రీరామవిగ్రహమును సందర్శించెదరు. ఇప్పటికి ఆయాచరమములులోనున్నది. దర్భశయనమునకు ఫర్లాంగుదూరములో సముద్రతీరముగలదు. ఆచోటు "సేతుకరై" (వారధికట్టినచోటు) అని నామధేయ

మున ఇప్పటికి బిలువబడుచున్నది. బహుశ వానరులు వారధి కట్టుట ఇక్కడనుంచే ప్రారంభించివుందురు.

ఇంద్రజిత్

ఇంద్రజిత్ రావణుని ప్రథమపుత్రుడు. మండోదరికి జనించినవాడు. పుట్టుకతోనే మేఘగర్జనముచేయుటచే మేఘనాదుడని పేరువచ్చినది. ఇంద్రునిజయించుటచే నింద్రజిత్ అను సార్థకనామధేయముకలిగినది. పవనాత్మజుని బ్రహ్మాస్త్రముచే బంధించి రావణునికడకుగొనిపోయిన మహాపరాక్రమశాలి. యుద్ధమంతయు, చాలాభాగము, మాయయుద్ధమే, కూట యుద్ధ విశారదుడు.

ప్రథమదినయుద్ధమున అంగదునిచేపరాభవింపబడి, ఆ రాత్రిఅంతయు మాయయుద్ధముచేసి, వానరులజంపి, రామ లక్ష్మణుల నాగపాశబద్ధులుగాచేసెను. మరునాడుదయమే గరు త్మంతుడువచ్చి వారలవిముక్తులచేసెను. మేఘనాదుడు తన రెండవయుద్ధములో పూర్తిగా విజృంభించెను. బ్రహ్మాస్త్ర ప్రయోగముచే నచింత్యమైన మారణహోమముచేసెను. ఐదు ఘడియలలో 60 కోట్లవానరులజంపి, రామలక్ష్మణుల మూర్ఛ నొందింపచేసెను. హనుమంతుడు సంజీవపర్వతముదెచ్చి వారల బ్రతికించెను.

ఇంద్రజిత్ మూడవయుద్ధము మోహమైనది. వైశ్వానరునిబూజించి, దివ్యాస్త్రములుసంపాదించి నేరికికనబడకుండ మాయయుద్ధముచేసెను. ఈసారి రామలక్ష్మణులులొంగలేదు. కనబడినచాలు, నతనిని వధించుటకై, రామలక్ష్మణులు సంసిద్ధులుగానుండిరి. ఆసంగతి తెలిసికొనినవాడై, లంకలోబ్రవేశించి, మాయసీతనొకదానిని సృష్టించి, తనరథముమీదబెట్టుకొని, పశ్చిమద్వారముకుండా, హనుమంతునిమీదికియుద్ధమునకుబోయి, అతనుచూచుచుండగనే మాయసీతను వధించెను. హనుమంతుడు ఈసంగతి రామలక్ష్మణులతోను, తదితరవానరవీరులతోనుచెప్పెను. వారందరు నిర్విణ్ణులైయుండగా, విభీషణుడు వారినోదార్చి, సీతచావలేదనియు, ఇదిఅంతయు ఇంద్రజిత్తుయొక్క మాయపన్నాగమనియు, అతనువేరొకచోట నికుంభిలాహోమముచేయుచున్నాడనియు చెప్పి లక్ష్మణుని సేనతో నాచోటుకుదీసికొనిపోయి నాతనిచే ఇంద్రజిద్వధ చేయించిన వివేకశాలి.

ఇంద్రజిత్ధర్మములు తెలియనివాడుకాడు. రావణుడు చేసినది తప్పనితెలుసును. అమోఘపరాక్రమముడగుటచే, రామలక్ష్మణుల సంహరించి తండ్రిని సంతోషపరుచుటకై వారితో యుద్ధమునకుప్రవిమించెను. రెండుసార్లు రామలక్ష్మణుల మూర్ఛనొందింపజేసి, తుదకు మహాబలుడైన లక్ష్మణునిచే వధింపబడిన మహావీరుడు.

మా రీ చు డు

తాటకకుమారుడు. మాయావి. దుష్టస్వభావముకల వాడు. అయినను ధర్మాధర్మములు తెలిసినవాడు. రావణుని సీతాపహరణ ప్రయత్నమునుంచి విరమింపజేయుటకై శతవిధముల ప్రయత్నముచేసెను. కాని రావణుడు వినక క్రోధావిష్టుడై నతనిని చంపబోయెను. వేరుగతిలేక, రావణునియాజ్ఞ ప్రకారము మాయలేడి రూపముధరించి, సీతను ప్రలోభపరచి, రామలక్ష్మణుల పర్ణశాలకడలేకుండునటులగా చేసెను. వారిద్దరు లేనిసమయమున, రావణుడువచ్చి సీతనెత్తుకొనిపోయిలంకయుం దుంచెను. చిన్నపాత్ర అయినను, రామాయణములో ప్రాముఖ్యతనొందినాడు. మారీచుడులేనిది రామాయణమేలేదు. సీతాపహరణమునకు దోడ్పడి, రావణవధకు, తద్వారా లోక కళ్యాణమునకు ముఖ్యకారకుడైనాడు.

పురుషపాత్రలు (శేషము)

రామాయణములోని వర్ణనకు మిగిలిన ముఖ్యమైన పాత్రల నీక్రింద వర్ణించుచున్నాను.

జాంబవంతుడు - బ్రహ్మమానసపుత్రుడు. వయోవృద్ధుడు. అనుభవశాలి. క్లిష్టసమయములలో కార్యసాధనకు అమూల్యమైన సలహానిచ్చెడివాడు. ఎదుట ఘోషిల్లుచున్నశత

యోజన సముద్రము నెటుల దాటుటయాయని, నిరుత్సాహముతో వానరులున్న సమయమున హనుమంతుడు సమర్థుడని వారలకు చెప్పి పవనాత్మజుని సముద్రోల్లంఘనమునకు బురికొల్పిన ధీశాలి. ఇంద్రజిత్తు రెండవయుద్ధములో వానరులందరు (విభీషణుడు, హనుమంతుడుతప్ప) రామలక్ష్మణులతో సహా నిశ్చేతనులైరి. ఆసమయమున ఆంజనేయునిచేత సంజీవి పర్వతము తెప్పించి రామలక్ష్మణులను, వానరులను బ్రతికింప చేసిన ప్రాణదాత.

అంగదుడు – వానరులకు యువరాజు. పరాక్రమశాలి. యుద్ధము ప్రారంభించబోవుముందు రావణునితో రాయబారము సలిపిన బుద్ధిమంతుడు. ధూమ్రాక్షుడు, వజ్రదంష్ట్రుడు, అకంపనుడు మొదలైన రాక్షసవీరుల వధించిన పరాక్రమశాలి.

నలుడు – సేతుబంధన మొనర్చిన మహానుభావుడు – రాక్షసవీరులజంపిన పరాక్రమశాలి.

నీలుడు – వానరులకు సేనాధిపతి. విచిత్రలాఘవముతో రావణునితో యుద్ధముచేసి అతని మెప్పువడసిన వీరుడు. ప్రహస్తుని చంపిన పరాక్రమశాలి.

సుషేణుడు – వానరులకు వైద్యుడు. మిగిలినవానర వీరులందరు గజుడు, గవాక్షుడు, గంధమాదనుడు, శరభుడు, ద్వివిదుడు మైందుడు యథాశక్తి రాక్షసులవధించి రామునకు సహాయముచేసినారు.

వ శి ష్టు డు

వశిష్టుడు ఇక్ష్వాకుల కులగురువు. పురోహితుడు. బ్రహ్మర్షి. వశిష్టుడు అఖండతపోబలశాలి. తనతపోబలముచే విశ్వామిత్రుని సైన్యముతోసహా నోడించెను. ధర్మసంకటసమయములలో చక్రవర్తికి తగిన సలహానిచ్చెడువాడు. సంతానము లేక తపించుచున్న దశరథునకు అశ్వమేధయాగము పుత్రకామేష్టి, చేయమని ప్రోత్సహించినాడు. దశరథుడు, విశ్వామిత్రుని వెంటరామ లక్ష్మణుల బంపుటకు, వెనుదీయుచున్న సమయములో రాముని తప్పకవిశ్వామిత్రునితో బంపమనియు, దానివలన రామునికి మేలగుటయేకాక లోకకళ్యాణమగుననియు ధైర్యముచెప్పి, వారిని విశ్వామిత్రుని వెంటబంపినధీశాలి. కైక, సీతకుకట్టుకొనుటకు నారచీరలిచ్చినపుడు సీత వనవాసము తనుకోరలేదనియు, ఆమెకు నారచీరలిచ్చుట యధర్మమని, కైకనునిందించి, ఆమెకు నవసరమైన చీని, చీనాంబరములు, ఆభరణములు దశరథునిచే నిప్పించెను. తుదకు రామావతారసమాప్తిముందు తనుకాలునికి చేసిన వాగ్దానప్రకారము లక్ష్మణుని రాముడు చంపవలసి వచ్చెను. ఆపనిచేయుటకుమనసాడక రాముడు బాధపడుచున్న సమయములో లక్ష్మణునిచంపనవసరములేదనియు, నిర్వాసము చేసినచాలనియు చెప్పి రాముని బాధకొంతతగ్గించినవివేకశాలి. బ్రహ్మర్షిగనుకనే రామచంద్రునికి పోషడశకర్మలు చేయించు భాగ్యమతనికే యబ్బినది.

గు హు డు

ఇతడు నావికులరాజు. దశరథుని మిత్రుడు. రాముని భక్తుడు. గంగాతీరమున శృంగిబేరపురమతని నివాసము, సీతా

రామలక్ష్మణులను, తనపడవలో గంగనుదాటించినధన్యుడు.

భరతుడు సైన్యముతో గంగాతీరమునకువచ్చినపు డను మానపడినవాడై "నీవు రామునికపకారముచేయుటకు బోవుట లేదుగదా" యని సూటిగా ప్రశ్న వేయును. భరతుని సమా ధానమువిని యాతనియుదారతకు నిష్కల్మషప్రవర్తనకు, సంత సమొందినవాడై భరుతుని సైన్యముతోసహా గంగఅవతలి ఒడ్డుకు తననావలలోజేర్చెను.

రాముని యందు గుహునకుగలభక్తి నొక పూర్వకవి ముచ్చటైనశ్లోకములో వర్ణించినాడు. రాముడు, తనపడవనెక్కి బోవుముందు గుహుడుచెప్పినమాటలు

శ్లో। ప్రక్షాళయామి తవపాదపంకజమ్
నాథ! దారుదృషదోఃకిమంతరమ్
మానుషీకరణరూపమస్తుతే।
పాదయోఃరజమితి శృతంమయా।

హేప్రభో! తమపాదకమలముల బాగుగా ప్రక్షాళన చేయనిమ్ము. తదుపరి మీరు పడవనెక్కుదురుగాక. రాతికి, కొయ్యకు బేధమేమున్నది (రెండుజడములే) తమపాదరజ ములో మానుషీకరణప్రభావమున్నదని (రాతిని నాతిగాచేసితి విగదా) వింటిని. అందువలన నాపడవగూడ మనిషిగా మారిన యెడల నావృత్తియే నాశనమగును. నాకికజీవనము దుర్లభమ గును. కాన, నీపాదములను, రజోగుణములేమియు లేకుండా కడగనిమ్మనమని ప్రార్థనచేసి యతని పాదములుకడగి కృతార్థ్థ్థుడైనవ్యక్తి గుహుడు.

సవిూక్ష

ఇంతవరకు వ్రాసినగ్రంథమును సమీక్ష చేసినయెడల పురుషులంద రేదోవిధముగా రామునకుగాని, రావణునికిగాని సహాయముచేసినవారే. వానరులందరు దైవాంశసంభూతులే. విష్ణువుకోరిక ప్రకారము రామసహాయార్థము, దేవతలందరు తమయంశసంభూతులను వానరస్త్రీలయందు బుట్టించిరి. ఈ నంగతి ఇదివరలో నీ గ్రంథమున వ్రాయబడినది. విభీషణుడు నలుగురి అనుచరులతో సహా రామునికి సహాయముచేసెను. రామలక్ష్మణులుగాక వానరసైన్యముననున్న మానవులీ ఐదుగురే. వానరులందరు నిస్స్వార్థముగా రామునికొఱకై యుద్ధ భూమిలో ప్రాణములర్పించినారు. ఈసంగతి తెలిసినవాడుకను కనే యుద్ధానంతరము రాముడు దేవేంద్రునిచే అమృతవర్షము గురిపించి వాగలనందరిని పునర్జీవితులుగాచేసినాడు.

ఋషులుగూడా రామునికి గూఢముగా సహాయముచేసి, రాముని యొక నిర్ణీతమార్గమున లంకకు గొనిపోయి రావణవధ చేయించినారు. వీరిలో ముఖ్యులు విశ్వామిత్రుడు, అగస్త్యుడు, వశిష్టుడు. విశ్వామిత్రుడు సీతాకళ్యాణముచేయించి, తద్వారా రావణవధకు నాందివేసినాడు. రాముని విశ్వామిత్రుని వెంబడి పంపుమని వశిష్టుడు దశరథుని యాదేశించినాడు. దానివలన రామునికిమేలు, లోకకళ్యాణము, గలుగునని కూడా చెప్పినాడు. అగస్త్యుడు వైష్ణవధనస్సు, అక్షయతూణీరములు రామునకిచ్చి మెల్లగాపంచవటికి పంపినాడు. ఆ ఆయుధములతోనే ఖరదూష

ణాది రాక్షసనిర్మూలనము జరిగినది. రాక్షసులపై పునుంచి రాముసికి సహాయముచేసినవాడు విభీషణు డొక్కడే. (అనుచరులతోసహా) మిగిలినవారందరు రావణునికి సహాయముచేసినారు. రాక్షసులలో కబంధుడు, విరాధుడు, నొకవిధముగా రాముసికి సహాయ మొనరించినారని చెప్పవచ్చును. సుగ్రీవుని ఆశ్రయించినయెడల సీతాన్వేషణములోను, రావణవధలోను అతను తగినసహాయము గట్టిగాచేయగలడని వారుచెప్పిరి. వారి యూదేశానుసారమే, రామలక్ష్మణులు ఋష్యమూకపర్వత మునుచేరి సుగ్రీవునితో మైత్రిచేసుకొనిరి.

తిర్యగ్యోనులుకూడా రాముసికి సహాయముచేసినవి; జటాయువు సీతకోసము తనప్రాణములర్పించెను. సంపాతి సీత జాడగురించి వానరులకు తెలిపెను. గరుత్మంతుడు మూర్ఛిలిన రామలక్ష్మణుల నాగపాశవిము క్తులచేసి బ్రతికించెను.

రావణునికిగూడ, ప్రశస్తవీరులగు కుంభకర్ణుడు, ఇంద్రజిత్, ప్రహస్తుడు, అతికాయుడు మొదలగువారు సహాయముచేసి ప్రాణములగోల్పోయిరి. అతనినిప్రమాదమునుంచి తప్పించవలెనని, విభీషణుడు, మారీచుడు, మాల్యవంతుడు విశ్వప్రయత్నములు చేసినారు. కాని వారిహితోపదేశమును రావణుడు వినకపోవుటచే, వారిప్రయత్నములు విఫలమైనవి.

ఈవిధముగా రామాయణములోని పురుషపాత్రులందరు తమకుచేతనయినంతవరకు రాముసికో లేక రావణుసికో సహాయముచేసి వారికృతజ్ఞతను వెలిబుచ్చిరి.

ఓం తత్ సత్

సీతాదేవి

సీతాదేవి అయోనిజ. భూగర్భమున దొరికినది. ఒక నాడు, జనకుడు యజ్ఞభూమిని దున్నుచుండగా నాగలికొన కొక మందసము తగిలెను. దానిమూత తీయగా నందులో దేదీప్యమానయగు నొకబాలిక యుండెను. జనకునికి సంతానము లేనికారణముచే నాబాలికను తనగృహమునకు దెచ్చుకొని పెంచెను. నాగలికొనకుదగిలి దొరకుటచే నామెకు "సీత" యను నామకరణ మొనర్చెను. సీత దినదినప్రవర్ధమానయై జనకునింట బెరిగెను. అయోనిజగాన, వీర్యశుల్కవిధాన మున, బరిణయము సేయదలచి, తనయింటనున్న శివధనుర్భంగముచేసిన వీరుని కామెనిచ్చి వివాహము జేసెదనని స్వయంవర ప్రకటనజేసెను. అనేకమంది రాజవీరులు ధనుర్భంగ మొనరింపలేక విఫలులై తిరిగిపోయిరి. చివరకు విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో యాదృచ్ఛికముగా జనకుని యజ్ఞశాలకు వచ్చి రామునికి శివధనస్సు జూపవలసినదిగా జనకుని గోరెను. జనకుని పూజామందిరమునుంచి అష్టచక్రములుగల నొక ఆయసపుమందసములోనున్న శివధనస్సును ఐదువందలమంది బలిష్ఠులగు క్షత్రియులతికష్టమువీాద నెట్టకేలకు జనకునిసభకు తీసికొనివచ్చిరి. విశ్వామిత్రుని యనుమతి బాలుడగు రామచంద్రుడాధనువు నందరు చూచుచుండగా నొకతృటిలో భంగముగావించెను. జనకుడు పరమానందభరితుడై సీతను రామున

కిచ్చి వివాహము జేయుటకు నిశ్చయించుకొనెను.

వివాహకాలమందు సర్వాలంకారభూషితయగు సీతను కళ్యాణమండపమువద్దకు తీసికొనివచ్చి రామునకెదురుగానుంచి యీవిధముగా జనకుడు పలికెను.

ఇయంసీతా మమసుతా సహధర్మచరీ తవ ।
ప్రతీచ్ఛచైనాం భద్రంతే పాణిం గృహ్ణీష్వ పాణినా ।
పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతాసదా ।

"ఈమె నాకుమార్తెయగు సీత; పతివ్రత, మహాభాగ, నీఛాయమాదిరి నిన్నువదలకుండా నీవెంబడి నిన్ననుసరించి వచ్చును. పాణిగ్రహణముచేసి స్వీకరింపుము"ని చెప్పెను. జనకుడుచెప్పిన మాటలలో నేమియు నసత్యములేదని తనజీవితములో నిరూపించిన మహాసాధ్వి జానకి.

ఆమె మహాపతివ్రత. పదునాల్గుసంవత్సరముల వనవాసము కష్టమైనను, భర్తతో సంతోషమున గడపినది. రాముడు, వనవాసమునకుబూర్వము, నయోధ్యయందేయుండి మాతా పితరులకు సేవజేయుచు, మరదులను మర్యాదతోను వాత్సల్యముతోను జూచుచుండమని సీతకాజ్ఞాపించెను. అప్పుడామె చెప్పినమాటలు వర్ణనీయములు.

హే ఆర్యపుత్ర ! తండ్రి, తల్లి, సోదరులు, పుత్రులు, కోడండ్రు, ఎవరిపుణ్యాపాపములను వారనుభవించెదరు. కాని, భర్తయొక్క సుకృతదుష్కృతకర్మఫలములలో సగభాగము

భార్య పంచుకొని తప్పక అనుభవించునని శాస్త్రములు జెప్పు చున్నవి. దశరథుడు నిన్నువసవాసమునకుబొమ్మని యాజ్ఞాపించి నపుడు సహధర్మచారిణి యగుసన్ను గూడ ఆదేశించినట్లే యని జెప్పుచున్నది. సతికి పతియేగతి. పదునాలుగు సంవత్సరములు భర్తతో వసవాసము చేయుట, రావణుడంతవా డెన్నిప్రయత్నములు చేసినను సతనికివశముగాకపోవుట, మొదలగు సంఘటన లామెపాతివ్రత్యమును నిరూపణచేయుచున్నవి. ఇంతియే గాక, ఆమె పాతివ్రత్యనిరూపణకు ప్రత్యక్షనిదర్శనములుగలవు. రాక్షసులు హానుమంతునితోక తగులబెట్టినారని తెలిసినపుడు, చింతిలినదై, "తనేపతివ్రతఅయినయెడల అగ్నిహోత్రుడు చల్ల బడుగాక" యని శపథము చేసినది. ఆప్రకారము తోకతగులబడు చున్నను ఆంజనేయునికి బాధకలుగలేదు. ఆంజనేయుడు విస్మయము చెంది యిదంతయు సీతపాతివ్రత్యమహిమేయని దల చెను. లంకలో సురరాక్షసులసమ్మఖమున నగ్నిప్రవేశము చేసియు, అయోధ్యలో ప్రజలనెదుట భూప్రవేశము చేసియు తనుపరిశుద్ధురాలనియు, మహాపతివ్రతయనియు నిరూపణ చేసినది.

సీతకు పతివ్రతాధర్మములన్నియు బాగుగా తెలియును. దశరథుడు వనవాసమునకుబూర్వము నాతెకు పతివ్రతాధర్మములన్నియు దెలుపుచు, పదభ్రష్టుడని రాముని హీనముగా చూడవలదని కోరును. ఆయునఆజ్ఞప్రకారము పతియడుగుల

లోనే నడచెదనని చెప్పుచూ ఆమెబల్కినవాక్యముల మూల్య ములు. "తీగలేనిది వీణ్రెమోగదు, చక్రములేనిది, రథము కద లదు, నూరుగురుకుమారులున్నను భర్తలేనిది భార్యకుసుఖము లేదు. తండ్రి, తల్లి, భ్రాతలు యిచ్చుసుఖమునకు మేరలేదని చెప్పుచున్నది. గనుక భర్త నేస్త్రీపూజసేయదు? అందులో సర్వగుణశ్రేష్ఠుడైన నా భర్తను, నేనెందుకవజ్ఞ చేసెదను? (అవజ్ఞ చేయునని యర్థము) స్త్రీలకు భర్తయేదైవమని దృఢముగా చెప్పుచున్నది. అన సూయ సీతకు బతివ్రతాధర్మములు బోధించెను. ఆమెబోధిం చినప్రకారము నడచుకొనెదనని చెప్పుచూ, బతివ్రతాధర్మ ములు తనకుదెలియుననియు, బాల్యమునందే తనకు జనకుడు బోధించెననియు చెప్పుచున్నది.

సీత, అవసరమైన యెడల, తన కార్యసాధనకెంతటి పరుషమైన వాక్యములైన నాడుటకు వెనుదీయదు. వనవాస ములోనున్న దుఃఖములు, దోషములు, భయములన్నియు తన భర్తతో దిరుగుటవలన సుఖములుగా మారునని చెప్పినది. అతని బాహుదుర్గముల మాటుననున్న యామెకు వన్యమృగ ములవలనగాని, రాక్షసులవలనగాని, భయముండదని నొక్కి వక్కాణించినది. మీదుమిక్కిలి, లాక్షణికులు, జ్యోతిష్కులు, తనకు వనవాసానుభవమున్నదని చెప్పినారనిగూడ బల్కినది. రాముడప్పటికి, అంగీకరించక, వనమునకు రావద్దనియు, సుకు మారియగు తను వనవాసకష్టములు భరించలేదనియు, అయో

ధ్యలోనే యుండి అత్తమామలకు శుశ్రూష చేయువలెననియు ఆజ్ఞాపించెను. ఆమె ఎంతబతిమాలినను రాముడు వినకపోవుటచే సీతకోపముచే నీవిధముగా బరుషమైన వాక్యములు బల్కుచున్నది. "నిన్ను అల్లునిగా బొందినప్పుడు నాతండ్రియగు జనకుడు స్త్రీయే, పురుషరూపములో నున్నాడని దలచెనా యేమి?" (నీవు పురుషుడవైన నీవిధముగా మాట్లాడవసియర్థము) మిగుమిక్కిలి సాభిమానముగా తనసంగతి చెప్పుచున్నది. ద్యుమత్సేనసుతుడైన సత్యవంతుని సహధర్మచారిణియగు సావిత్రిసమానురాలుగా నన్ను తెలిసికొనవలసినదని హెచ్చరిక జేయుచున్నది. (నీవు ఎక్కడికివెళ్ళితే అక్కడకు వచ్చితీరెదననియర్థము) ఇంకా అతికఠినమైన వాక్యములుగూడ ననెను.

శైలూషమివమాంరామ ! పరేభ్యోదాతుమిచ్ఛసి ॥

"ఇక్కడనేయుండి, వారికి, వీరికి సేవచేస్తూ వినయముతో నుండమని యాదేశించుచున్నావు. శైలూషునిమాదిరి నన్నితరుల కీయదలచుకొంటివా యేమి ?" అని శ్రోత్రదారుణమైన పలుకులు పలికెను. అప్పటికీ, రాముడు వెనుకాడుచున్నాడని తెలిసికొనినదై స్త్రీలు మామూలుగా పురుషులమీద నుపయోగించు చివరఅస్త్రము ప్రయోగించుచున్నది. "నిన్నే నమ్ముకొనియున్న నన్ను, నీవు తీసికొనివెళ్ళని యెడల, నిప్పుడే విషముబుచ్చుకొని ఆత్మహత్య జేసికొనెద"నని బాష్పశోకపరిప్లుతయై రాముని పాదములమీద ప్రాలెను. అంతట

రాముడు లొంగిపోయి యీ మెను తీసికొని వెళ్ళుట కంగీకరిం చెను. రాముడు ధర్మజ్ఞుడు గనుక ధర్మసంశ్రితమైన యీ మె వాక్యముల తిరస్కరింపలేక పోయెను. ఈవిధముగా సామదాన భేదదండోపాయములచేత తనకోరికను (భర్తతో వనవాసగమ నము) నెరవేర్చుకొనిన సహాధర్మచారిణి సీత.

పైవిధముగానే లక్ష్మణునిగూడ సీత బరుషవాక్యము లాడి తనకార్యము సాధించినది, మాయలేడి రూపములో నున్న మారీచుడు తన మృత్యుసమయమున, "హాసీతా! హాలక్ష్మణా! యని రాముని గొంతు ననుసరించుచూ ఆర్త నాదముచేసెను. ఆ యార్తనాదము విని తనభర్తకేదో ప్రాణ సంకటమైన పరిస్థితి ఏర్పడినదని తలచి, భయార్తయై లక్ష్మణుని వెంటనే రామునిసహాయమునకు బొమ్మని త్వరబెట్టెను. కాని లక్ష్మణుడందులకొప్పుకొనలేదు. సీతకుపితయై లక్ష్మణునియొక్క శీలమునే శంకించుచూ ఘోరమైన నిందావాక్యములు బల్కి నది.

అనార్యుడనియు, కులపాంసనుడనియు, నృశంసుడనియు, రాము నేదోవిధముగా జంపించితనపొందుకోరుచున్నాడనియు, తనుజీవించియుండగా నదిసంభవించదనియుగూడ గట్టిగా పల్కి నది. స్త్రీలకువాక్పారుష్యము సహజమునిమాత్రముబల్కి, వన దేవతలను, నవసాక్షులను సంబోధించి, యీ మెనుగాపాడుమని వారలప్రార్థించి, లక్ష్మణుడుబోయెను. ఈవిధముగా సీతప్రభవ

ర్తించుట, తనభర్తప్రాణముల నేదోవిధముగా రక్షించుకొన వలెనని ఆతురత కారణముగావచ్చును; కాని, నిరంతర పాద సేవజేయులక్ష్మణుని శీలముశంకించి, అనరానిమాటలనుటలో సీత హద్దుదాటిప్రవర్తించుచున్నదనుటలో సందియములేదు. దీనినిబట్టిచూడ, తన పూర్వజన్మ వృత్తాంతప్రకారము, రావణ వధకై జన్మించినస్త్రీగావున, నీవిధముగా బరుషవాక్యములాడి లక్ష్మణుని బర్ణశాలనుండి వెడలగొట్టినగాని, భవిష్యత్ కార్య క్రమము (తనఅపహరణము, రావణవధ) సక్రమముగా జరుగ వేమో యనినొకశంక సీతకుగలదేమో యని గోచరించు చున్నది. రాముని, రాక్షసవధకు, రావణవధకు, సీతప్రోత్సహించు చున్నదని నిదర్శనములు కొన్ని, రామాయణములో, గనబడు చున్నవి. రాముడు సుతీక్ష్ణాశ్రమమందున్నపుడు, ఋషులంద రతనికి రాక్షసులచేజంపబడిన మునులయొక్క అస్థిపంజరముల గుట్టలను చూపుదురు రాక్షసులదుండగములు సహించలేకుంటి మనియు, దండకారణ్యము రాక్షసులనిలయమనియు, నాదుర్మా ర్గులవధించి తమనురక్షించమనియు, రామునిప్రార్థింతురు. రాముడప్పుడు రాక్షసులనందరవధించెదనని వెంబడే ప్రతిజ్ఞ చేయును. అప్పుడు సీతసంతసించినదై ఆయుధములన్నియు రామునికి, తనకర్తవ్యము నిర్వహించుటకై యిచ్చును. రావణ వధసందర్భములో తనదృఢనిశ్చయము తెలియజేసినది. అంజ నేయు డశోకవనికలో నామెకు నమస్కారముజేసి తనవీపు మీద నెక్కవలసినదనియు, వెంబడే రామునివద్దకు తీసికొని

వెళ్ళెదననియు నుడివెను. దానికామె ఒప్పుకొనక యనేక కారణములు జెప్పెను. చివరకు రాముడువచ్చి రావణుని సమూలముగా (పుత్రమిత్రబంధుయుక్తముగా) వధించి తనను తీసికొని వెళ్ళినయెడల నది యుక్తమనియు, తనకోరిక గూడ నదియే యనియు చెప్పినది.

సీత ఋజుస్వభావురాలు. రామలక్ష్మణులు, లేనిసమయములో, రావణుడు యతిరూపములో "బ్రహ్మఘోషముదీరయన్" వేదమంత్రములు స్వరయుక్తముగాబఠించుచు, పర్ణశాలకడకొచ్చెను. సీతఅతనికి అతిధిసత్కారములు జేసి భిక్ష చేయుటకు రాముని కొరకై నిరీక్షించుచుండెను. ఇంతలో రావణుడా మి బూర్వవృత్తాంతమును గురించి యడుగగా నామె వివాహమొదలప్పటివరకు తనచరిత్రయు, రామునిచరిత్రయు, పూసగుచ్చినట్లు, దాపరమేమియు లేకుండా, చెప్పెను. అంత రావణుడు తన స్వవృత్తాంతమును కొంతచెప్పి, ఆమెను బ్రేమించితిననియు తననువివాహము చేసికొనుమనియు కోరెను. కాని సీత బరుషమైనమాటలాడి అతనిని తిరస్కరించెను. సీత సహజముగా భయపడు స్వభావముగలదైనను, ధర్మాచరణములోను, శీలరక్షణ సమయమందునూ, పట్టుదల, నిర్భయత్వమును జూపును. "అహంరామమనువ్రతా"యను పల్లవితో తను రాముని నీడననుసరించి పోయెడిదాననియు, రాముని నుంచి తనను విడదీయుట నేరికి సాధ్యముగాదనియు, ఆప్రయ

త్నమువలన రావణునికి సర్వనాశనము సంభవించునని చెప్పెను. ఆకలిగొనిన సింహముయొక్క కోఱలనూడబెకుకుట ఎంతదుర్లభమో, ప్రజ్వలించుచున్న అగ్నిని వస్త్రములో మూటగట్టుకొని తీసికొనివెళ్ళుటయెంత అసంభవమో, రాముని ప్రియభార్యను గొనిపోవుట యంతదుర్లభమని వచించెను. ఇంద్రునిభార్యయగు శచీదేవినపహరించి బ్రతికినబ్రతుక వచ్చునుగాని రామునిభార్య నెత్తుకొనిపోయి జీవించుట యసంభవమని తీక్ష్ణముగా బలికెను. మీదుమిక్కిలి రామునికి దనకు హస్తిమశకాంతర భేదమున్నదని బలికెను.

సింహమునకు నక్కకు ఎంత భేదముగలదో గరుత్మంతునికి, కాకికిని, బంగారమునకు, సీసమునకు, చందనమునకు మట్టి బురదకు నెంతభేదముగలదో అంతతారతమ్యము రామునకు రావణునకు గలదని స్పష్టముగానుడివెను. నిర్మలసరస్సులో పద్మములమధ్య చరించు రాజహంసతో క్రీడించు రాజహంసిని తృణకూపములో దిరుగు జలవాయసమును బేమించజాలదని కఠినముగా మాట్లాడెను. దానికి రావణుడు క్రోధవిస్ఫారితేక్షణుడై ఆమెనెత్తుకొని రథముమీద, తన అంకమున కూర్చొనబెట్టుకొని ఆకాశమార్గమున లంకకు గొనిపోయెనని వర్ణింపబడియున్నది. తీక్ష్ణదంష్ట్రుడు, మహాభుజుడు, భయంకరుడునైన రావణునిజూచి భయపడి వనదేవతలందరు పారిపోయిరి. "స్థిమితం గంతుమూరేభేభయాత్ గోదావరినదీ" గోదావరినది

గూడా రావణునిజూచి భయపడి మెల్లగాప్రవహించ మొదలి
డినదట ! లంకకు గొనిపోయినతర్వాత సీతను మనోహర
హర్మ్యమునందుంచి, ఆమెను వశబరచుకొనుటకై యనేకవిధ
ముల బ్రయత్నించెను. చివరకు ఎవరికితలవంచని రావణుడు
తనకు బ్రొయ్యక్కచున్నాడని తనదశశిరములతో ఆమెపాదము
లకు నమస్కరించెను. కాని మహాపతివ్రతయగు సీత లొంగ
లేదు.

జీవముతోనున్న సీతను నీవుపొందజాలవు. నిర్జీవమైన యీ
శరీరమును నీవేమిజేసినను సరే ! అని కఠినముగా రావణునకు
బ్రత్యుత్తరమిచ్చెను. నలకూబరుని శాపభయమువలన, సీతను
బలాత్కరించుటకు రావణుడు సాహసించలేదు. మరల పుష్య
శుద్ధ పౌర్ణమినాడురాత్రి, కామోద్రేకుడై సీతవద్దకువచ్చి బ్రతి
మాలుకొనెను. ఆమె పరుషవాక్యములాడి రావణుని నిందిం
చెను. ఆమెకు రెండునెలలు మాత్రమే ఇక వ్యవధియని బెద
రించి, కాపలాయున్న రాక్షసస్త్రీలతో నామెను బాధించుడని
చెప్పి రావణుడు తన అంతఃపురమునకు బోయెను. ఈసంభా
షణ జరుగుచున్నసమయమున పవనాత్మజుడు వృక్షముమీద
నుండి జూచుచు వినుచుండెను.

రావణుని ప్రయత్నములన్నియు విఫలమైనను సీత
యందు ప్రబలవాంఛ యుండుటచే నామెను మోసగించి వశ
బర్చుకొన జూచెను. యుద్ధము ప్రారంభించబోవుముందు విద్యు

జిహ్వాడను నొక రాక్షసునిచే మాయరాముని శిరస్సునొకటి సృష్టించి, దానిని సీతముందుబెట్టి, తన సేనాపతియగు ప్రహస్తుడు రాముని చంపినాడనియు, రామునిమీద నాశలువదలుకొని తనను ప్రేమించవలసినదిగా రావణుడు సీతనుకోరును. ఇదిరావణుని మాయయని, విభీషణునిభార్యయగు సరమవలన, తెలిసికొనినదై దానికి లొంగలేదు.

సీతదృఢవ్రతురాలు. ఓర్పుగలసాధ్వి. కావునే రావణుడు, రాక్షసులు, తననెన్నివిధముల బాధపెట్టినను, తనశీలమును గాపాడుకొనుచు, రావణవధపర్యంతము లంకను విడచిపెట్టలేదు. రాక్షసస్త్రీ లెంతతర్జనభర్జనలు చేసినను జంకలేదు. శరీరమును ఛిన్నాభిన్నములుగా ఖండించినను సరే; ప్రజ్వలించుచున్న నగ్నిలో బడవైచిననుసరే, నేనుమాత్రము రావణుని నా ఎడమ పాదముచే నైనస్పృశించనని తనదృఢనిశ్చయము చెప్పెను.

సీతధర్మములేకాక ధర్మసూక్ష్మములుగూడ దెలిసిన వ్యక్తి. రావణవధానంతరము ఆంజనేయుడు, రాముని యాజ్ఞ ప్రకారము, సీతకడకువచ్చి, రావణుడు వధింపబడెనసియు, భర్త కుశలుడుగానున్నాడనియు చెప్పెను. ఆమెసంతసించినదై తన దర్శనమునకై వేచియుంటిసని రాముని తో మనవిచేయుమనెను రాముడామెను తీసికొనిరమ్మనమని యాజ్ఞ నీయలేదు. పరిస్థితులుచెప్పి కుశలప్రశ్నములడుగమనియే ఆంజనేయులతో

చెప్పెను. అందువలన భర్తనుచూచుటకు వెంబడే బయిలుదేర లేదు.

రెండవది, ఆమెయనుమతినిచ్చినయెడల, నామెనుబాధిం చిన రాక్షసస్త్రీల నందరిని హనుమంతుడు వధించెదనని చెప్పెను. ఆమె ఒప్పుకొనలేదు. వారు, వారిరాజాజ్ఞప్రకారము చేసిర నియు, వారిదోషమేమియు లేదనియు, వారినివధించుట ధర్మ ముగాదని బలికెను. పిమ్మట రాముడు, విభీషణుని సీతను తీసికొనిరావలశినదిగా నాదేశించెను. మహాపతివ్రతగాన, తనని జస్థితి తెలియచేయుటకై అస్నాతయై తనుధరించిన మలినవస్త్ర ముతోనే రామునిజూడతలచెను. కాని రాముడుస్నాతయై సర్వాలంకారములతో రావలశినదిగా యాజ్ఞాపించెను. అందు వలన స్నానముచేసి సర్వాలంకారభూషితయై రామునిసన్నధికి వచ్చెను. రాముడు సీతనుజూచి పరుషములైనవాక్యములు బలు కును. పరపురుషుని, మీదుమిక్కిలి దుష్టచారిత్రుడైన రావ ణుని యధీనములో నొకసంనత్సరమున్న స్త్రీని, సత్కులీనుడగు పురుషుడెవ్వడు స్వీకరించుననియు, తనుయధేచ్ఛగా, ఇష్టము వచ్చినచోటికి బోవచ్చుననియు, లక్ష్మణ, భరత, సుగ్రీవ, విభీ షణులలో నెవరివద్దకై నను బోవుచ్చునని దుర్భాషలాడెను.

సీత స్వాభిమానముగల స్త్రీ, భర్త జనసమూహము నెదుట, యీవిధముగా పరుషోక్తులాడుట సహించలేకపోయినది. శోకపీడితయై వినమ్రభావముతో పరుషమైనమాటలతో సమా ధానము చెప్పుచున్నది. "నావంటి నిర్దోషినిగూర్చి యీవిధ

మున వినగూడనిమాటలు బల్కుచున్నావు. ఏమియు తెలియని పురుషుడు, తెలియనిస్త్రీతో మాట్లాడునట్లు సంభాషణ చేయు చున్నావు (నీబోటిపురుషుడు నాబోటిస్త్రీతో మాట్లాడవలసిన దీవిధముగాదు). అని స్పష్టముగా చెప్పుచున్నది. నీవనుకొని నట్లు నేను సందేహాచారిత్రనుకాను. రావణుడు బలిష్టుడుగాన నాశరీరమును తీసుకొని వెళ్ళగలిగెను. కాని నామనస్సు నీ యందే లగ్నమయియున్నది. దానికిసాక్ష్యము పవానాత్మ జుడే! రావణుడు, రాక్షసులు, తన నేవిధముగా బాధపెట్టి నది, తను ఏవిధముగా ప్రవర్తించినది మారుతిస్వయముగా చూచినాడు. చాలాకాలమునుంచి, నాతో కలసిమెలసియుండి గూడ నీవీవిధముగా బల్కుట సమంజసముగాదని చెప్పుచు న్నడి. హే పురుషశార్దూల! అల్పపురుషునిమాదిరి నీవు కేవ లము యీర్ష్య, కోపమునే అనుసరించితివి. యుక్తాయుక్తములు విచారింపక, స్త్రీజాతినంతయు, నొకేవిధముగా దలచి, నావిష యములో నీవింతలఘువుగా మాట్లాడుచుంటివని తీవ్రముగా బల్కినది. అభిమానముగల స్త్రీగాన, జనసమూహము నెదుట నీవిధముగా నిందితురాలైన స్త్రీకి మరణమే మేలని దలచినదై లక్ష్మణుని చితిబేర్చమనికోరును. లక్ష్మణుడు సాభిప్రాయముగా రాముని వంక జూచెను. రాముడేమియు మాట్లాడక అనుజ్ఞా పూర్వకముగా సమ్మతించినటుల సూచనచేయును. శోకసంత ప్తుడై లక్ష్మణుడగ్నిని ప్రజ్వలింపచేసెను. అప్పుడగ్ని హోత్రుని చుట్టూ ప్రదక్షిణముచేయుచూ, నేను పతివ్రతనే అయినయె

డల, ప్రతిక్షణశుద్ధిగా రామునియందే నామనస్సు లగ్నమయిన యెడల "తదాలోకస్యసాక్షే మాం సర్వతః పాతుపావకః" లోకసాక్షియగు నగ్నిహోత్రుడు నన్ను రక్షించుగాకయని వహ్నిలోదుముకును. అప్పుడు 'హాహాకారములు, కోలాహలము, బయలుదేరినది. వానరరాక్షసులందరికి రాముడు కనినుడుగాను, నిర్దాక్షిణ్యుడుగాను కనబడెను. దేవతలందరు పితామహపురస్సరముగా ప్రత్యక్షమయి, సీత తగులబడుచుండగా, యీవిధముగా నుపేక్షచేయుట తగదని రామునితో నుడివిరి. అప్పుడు హవ్యవాహనుడు దివ్యాంబరభూషితురాలైన సీతను స్వయముగా తీసికొనివచ్చి, సీత పరిశుద్ధురాలనియు, నేదోషము లేదనియు చెప్పి రాముని స్వీకరించవలసినదిగా యాజ్ఞాపించును. అప్పుడు రాముడామె శుద్ధస్వభావురాలని తనకు తెలుసుననియు, ప్రత్యయార్థమందరిఎదుట నామె పావనత్వము నిరూపణగానిది రాజగుతను స్వీకరించుట ధర్మముగాదనియు, అందువలన నుపేక్షించితిననిచెప్పి సంతోషపూర్వకముగా నామెను స్వీకరించెను.

తర్వాత కొలదికాలమునకే, సీత గర్భవతియగుట, ప్రజలు, రాముడేవిధముగా పరాధీనములోవున్న సీతను తన దగ్గరవుంచుకున్నాడని నిందమోపుట, ఆనిందబాపుకొనుటకై గర్భవతియగుసీతను అరణ్యములో దింపిరమ్మనమని లక్ష్మణుని కాదేశించుట జరిగినది. పొంగిపొరలివచ్చుచున్న శోకమునాపు

కొని, లక్ష్మణుడు, సీతను వాల్మీకి ఆశ్రమపరిసరప్రాంతములలో వదలి అయోధ్యకు వచ్చెను.

మరల సీత రాముని 12 సంవత్సరములతర్వాత సంద ర్శించినది. ఈలోపల వాల్మీకిఆశ్రమములో కుశలవులజననము, వారికి వాల్మీకి విద్యాభ్యాసముచేయుట జరిగినది. వాల్మీకి తనుప్రాశిన రామాయణము కుశలవులకు కంఠస్థముగావచ్చిన టుల అధ్యయనముచేయించెను. వారిచేత రామాయణగాథ తంత్రీలయసమన్వితముగా తనయాశ్రమములో బాడించెను. వాల్మీకి ఆదేశానుసారము లవకుశులిద్దరు అయోధ్యలో రామునిసన్నిధి, రాజసభలో రామాయణము మనోహరముగా బాడి వినిపించిరి. తనకుమారులని తెలిసికొనినవాడై మరునాడు వాల్మీకులవారితోసహా సీతను తనరాజసభకు బిలిపించెను. ఆమె పరిశుద్ధురాలని తెలిసిగూడ, పరిషన్మధ్యమున ప్రజల ప్రత్య యార్థమామెను శపథమును చేయమనిగోరెను. అప్పుడు వాల్మీకి మేఘగంభీరస్వనముతో రామునిఉద్దేశించి యీక్రిందివిధముగా బలికెను.

హేరామ! ఈమె నీసహధర్మచారిణియగుసీత. పరిశుద్ధు రాలు. నీమనస్సు లోకోపవాదభయముచే కలుషీకృతమగు టచే, పవిత్ర యనితెలిసిగూడా నీవామెను నాయాశ్రమపరిసర ములలో త్యజింతివి నీకుతగిన ప్రత్యయు మీమిచూపించ గలదు, ఈయిద్దరు నీకుమారులు. ఆఖండజాతకులు. నేను

సత్యము చెప్పుచున్నానని బలికెను.

తమరు చెప్పినది సత్యమే. ఆమె నిష్కల్మషురాలని తెలిసికూడ లోకోపవాదభీతిచే త్యజించితిని. నిందమోపిన యీప్రజల యెదుటనే ఆమె పరిశుద్ధ్యత నిరూపణ అయిన యెడల నీలోకోపవాద భయముపోవును. తనమీద ప్రజలు మోపిన నిందను తీసివేయువలసిన బాధ్యత రాజునందుగలదు. అందువలన సీతచే శపథముచేయించుడని మిమ్ములను గోరుచున్నానని వాల్మీకితో రాముడునుడివెను. లోకోపవాదము దుస్సహము. అభయముచేతనే నిర్దోషియని తెలిసికూడా సీతను వదలివేసితిని. తమరు క్షమింతురుగాక" యని రాముడు బలుకుచున్నాడు. పరిశుద్ధురాలని యిదివరలో నిరూపణయై నను, ఆమె పరిశుద్ధురాలని తనయాత్మ గట్టిగాచెప్పుచున్నను, రాముడీవిధముగా ప్రత్యయమొందుకు గోరుచున్నాడనిన (పైన ఆయనచెప్పిన కారణములటుండగా) దానికి ఒకటే సమాధానము. తనభాగ్యను విష్ణువుచంపిన కారణముచే భృగుమహర్షి కోపోద్రేకుడై యతనిని "నీవు మానుషరూపములో దశరథ పుత్రుడవై జనించెదవనియు, అచిరకాలములోనే పత్నీవియోగము కలుగుననియు" శపించెను. ఆ శాపఫలప్రాప్తి కాలమిప్పుడు వచ్చినది. సీతావియోగము తప్పదు. ఈసంగతి శోకసంతప్తుడైన లక్ష్మణునకు సుమంతుడు చెప్పెను. పైనచెప్పిన విధముగా రాముడుప్రత్యయము గోరినకాని సీతావియోగము జరుగదు.

సీత శపథముచేయు సమయమున బ్రహ్మర్షులు, దేవర్షులు, పితామహాపురస్సరముగా నింద్రాదిదేవతలు అందరు ప్రత్యక్షమయిరి. అయోధ్యప్రజలంద రాబాలగోపాలము అశ్వమేధయాగశాల ప్రాంగణమందు ప్రవేశమయిరి. అప్పుడు భూదేవినుద్దేశించి సీతచేసిన శపథము వినుడు. "మనసా, కర్మణా, వాచా రాముని నేను పూజించుచానానే అయినయెడల, రామునితప్ప యింకొకరిని మనసాపిచింతించని దానానైనయెడల, "ఓ మాధవీదేవి ! నాకు దారియిమ్ము" అని ప్రార్థించెను. ఈ శపథమొనర్చిన తర్వాత అందరు నాశ్చర్యచకితులై చూచుచుండగా భూమిబ్రద్దలాయెను. పుష్పవృష్టి గురిసెను. భూవివరములోనుంచి, దివ్యపన్నగ శిరోధార్యమైన నవరత్న ఖచిత సింహాసనమొకటి పైకివచ్చెను. దానిమీద భూదేవి మందస్మితవదనారవిందయై గూర్చుండెను. ఆమె సీతను కౌగలించుకొని, హర్షోత్ఫుల్లనయనయై, ఆమెనుతన యంకముమీద నిడుకొని సింహాసనముతోసహా భూగర్భములోని కంతర్ధానయయ్యెను. భూవివరము మూసికొనిపోయెను. జగత్తంతయు నొకముహూర్తము సంమోహితమయ్యెను.

రాముడు తర్వాత 11,000 సంవత్సరములు రాజ్యము చేసి అశ్వమేధాది క్రతువులొనర్చి వైకుంఠమున కరిగెను.

సీత, రామునిమాదిరి, మాయకులోబడినట్లు గనబడదు. ఆమె రావణవధ కవతరించినశక్తిగా కనబడును. రావణవధ

జరిగినతర్వాత కొద్దికాలముమాత్రమే రామునితో కాపురము చేసినది. కుశలవులు జన్మించిన తదుపరి యీమె రామునితో కలసియుండలేదు. కుశలవులకు 12 సంవత్సరములు రాగానే, వారిని రామునికర్పించి భూగర్భములో నంతర్ధాతయయ్యెను. వంశమునిలుపుట కిద్దరుకుమారులగనెను. ఆమెవచ్చిన పని పూర్తిఅయినది. అనంతరము నొకక్షణముగూడ నామె యుండదలచుకొనలేదు. ఆమె అవతారసమాప్తిఅయినది. దీనిని బట్టిచూడ నామె సంగతియీమెకు తెలిసిన విజ్ఞురాలనియు, రావణవధకు రాముని ప్రేరేపింపనుద్భవించిన మహాశక్తియని వ్యక్తమగుచున్నది. సీతలేనిది రామాయణములేదు. రాముని కార్యరంగమున నడిపించి రావణవధచేయించినది సీతయే!!

దశరథుని భార్యలు

దశరథునికి ముగ్గురుభార్యలు. కౌసల్య, సుమిత్ర కైకేయి. వీరుగాక 360 మంది భార్యలున్నారని రామాయణ ములో చెప్పబడియున్నది. వారివిషయమై చెప్పదగినదేమియు లేదు.

కౌ స ల్య

దశరథుని జ్యేష్ఠభార్య. పట్టమహిషి. దైవభక్తి గల సాధ్వి. ధర్మజ్ఞురాలు. ఇక్ష్వాకులదైవమగు శ్రీ జగ

న్నాథస్వామికి నిత్యము పూజాపునస్కారము లొనరించెడిది. విష్ణుభక్తిగలది. కనుకనే, మహావిష్ణువామెగర్భమున నుదయించెను.

రామవనవాస వృత్తాంతమువిని శోకముచే మార్చిల్లినది. సర్వవిధముల నాతని వనవాసగమనమునుంచి విరమింప చేయుటకై ప్రయత్నించినది. కాని విఫలురాలైన పిదప రాముని ఆశీర్వదించి రక్షాబంధనముచేసినది. దిక్పాలకులను, పంచభూతములను నవసాక్షులను, వనదేవతలను, రాముని రక్షించవలశినదిగా ప్రార్థించినది. నక్షత్రగ్రహ దేవతలకు విధి పూర్వకముగా జపహోమతర్పణలు గావించి బ్రాహ్మణులకు విరివిగా దక్షిణలొసగినది. వశిష్ట, విశ్వామిత్రులకడ నభ్యసించిన ధనుర్వేదవిద్య, మాతృపితృశుశ్రూష, నాతని రక్షించుగాక యని ఆశీర్వదించినది. మాతృస్వస్త్యయనమను బేరయామెనుడివిన మంగళాశీర్వచన శ్లోకములు గమనింపదగివవి. "వన వాసదీక్ష పూర్తిగాజరిపి, పితృనాజ్ఞ నెరవేర్చి, క్షేమముగా వచ్చెదవుగాక" యని రక్షాబంధనము చేసినది. దండకారణ్యమ రాక్షసముగాచేసి, రావణ, కుంభకర్ణాది మహావీరుల వధించి, క్షేమముగా రాముడయోధ్య చేరినాడనిన, (రాముని పరాక్రమమటుండగా) దానికికారణము కౌసల్యాదేవి చేసిన రక్షాబంధనమే.

భరతుని జూచి మొదట నిష్ఠూర్యముగాబల్కినను. అతని నిష్కల్మషప్రవర్తన జూచి, తనయభిప్రాయము మార్చు

ొని, నాతనియందవ్యాజానురాగము జూపిన సాధ్వి. రాముడు వనమునకు వెళ్ళినపిదప, దశరథుని పరుషవాక్యములాడెను. అతను బాధపడినాడని తెలుసుకొని వెంటనే క్షమార్పణ గోరిన పతివ్రత.

సు మి త్ర

ఈమె దశరథుని రెండవ భార్య. లక్ష్మణశత్రుఘ్నుల మాత. ధైర్యశాలి. ప్రాజ్ఞురాలు. త్యాగమూర్తి.

వనవాసమునకు బోవుముందు సీతారామలక్ష్మణులు ముగ్గురు, దశరథునికి, అతని ముగ్గురు భార్యలకు, వరుసగా ప్రదక్షిణములు చేసి వారియాశీర్వాదముల బడసిరి, తనకు నమస్కరించిన లక్ష్మణుని లేవదీసి సుమిత్ర ఆశీర్వదించి హితబోధ చేయును. త్యాగమూర్తిగనుకనే, వనమునకు పంపనవసరము లేకపోయినను, తనకుమారుని సీతారాములసేవకై బంపినది. ఈవిషయములో, భర్తను వదలుకొనుటలో ఊర్మిళమహత్తర మైన త్యాగము చేసినదని చెప్పవలయును. సుమిత్ర అపార మైన దుఃఖమును నిగ్రహించి తనకుమారునికి అద్భుతమైనహిత బోధచేసినది. ఆసమయమున నామెబల్కిన వాక్యములమూల్య ములు. "నాయనా! నీవు వనవాసమునకు, సీతారాముల సేవకు సృష్టింపబడినవాడవు. వారికేమియు బ్రమాదము కలుగ కుండ అప్రమత్తతతో సేవజేయుము. వ్యసనములోగాని, సమృ

ద్ధిలోగాని; రాముడే నీకుగతి. జ్యేష్ఠభ్రాతకు సేవచేయుట మన కులాచారము, ధర్మము.

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజమ్ ।
అయోధ్యామటవీం విద్ధి గచ్ఛతాత యథాసుఖమ్ ॥

రాముని దశరథునిగా (తండ్రిగా) చూడుము. సీతను నన్నుగా (తల్లిగా) చూచుకొనుము. అరణ్యమునే అయోధ్యగా చూచుకొనుము. నీకు మంగళమగుగాక వెళ్ళుమ"ని యాదేశించిన ప్రాజ్ఞురాలు.

రామగమనానంతరము దుఃఖించుచున్న కౌసల్య నీ క్రిందివిధముగా నోదార్చినది. "అమ్మా! నీరాముడు పురుషోత్తముడు. తండ్రిని సత్యవాదునిగా చేయుటకై రాజ్యసర్వస్వమును త్యాగముచేసిన ధర్మమూర్తి. అవక్రమపరాక్రముడు. నాకుమారుడైన లక్ష్మణుడన్ని విధముల నండగాయుండగలడు. అటువంటి మహాపురుషుని విషయములో నీవుశోకించుట తగదు. రాముడు దేవతలకు దైవము. భూతములకు భూతసత్తముడు. సీతతోను, రాజ్యలక్ష్మితోను, గూడుకొనిన వాడై త్వరలోనే పట్టాభిషేకము చేసికొనగలడ"ని హితబోధ చేసిన విజ్ఞురాలు. దశరథునికిగూడా దుఃఖసమయములో ధైర్యముకలిగించి సేవచేసిన ప్రాజ్ఞురాలు, పతివ్రత, త్యాగమూర్తి.

కై క

ఈమె దశరథుని మూడవభార్య. కేకయదేశపు రాజగు అశ్వపతిమహారాజు కూతురు. మహాసుందరి. ఆమె యందత్యంతమోహము గలవాడగుటచే దశరథుడా మెకోర్కెలు తీర్చుచుండెడివాడు. భరతునికి, తల్లి నిగురించి, రామవనవాసము నకు బూర్వముగూడ సదభిప్రాయమున్నట్లు గనబడదు. స్వార్థ పరురాలు. క్రూరురాలు, కోపిష్ఠి, ప్రాజ్ఞురాలనుదురభిమానము గలస్త్రీ యనిచెప్పినాడు. బీజరూపమున యీదోషములున్న వేమోగాని, మంథరప్రోద్బలము చేయునంతవరకు మంచిదిగానే కనబడినది. రామునిపట్టాభిషేకవిషయమై ప్రథమమున మంథర చెప్పినప్పుడు కైకయిచ్చిన సమాధానము. "రామునిలోగాని, భరతునిలోగాని, నాకిసుమంత బేధమేనియుకనపడుటలేదు. కౌస ల్యకంటె, నాకే ఎక్కువ శుశ్రూషచేసెడివాడు. ధర్మజ్ఞుడు, జ్యేష్ఠుడు" అన్నివిధముల రాముడే అర్హుడని చెప్పి తనమెడలో హారముతీసి పారితోషికముగా మంథరకిచ్చినది. కాని మంథర ప్రోద్బలమువలన, సహజముగా నర్థకామపరురాలుగాన, భర తాభ్యుదయముకొరకై, అతను నిష్కంటకముగా రాజ్యము చేయుకొరకై, భరతుని పట్టాభిషేకము, రామవనవాసము కోరినది.

దశరథునియొక్కయు, రామునియొక్కయు, ఋజుప్రవ ర్తన, సత్యసంధత తెలిసినదిగనుకనే ముందర వారిద్దరిచేవాగ్ద

నము చేయించుకొని, వారిని సత్యపాశబద్ధులుగాచేసి, పిమ్మట తనకోర్కెలుచెప్పి తనకార్యము సాధించుకొనిన నిపుణురాలు. కైకవరములు కోరుముందు, దశరథుడు తనకోర్కెలు దీర్చెద నని వాగ్దానము చేసియున్నాడనియు, ఆప్రకారము తనునడచు కొనవలసినభాధ్యత యున్నదనియు, సూర్యచంద్రులను, గ్రహ తారకలను, దేవతలను, సాక్షులగాపుండమని సంబోధించిన పిదపనే తనకోర్కెలు వెలిబుచ్చినది. రామునిగూడా నావిధము గానే ముందుగా సత్యపాశబద్ధునిగాచేసి, తదుపరి తనకోర్కె లను దెలిపినది. రాముడుగూడా, తనకు రెండునాలుకలు లేవ నియు, తప్పకతండ్రియాజ్ఞప్రకారము వనవాసమునకు వెళ్ళెద ననియు తనదృఢనిశ్చయము చెప్పెను. సంతసించినదై రాముని త్వరగా వెళ్ళమని తొందరపెట్టినది. "నీవుత్వరగా పురమువదలి అరణ్యమునకు బోవలసినది. అంతవరకు నీతండ్రిస్నానము చేయడు. భోజనముచేయడనిగూడ చెప్పినది. ఇంతకంటె నిర్ల జ్జావ్యాపారత్వము, క్రూరత, వేరేయుండదు.

వనవాసమునకు బోవుముందు కైక సీతకుగూడా, కట్టు కొనమని, నారచీరలిచ్చినది. ఆ దృశ్యమునుజూచి అందరు శోకసంతప్తులైరి. వశిష్టుడు కైకను నిందించును. సీతనుగూడ వనవాసమునకు బొమ్మనమని తనుగోరలేదనియు, సహాధర్మ చారిణి గనుక భర్తవెంబడి వెళ్ళుచున్నదనియు, ఆమెకు నార చీరలిచ్చుట గర్హ్యమనియు వశిష్టుడు దూషించెను. దశరథుడు గూడ కైకేయిని నిందించి, సీతాదేవికి మంచిచీరలు, ఆభరణ

ములు, 14 సంవత్సరములకు సరిపోయినవి యిప్పించెను. నిజముగా కైకేయి, అనుకొనినంత దుష్టురాలుకాదేమో యని కనబడుచున్నది. కొంత అర్థకామపరురాలు గావచ్చును. మంథర ప్రోద్బలము వలనను, భరతుని శ్రేయస్సుకొరకు, దశరథుని వరములుగోరినది. తదుపరి తనతప్పు తెలిసికొనినదై ఆమెవేమియు మాట్లాడలేదు. దీనినిబట్టిచూడ కైక, ప్రజలను కొనినంత నిందితురాలు కాదనియు, దైవప్రేరేపణవలన రాముని వనవాసముగోరి తద్వారా రావణవధకు నాందివేసి జగత్తుకు మేలుచేసినవారిలో నొకతెయని చెప్పవచ్చును.

మంథర

వాల్మీకి మంథరను బహుచిత్రముగా రామాయణ గాథలో ప్రవేశబెట్టినాడు.

జ్ఞాతిదాసి యతోజాతా కైకేయ్యాతు సహోషితః।
ప్రాసాదం చంద్రసంకాశ మారురోహ యదృచ్ఛయా ॥

అజ్ఞాతకులగోత్రురాలు, కైక వివాహకాలమందు ఆమె వెంబడి 'కన్యాదాసి (జ్ఞాతిదాసి)గా పంపబడిన యొకస్త్రీ. రామపట్టాభిషేకమునకు క్రిందటిరాత్రి 'యదృచ్ఛయా' చంద్ర సంకాశమైన కైకేయీప్రాసాదము నధిరోహించినదట. 'యదృచ్ఛయా' (తలవనితలంపుగా) అని యనుటలో మంథరమన

స్సులో నప్పటికేమియు దురుద్దేశములేనటుల గోచరమగుచు
న్నది. ఆమె మేడమీదినుంచి జనసమ్మర్దముతో క్రిక్కిరిసి
యున్న రాజమార్గము చూచినది. జనులానందోత్సవములలో
నిమగ్నులై యుండిరి. కౌసల్య సంతోషముతో విరివిగా దాన
ధర్మములు చేయుచుండెను. కౌసల్యదాసి యుత్సాహముతో
నటునిటు దిరుగుచుండెను. ఈ దృశ్యమంతయు మంథరచూచి
నదై వెంటనే యీకోలాహలమునకు కారణమేమని కౌసల్య
దాసిని ప్రశ్నించినది. ఆమెనవ్వుచూ హేళనపూర్వకముగా
"ఓసీ నీకు తెలియదా! మాయమ్మగారి కుమారుడైన రాము
నకు తెల్లవారగానే పట్టాభిషేకము జరుగనున్నదని" చెప్పెను.
అంతవరకు మంథరకే దురుద్దేశ్యములేదు. అదివరకు తన
యందు గౌరవభావము చూపించుచుండిన కౌసల్యదాసి యీ
రోజు హేళనచేయుట సహించలేకపోయినది. కౌసల్యరాజమా
తఅయినయెడల నామెదాసికిముందు ప్రాముఖ్యతవచ్చునని
యీర్ష్యాభావముతో రామపట్టాభిషేకము విఘ్నమొనరించు
టకు గడగినది. కైకేయి, పట్టాభిషేకవార్త విని సంతసించి
నది. మంథర సహించలేక నామెకురాజధర్మములు తెలియ
వనియు, జ్యేష్ఠునకెప్పుడు తనతర్వాతసోదరునియందు ద్వేషభా
వముండుననియు, రాముడు రాజైన యెడల భరతునికి ప్రమా
దముగలుగుననియు చెప్పెను. అదియునుగాక రాముని పట్టాభి
షేకమైనప్పటినుండి, తను కౌసల్యకు దాసిగానుండవలసివచ్చు
నని, అంతకంటె హేయమైనపరిస్థితి, పౌరుషముగలస్త్రీకి, వేరే

లేదనియు, రాముని వనవాసమునకు బంపినయెడల భరతుడు నిష్కంటకముగా రాజ్యముచేయవచ్చునని, అనేకవిధముల దుర్బోధలుచేసి, కైకనుఒప్పించి, ఆమె దశరథుని రెండువరములు కోరునట్లుగా చేసినది. ఈవిధముగా తనప్రతిజ్ఞ సాధించిన కుతంత్రురాలు మంథర. మరల నామె ప్రస క్తి రామాయణములో, నొకసారితప్పరాదు.

మంథర కౌసల్యదాసితో మాట్లాడినతర్వాత ఆమెకు పట్టాభిషేకవిఘ్న మొనరింపవలెనని దుర్బుద్ధిపుట్టినది. అదివర కామె కేదురుద్దేశములేమ. అకస్మాత్తుగా నీదుర్బుద్ధి పుట్టుట వలన, అదిదైవప్రేరేపణయేననియు, ఆమె పట్టాభిషేకవిఘ్న మొనర్చి, రావణవధకు నాందివేసినపాత్రలలో ముఖ్యురాలని నిస్సందేహముగా చెప్పవచ్చును. పద్మపురాణములో మంథర యనునప్సరసను దేవతలేకుబ్జరూపములో కైకదాసీగాపంపినా రనియున్నది. రామపట్టాభిషేకమునకు విఘ్నముకలిగించుటకే మంథరను దేవతలు బంపినారనిగూడ చెప్పబడియున్నది.

తా ర

తార వాలిభార్య. అంగదుడామె కుమారుడు. వాలి మరణించినతర్వాత సుగ్రీవుడామెను భార్యగా స్వీకరించెను. అఖండమైన తెలివితేటలు గలది. నిపుణతకు, చాకచక్యమునకు

పెట్టినపేరు. తెలివితేటలుగలస్త్రీని తోటియబలలు "తార" యనిపిలుచుట యీరోజులలోగూడపరిపాటి అయినది. సుందరి. వాల్మీకులవారామెను "తారాధిపనిభాననా" యని వర్ణించెను.

రాముని యాదేశానుసారము వాలితో రెండవసారి యుద్ధమునకు సుగ్రీపుడు కిష్కింధకువచ్చినపుడు తార వాలిని యుద్ధమునకు బోవలదని, ప్రార్థించెను. ఆమె సహేతుకమైన కారణములు చెప్పినది. (1) క్రిందటిరోజు దెబ్బలుతిని పారిపోయిన సుగ్రీవుడు మరల మరునాడే ద్వంద్వయుద్ధమునకుపక్రమించుటచే నేదోగొప్ప సహాయమతనికుండితీరవలయును. (2) అతని సింహనాదము యొక్కవైఖరి జూచినయెడల నతనికేదో యుండ యున్నట్లు విశదమగుచున్నది. చాలా ఉత్సాహముతోను, ధైర్యముతోను సింహనాదము చేయుచున్నాడు. (3) అయోధ్యాధిపతులు, దశరథకుమారులగు రామలక్ష్మణులు, సుగ్రీవునితో మైత్రి జేసికొనినారనియు, ఆరాముని సహాయము సుగ్రీవునకున్నదనియు, యీసంగతి గూఢచారులద్వారా అంగదునకు తెలిసినదనియు, యీసారియుద్ధమునకు బోవుట ప్రమాదకరమనియు వాలిని హెచ్చరికచేసినది. కాని ప్రఖ్యాతబల పౌరుషుడు, అమర్షియునగు వాలి, సుగ్రీవుని నోడించుట తనకు సులభమనియు, ధర్మమూర్తియగు రాముడు తనకపకారము చేయడనియు చెప్పి వెంటనే యుద్ధభూమికిజని, సుగ్రీవునితో యుద్ధముచేయుచు, రామునిచే మరణమునొందెను. తార

ఉదారస్వభావురాలు. ప్రాజ్ఞురాలు. సుగ్రీవుడు ధర్మమూర్తి యనియు, అతనితో వైరముమాని, అతనికి యౌవరాజ్యపట్టాభిషేకము చేసినయెడల నతడన్నివిధముల తనకు నండగాయుండ గలడనియు; సోదరులిద్దరు కలసియున్న యెడల ప్రపంచములో నెవ్వరు తమకపకారము చేయలేరనిగూడచెప్పినది, కాని విధివశుడైన వాలి యీమెమాటలు చెవినిబెట్టలేదు.

తారయొక్క చాతచర్యత, నైపుణ్యము లక్ష్మణునెదుట బ్రదర్శించినది. వాలివధానంతరము పట్టాభిషిక్తుడైన సుగ్రీవుడు, కామభోగలాలసుడై, రామునికి జేసిన వాగ్దానప్రకారము, తనుసీతాన్వేషణకై బెట్టినగడువు దాటెను. దానికి రాముడు కృద్ధుడై సుగ్రీవునికి మరల హెచ్చరిక జేయుమని లక్ష్మణుని బంపెను. లక్ష్మణుడు క్రోధావిష్టుడై సుగ్రీవుని అంతఃపురము ప్రవేశించెను. సుగ్రీవుడు తనతప్పు తెలిసికొని లక్ష్మణుని శాంతింపచేయుటకు తారనుబంపెను. మదవిహ్వాలాక్షియగు తార వినమ్రభావముతో లక్ష్మణుని వద్దకువచ్చినది. ఆమె లక్ష్మణునితో చెప్పినమాటలద్వితీయములు. కోపమునకు కాలముగాదనియు, సుగ్రీవుడు చాలాకాలము పత్నివియోగుడై యుండుటవలన, పట్టాభిషేకమయినపిదప, కామోద్రేకమువలన సుఖములలోబడి కొంతకాలము పేక్షించియుండవచ్చును. కామాతురులైనవారు దేశకాలపాత్రముల విచారించరుగదా? మహర్షులంతవారే కామోద్రేకముచే తమధర్మములమానిరి. ఇకమాబోటి శాఖామృగములు తప్పుచేసినార

నుటలో వింతయేమున్నది? కావున శాంతించి సుగ్రీవుని పొర బాటు క్షమించమని ప్రార్థించినది. లక్ష్మణుడు శాంతించినమీ దట మెల్లగానాతనిమందలించ మొదలిడినది. అన్నిసంగతులు తనకు దెలియుననియు, చిరకాలము బ్రహ్మచర్యవ్రతములో నున్న లక్ష్మణునకుకామోద్రేకముచే మనుజులుచేయుపొరపాట్లు తెలియవని యాక్షేపించి, చివరకు సుగ్రీవుడేమియు తెలియని వాడు కాడనియు, అన్నిసంగతులాతనికి దెలియుననియు, రాముసికి చేసినవాగ్దానము మరచిపోలేదన్నియు, సీతాన్వేషణ ప్రయత్నము కొరకే, నలుదిక్కుల యందున్న వానరుల తీసి కొనివచ్చుటకై అదివరకే దూతలను పంపినాడనియు, వారు వచ్చినతోడనే ప్రయత్నములు జరుగుననియు, అతనేమియు కాలాతిక్రమణము చేయలేదనిగూడ గట్టిగా చెప్పుచున్నది. ఇది యునుగాక, వాలిద్వారా రావణుని బలము తనకు తెలియు ననియు, దశకోటి రాక్షసవీరులకు రాజనియు, దేవదానవ గంధర్వులచే నవధ్యుడనియు, సుగ్రీవుడు, తదితరవానరవీరుల సహాయములేనిది రాముడు రావణుని జయించుట దుర్లభమని గూడ స్పష్టముగా చెప్పుచున్నది. ఆమాటలు విని తనతొందర కు లక్ష్మణుడు పశ్చాత్తాపబడెను. ఈవిధముగా లక్ష్మణుని శాంతింపచేసి నతనిని సుగ్రీవునివద్దకు తీసికొనివెళ్ళిన యుక్తి శాలి. లక్ష్మణసుగ్రీవులిద్దరు తమతప్పులను తెలిసికొని యొకరి నొకరు క్షమార్పణగోరికొనిరి. తదుపరి వారిద్దరు రాముసిసన్నిధికి చేరిరి. ఈవిధముగా లక్ష్మణుని శాంతింపచేసి, రాముని

ఆగ్రహమునకు సుగ్రీవుడాహుతిగాకుండునటుల చేసిన నిపుణు రాలు తార.

శూ ర్ప ణ ఖ

ఈమె రావణునకు, ఖరదూషణులకు సోదరి. తండ్రి విశ్ర వసబ్రహ్మయేగాని తల్లులు వేరు. రావణుని యాదేశప్రకారము, భ ర్తపోయినతర్వాత, ఖరుదూషణాదులవద్ద నివసించుచు, దండ కారణ్యములోనున్న మునులను, ఋషులను బాధించుచుండెడిది.

ఒకనాడామె పర్యటనలలో యాదృచ్ఛికముగా పంచ వటి యందున్న రాముని పర్ణ శాలకడకొచ్చెను. రాముని జూచి మోహించినదై, సీతను మిఁగినగాని రాముడు వశముగాడని తలచినదై ఆమెమీద కురికెను. వెంటనే రాముని యాజ్ఞాను సారము లక్ష్మణుడామె కర్ణనాసికముల ఛేదించెను. ఆపరాభవము, బాధ, సహించలేక గిరికంధరములు ప్రతిధ్వనించునట్లు భైరవ నాదమొనరించుచు, ఖరునివద్దకు బోయి రామలక్ష్మణులవధించ మనియు, వారినెత్తురు త్రాగుటయే యామెప్రధమ కోరిక యనియు జెప్పుచున్నది. శూర్పణఖ ప్రోద్బలముచే ఖరదూష ణాదిరాక్షసులు, 14000, మంది రక్కసులతోసహా రాము నితో యుద్ధముచేసి యొకముహూ ర్తకాలములో నిహతులైరి. రాముని అప్రమేయ పరాక్రమము జూచినదై భయపడి, సోదరులు నిహతులైరని శోకముచేత వెంటనే రావణుని

కడకుబోయి, అతనిని సీతాపహరణమునకు బురిగొల్పును రాముని యుద్ధమున జయించుట దుర్లభమనియు, తనుస్వాయముగానతని పరాక్రమవిజృంభణము చూచితిననియు, సీతత్రిలోకసుందరి యనియు, సీతనపహరించిన యెడల రాముడు తనంతటతానే మరణించుననియు, నొకవేళ బ్రతికినను; శోకోపహతుడైన రాముని జంపుట సులభమనియు ననేకవిధముల దుర్బోధచేసి రావణుని సీతాపహరణమునకు బ్రోత్సహించెను.

ఆమెముఖ్యోద్దేశ్యము, రామలక్ష్మణుల రావణునిచే వధచేయించుట. కాని అదినెరవేరుటకై ఆమెచేసిన ప్రయత్నములన్నియు, రావణవధకు, రాక్షసవధకు కారణములైనవి. తద్వారాలోకకళ్యాణమునకు కారణభూతురాలైనది. పాత్ర చిన్నదైనను, ప్రాముఖ్యతఎక్కువ. శూర్పణఖలేనిది రామాయణములేదు.

మండోదరి

ఈమె రావణుని భార్య, ఇంద్రజిత్, అక్షయకుమారుల కన్నతల్లి. వీరమాత. వీరపత్ని. మహాపతివ్రత. సుందరి.

తనభర్తయగు రావణునితో ననేకసార్లు, రాముడు మానవుడుగాడని, విష్ణువొక్క అవతారమే యనియు, అతనితో వైరముపనికిరాదనియు, సీతనిచ్చివేయమని ప్రాధేయపడినది. కాని కాలచోదితుడగు రావణుడామెహితోపదేశము

వినక రాముని చే మరణించెను. రావణవధానంతరము, రాము డామెను స్వయముగా నోదార్చెను.

స్త్రీ పాత్రలు (శేషము)

ఇక వర్ణనకుమిగిలిన స్త్రీపాత్రలు కొద్దిమందిమాత్రమే. వాటి నీక్రింద నుదహరించుచున్నాను.

అ న సూ య

ఈమె అత్రిమహాముని భార్య. మహాపతివ్రత. రాము డత్రిమహాముని ఆశ్రమమునకు వచ్చినపుడు సీతను యీమెకడకు బంపెను. సీతను కాగలించుకొనినదై యీమెకు అనుసూయ పతివ్రతాధర్మములన్నియు బోధించెను. ఆమె సీతకు, రోజు తనశరీరమునకుబూసుకొనమని, యొక అంగరాగము నిచ్చెను. ఆమె స్వయముగా సీతశరీరమునకాయంగరాగము నలమెను. దానివలన ఆమెశరీరముకొక యద్భుతమగుకాంతికలిగెనని రాముడే వర్ణించినాడు. రావణుని ప్రలోభపెట్టుటకు, నతనివలన సీతకేమియపకారము జరుగకుండుటకు యీఅంగరాగము సీత కనసూయ ఇచ్చినదని యొకప్రతీతిగలదు.

అ హ ల్య

గౌతమునిపత్ని. ఆమెశాపవిమోచనము చేయించుటకే విశ్వామిత్రుడు రామలక్ష్మణుల గౌతముని యాశ్రమమునకు

దీసికొనివచ్చెను. గౌతముని వేషములోయున్న మనిని ఇంద్రు నిగా గుర్తించినదై, ఇంద్రునియందు ప్రేమవలన (దేవరాజ కుతూహలాత్) నాతనితో అహల్య సంభోగించినదని వాల్మీకి రామాయణములో స్పష్టముగా చెప్పబడినది. అందుకనే, గౌతముడు, "అదృశ్యరూపములో వాయుభక్షణచేయుచూ రామసందర్శనము జరుగువరకు నాస్థితిలో యుండెడవని శపించెనని వాల్మీకిరామాయణములో నున్నది. ఇతరరామాయణములలో రాతివిగమ్మనమని శపించినట్లున్నది.

శ బ రి

ఈమె సిద్ధురాలు. శ్రవణి. వన్యజాతిస్త్రీ. విష్ణుభక్తురాలు. ఈమె పంపాతీరముననుండు ఆశ్రమములో తపస్సు చేయుచుండిన బ్రహ్మర్షులకు సేవజేయుచుండెడిది. రోజు మహా విష్ణువును పూజచేయుచుండెడిది. బ్రహ్మర్షులు స్వర్గమునకు బోవుముందు యీమెను రోజు పూజచేయుచుండమనియు, విష్ణువు మానవరూపములో రాముడనుపేర భార్య సహోదరులతో, తన యాశ్రమమునకు వచ్చుననియు, అప్పుడామెకు విముక్తిగలుగునని ఆశీర్వదించెదరు. అప్పటినుంచి, వనములో మంచిపండ్లు సేకరించుచూ రాముడు వచ్చినప్పుడాయనకు అతిథి సత్కారములుచేసి ముక్తినొందిన భక్తురాలు. ఇతరరామా

యణములలో శబరి రుచిజూచిన ఎంగిలిపండ్లను పెట్టినదని వున్నది కాని వాల్మీకిరామాయణములో మంచిపండ్లను సేకరించి అట్టిపెట్టినదని వున్నది.

తా ట క

ఈమె యక్షిణి, కామరూపిణి, మారీచునితల్లి. ఆమె భర్త అగస్త్యుని శాపముచే మరణించెను. కోపముచే నగస్త్యుని క్రుంగబోగా, క్రూరరక్కసివి గమ్మని శపించెను. ఆమె నగరములను ధ్వంసముచేసి నిర్మానుష్యముగాచేసి తాటకావనమును ఏర్పరుచుకొనెను. విశ్వామిత్రుడు రాముని తాటకావనములోనికి తీసికొనివచ్చిన వెంటనే యామె రామునిమీదికురికెను. స్త్రీవధచేయుటకు రాముడు ప్రథమమున శంకించెను గాని, విశ్వామిత్రు నాజ్ఞాప్రకారము, దుష్టచారిణియగు రాక్షసిని వధించెను. రాక్షసులలో రామునిబాణమున కాహుతియైన ప్రథమవ్యక్తి యీమె.

స ర మ, త్రి జ ట

వీరిద్దరు రాక్షసస్త్రీలు. సరమ, విభీషణునిభార్య. రావణుడు విద్యుజ్జిహ్వుడను నొకమాయావితో యశోకవనికకువచ్చి,

మాయరాముని శిరస్సు సీత ముందుబెట్టి, రాముడు ప్రహస్తునిచే చంపబడినాడనియు, తనను ప్రేమించమని చెప్పిపోయెను. సరమ, యిదిరావణుని మాయఅనియు, రాముడు మరునాడే యుద్ధము ప్రారభించునని చెప్పి సీతనోదార్చెను.

త్రిజట, పవనాత్మజుడు శింశుపావృక్షమెక్కినరాత్రి, రాక్షస స్త్రీలందరు సీతను బాధించుచుండగా, ఆమెను బాధించవలదని నివారించెను. లంక నాశనమయినట్లు, రాక్షసులు, రావణుడు మరణించినట్లు, సీతను రాముడంకముమీాదనిడుకొని అయోధ్యకు వెళ్ళినట్లు, తాను ఒక కలగంటిననియు, సీతను బాధించిన, వారలకు ప్రమాదము కలుగుననిగూడా చెప్పి, వారల నివారించెను.

రామలక్ష్మణులు, నాగపాశబద్ధులైనరాత్రి, రావణుడు వారలు మరణించిరనియు, తనుస్వాయముగా వెళ్ళి చూడవచ్చుననియు సీతతో చెప్పి, యామెను పుష్పకవిమానముమీాద తీసికొనివెళ్ళి యుద్ధభూమిలో మరణించిన రామలక్ష్మణుల కళేబరములుచూపమని త్రిజట నాదేశించెను. సీత పుష్పకవిమానము మీాదినుంచి, నిశ్చేతనులై పడియున్న వారలచూసి బహువిలపించెను. వారుచావలేదనియు, ముఖములలోజీవకళయున్నదనియు, పుష్పకవిమానము విధవల నెక్కించుకొనదనియు చెప్పి త్రిజట యామెను ఓదార్చెను. ఈవిధముగా సరమాత్రిజటలు కష్టసమయములలో సీతకు సహాయమొనరించి ధన్యులైరి.

వాల్మీకిరామాయణములోని స్త్రీ పాత్రలు

సీతవిషయమై విపులముగా నిదివరలోనే చర్చించబడి నది. ఆమె రావణవధకుద్భవించిన శ క్తియని నిరూపింపబడినది.

ఆమెతర్వాత ముఖ్యపాత్రలు కైక, మంథర, శూర్ప ణఖలు. ఉద్దేశ్యములువేరైనను, రావణవధకు తద్వారా జగ త్కళ్యాణమునకు కారణభూతులైనారు. కైక భరతునికొఱకు రామవనవాసము కోరినది. మంథరకారణ మేమియులేకయే కౌసల్యాదాసి హేళనపూర్వకముగా బలికినమాటలే యొక నెపముగా తీసికొని, ఈర్ష్యాగ్ర స్తయై రామపట్టాభిషేకభంగ మొనరించి, రాముని వనవాసమునకు బంపించినది. శూర్పణఖ రామునియందున్నప్రేమచే సీతను భ్రమింగబోయి, లక్ష్మణునిచే పరాభవింపబడి ఆబాధసహించలేక అమర్ష జనితక్రోధయై రామ లక్ష్మణవధకై విశ్వప్రయత్నములు చేసినది. కాని ఆప్రయత్నము లన్నియు రావణవధకు, రాక్షసవధకు కారణములైనవి. మాండ వీశృతకీర్తులు, యుధాజిత్ కేకయమహారాజులు మాదిరి బంధు త్వరీత్యా చెప్పబడినవారు. వారుచేసినపని ఏమియులేదు. కౌసల్యాసుమిత్రలిద్దరు యుత్తమమాతలు, మహాపతివ్రతలని నిరూపించుకొని తమప్రియపుత్రుల నరణ్యమునకు బంపిరి. తారా మండోదరులిద్దరు పతివ్రతలు. వారిద్దరు రామునితో యుద్ధము వలదని తమభర్తలకు బోధించిరి. మృత్యుబారినుంచి వారల తప్పించవలెనని విశ్వప్రయత్నములుచేసినారు. కాని దురహం

కారపూరితులగువారి భర్తలు, వారిమాటలు వినక రామబాణ ముచే నిహతులైరి. రావణవధకు రామునికితరులసహాయము కావలసివచ్చినది. దేవతలందరు తమతమయంశములచ, వానర వీరులను రామసహాయార్థమై బుట్టించిరి. సీత కామెశీలము, పాతి వ్రత్యమే, సహాయముచేసినవి. పవనాత్మజుడొకడే యీమెకు సహాయ మొనరించెను. ఆమెసందేశము రాముసికిజెప్పి సేతుబంధ నము చేయించి, రామునిచే రావణవధ జరిపించెను. కనుకనే, యీమె తనకృతజ్ఞత వెలిబుచ్చుటకై, శ్రీరామపట్టాభిషేక కాలమందు, భర్తతనకిచ్చిన ముక్తామణిహారము కృతజ్ఞతా పూర్వక ప్రసన్నదృష్టితో నాంజనేయుని మెడలోవైచినది. సరమ, త్రిజటలు కష్టసమయములో సీతనోదార్చి ధైర్యము కలిగించిరి. సీతకంతకంటె సహాయమవసరములేదు. ఆమె యూరకనేయుండి, రామునిబ్రేరేపించి, రామునిచేత కార్య మంతయు నడిపించిన మహాశక్తి. ఆమెలేనిది రామాయణమే లేదు.

"శివశక్త్యాయుక్తోయదిభవతిశక్తః ప్రభవితుమ్
నచేదేవందేవః నఖలుకుశలస్పందితుమపి"

పరమేశ్వరుడు శక్తితోగూడిన యేదేనిపనిచేయగలడు. లేనిచో కదలనైన కదలలేడు.

ఓం తత్ సత్ బ్రహ్మార్పణమస్తు

మం గ ళ శ్లో క ము

శ్లో॥ నమోస్తు రామాయ చ లక్ష్మణాయ
నమోస్తుదేవ్యై జనకాత్మజాయ
నమోస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క-మరుద్గణేభ్యః

సర్వేజనాః సుఖినోభవంతు !

ఇయ్యది శ్రీ గౌతమసగోత్ర అన్నపూర్ణాంబా, రామ కోట్యార్యపుత్ర సుబ్రహ్మణ్య నామధేయ ప్రణీతంబైన శ్రీరామాయణ విమర్శామృత మనెడి గ్రంథము, పరి సమాప్తము.

శ్రీ శ్రీ శ్రీ

తప్పుల పట్టిక

ఈగ్రంథములో కొన్నిచోట్ల 'సి' యను అక్షరమునకు బదులు 'శి' యును, 'ధ' యను అక్షరమునకు 'థ' యును ముద్రింపబడియున్నవి. ఈలోపమును పాఠకులు గమనింతురు గాక !

పేజి	పంక్తి	తప్పు	ఒప్పు
4	14	బకటే	ఒకటే
6	12	శోక్ష్యతి	భోక్ష్యతి
6	9	హ్యావిధ్వాన్	హ్యావిద్వాన్
7	14	శుభాబారాం	శుభాచారాం
11	21	పోటకు	పోవుటకు
15	4	ద్రాశిన	ద్రాసిన
28	16	నివృత్తిపినః	నివృత్తినః
44	10	ఆశ్చర్యా	ఆశ్చర్య
50	11	న్మృగయాం	మృగయాం
50	12	పరిపాలయాన్	పరిపాలయన్
54	6	నటుటలనే	నటులనే
56	21	విన్నివృత్తు	వినివృత్త
60	5	వలశి	వలసి
66	21	మహార్షాసి	మిహార్షాసి
67	2	కులపాంసనం	కులపాంసనః
76	6	న్నత్య	నృత్య
80	21	రోజులుండనచ్చు	రోజులుండవచ్చు
82	16	కిచ్చెదు	కిచ్చెను

పేజి	పంక్తి	తప్పు	ఒప్పు
86	11	రాజులతో	రాజులకు
97	14	వదనగహ్వరములలో	వదనగహ్వరములో
100	17	భేదించి	ఛేదించి
101	2	నుభశూచకములు	శుభసూచకములు
102	16	జీలిత	జ్వలిత
102	16	మానసాం	మానసం
103	14	పరాస్యాసి	పరాహ్యాసి
103	13	మహాత్మనా	మహాత్మనా
103	17	తన	తవ
105	20	రాక్షసేశ్వరం	రాక్షసేశ్వరః
107	12	యనుమిలిన	యనుమతిన
115	15	రాక్షసము	రాక్షసు
116	9	లెక్షి	లెక్క
119	10	చేస్తి	చేసి
136	10	క్రోధస్ఫారితేక్షణుడై	క్రోధవిస్ఫారితేక్షణుడై
141	2	జినించిన	జనించిన
142	17	జేష్టులు	జ్యేష్టులు
146	19	ఆయాచరము	ఆయాచారము
160	11	వివాహ	వివాహము
174	18	ఋజ	ఋజు
178	14	పట్టాభిషే	పట్టాభిషే
182	3	దూషణల	దూషణుల
190	7	గౌతమసగోత్ర	గౌతమసగోత్రః

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.N.A.R.L.A
D.P.R.I.
Acc. No

BCT

AOUA10UB137

V.R.NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
ACC. No.

13C

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B137
పుస్తకం పేరు	శ్రీరామాయణ విమర్శామృతము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	231
పెద్ద సైజు పేజీలు	NO C.J. 4, 6 10
ఖాళీ పేజీలు	5,6,
లేవి పేజీలు	
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P. Jayamma
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good

,bci